16-04-2026

# విశాల భారతి

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

గురువారం, హైదరాబాద్ | సంపుటి:4 సంచిక: 105



## హస్తం పార్టీలో అసంతృప్తి హోరు..!

- పదవులు రాక ఫిరాయింపు ఎమ్మెల్యేలు మళ్లీ బీఆర్ఎస్ వైపు
- నిధుల కోసం "ప్రభుత్వం ఉందా?" అని మాజీ స్పీకర్ ప్రశ్న
- పదవులు దక్కని రాజగోపాల్ రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి అసహనం
- నిజామాబాద్, రంగారెడ్డి జిల్లాలకు క్యాబినెట్‌లో చోటు లేదు
- పీసీసీ చీఫ్‌పై కోమటిరెడ్డి విమర్శలు, అంతర్గత పోరు
- ఢిల్లీ మద్దతు ఉన్నా సొంత నేతల అసంతృప్తి పెద్ద సవాలు

03



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాజకీయ సలహాదారుగా విశేష సేవలు అందించిన వేం నరేందర్ రెడ్డి నేడు రాజ్యసభ సభ్యునిగా బాధ్యతలు స్వీకరించనున్నారు. హస్తిన వేదికగా జరగనున్న ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త చర్చకు దారితీస్తోంది. నరేందర్ రెడ్డికి సొంత గడ్డయిన మహబూబాబాద్ జిల్లాపై ఉన్న మమకారంతో అన్ని నియోజకవర్గాల అభివృద్ధిపై ఆయన ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారు. ముఖ్యంగా పాలకుర్తి నియోజకవర్గంపై ఆయన తనదైన శైలిలో ప్రత్యేక దృష్టి సారిస్తూ క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తున్నారు. బీఆర్ఎస్ ఎంపీల పదవీకాలం ఈ నెల 9వ తేదీతో ముగిసిన నేపథ్యంలో, నేటి నుండి ప్రారంభం కానున్న ఉభయ సభల ప్రత్యేక సమావేశాల్లో ఆయన ఎంపీగా ప్రమాణ స్వీకారం చేసి పెద్దల సభలో అడుగుపెట్టనున్నారు. ఈ చారిత్రక ఘట్టానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు రాష్ట్ర కేబినెట్‌లోని పలువురు మంత్రులు, శాసనసభ్యులు హాజరై నరేందర్ రెడ్డికి తమ మద్దతు తెలపనున్నారు.

# పెద్దల సభకు వేం

## సీఎం రేవంత్ ఆప్తుడు వేం నరేందర్‌రెడ్డి నేడు ఎంపీగా ప్రమాణ స్వీకారం

- పాలకుర్తి నియోజకవర్గంపై వేం తనదైన శైలిలో ప్రత్యేక దృష్టి
- దశాబ్ద కాలంగా రేవంత్‌రెడ్డికి నమ్మకమైన స్నేహితుడు, వ్యూహకర్త
- సీనియర్లను కాదని తన మిత్రుడికే రేవంత్ రెడ్డి సీటు ఇప్పించారు
- కేవీపీ తరహాలో ఢిల్లీ-హైదరాబాద్ మధ్య కీలక పాత్ర పోషించనున్నారు
- సామాన్య కార్యకర్త నుంచి నేడు పెద్దల సభకు ఎదిగిన నేత
- ఈ ఘట్టం కోసం రేవంత్, మంత్రులు, ఎమ్మెల్యేలు ఢిల్లీ వెళ్లారు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** 2004 అసెంబ్లీ ఎన్నికల్లో మహబూబాబాద్ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా ఘనవిజయం సాధించి తొలిసారి శాసనసభలో తన గళాన్ని వినిపించారు. ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో వరంగల్ పశ్చిమ నుండి, ఎమ్మెల్సీ ఎన్నికల్లో అభ్యర్థిగా పోటీ చేసినా ఫలితాలు అనుకూలంగా రాలేదు. 2017వ సంవత్సరంలో రేవంత్ రెడ్డితో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరడం నరేందర్ రెడ్డి రాజకీయ జీవితంలో ఒక పెద్ద మలుపుగా నిలిచింది. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి వెన్నంటే ఉండి 2021లో తెలంగాణ పీసీసీ ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించి రాష్ట్రవ్యాప్తంగా పార్టీ కార్యకర్తలను సమన్వయం చేశారు. 2024 జనవరిలో రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా మిగతా 2లో..

నరేందర్ రెడ్డి వ్యక్తిగత నేపథ్యాన్ని పరిశీలిస్తే ఆయన రాజకీయ ప్రయాణం ఎంతో స్ఫూర్తిదాయకంగా కనిపిస్తుంది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం అర్పనపల్లిలో 1960 డిసెంబరు 26వ తేదీన వెంకటమ్మ, చెన్నకృష్ణారెడ్డి దంపతులకు ఆయన జన్మించారు. విద్యార్థి దశ నుండే సామాజిక అంశాలపై పట్టు సాధించిన ఆయన వరంగల్‌లోని సీకేఎం కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. అనంతరం రాజనీతి శాస్త్రంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్ పట్టా పుచ్చుకుని ప్రజా సేవలో నిమగ్నమయ్యారు. ఆయన భార్య విజయలక్ష్మి కుటుంబ బాధ్యతలు చూసుకుంటుండగా, కుమారులు కృష్ణ భార్గవ్, కృష్ణ కీర్తన్ తమ తండ్రి ఆశయాలకు అనుగుణంగా ఎదుగుతున్నారు. గ్రామీణ నేపథ్యం నుండి వచ్చిన ఒక సామాన్య రైతు బిడ్డ నేడు దేశ అత్యున్నత చట్టసభకు వెళ్లడం వెనుక దశాబ్దాల కష్టం, అంకితభావం దాగి ఉన్నాయి. రాజకీయ ప్రస్థానంలో ఎన్నో ఎత్తుపల్లాలను చూసిన నరేందర్ రెడ్డి తన సోదరుడు పురుషోత్తం రెడ్డి స్ఫూర్తితో 1982లో తెలుగుదేశం పార్టీ ద్వారా రాజకీయ అరంగేట్రం చేశారు. పార్టీలో క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా పనిచేస్తూ తెలుగు రైతు రాష్ట్ర సహాయ కార్యదర్శిగా, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కీలక బాధ్యతలు నిర్వహించారు. 2001లో నల్లబెల్లి జడ్పీటీసీ సభ్యునిగా పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమిని చవిచూసినా ఆయన ఏమాత్రం వెనకడుగు వేయలేదు.



## టీటీడీపీ బోర్డు ఉంది.. బాస్ లేరు!

- ఏపీ కమిటీ ఇచ్చి, తెలంగాణను పక్కనపెట్టారు
- రెండేళ్లుగా తెలంగాణకు అధ్యక్షుడే లేరు
- జాతీయ కమిటీలో తెలంగాణకు తగ్గని ప్రాధాన్యం
- చంద్రబాబు, లోకేశ్ తీరుపై కార్యకర్తల ఆగ్రహం
- విన్నవించినా హైకమాండ్ పట్టించుకోవడం లేదు
- నాయకత్వం లేక పార్టీ పరిస్థితి ప్రశ్నార్థకం

03

# మహిళల ముసుగులో మోసం

- డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్లపై మూడు కొత్త బిల్లులు
- లోక్‌సభ స్థానాలను 543 నుండి 850కి పెంచే ప్లాన్
- 2011 జనాభా లెక్కల వల్ల దక్షిణాదికి సీట్లు తగ్గే ముప్పు
- జనాభా ఎక్కువ ఉన్న ఉత్తరాదికే ఎక్కువ ఎంపీ సీట్లు
- పాత నిబంధనలు మార్చేలా రాజ్యాంగ 131వ సవరణ
- సాధారణ మెజార్టీతోనే బిల్లులు నెగ్గించుకునే వ్యూహం




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** మహిళా బిల్లు ముసుగులో కేంద్ర ప్రభుత్వం లోక్‌సభ స్వరూపాన్ని సమూలంగా మార్చేందుకు సిద్ధమైందనే ఆరోపణలు రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే సాకుతో తెరపైకి వచ్చిన ఈ ప్రత్యేక పార్లమెంటు సమావేశాలు, వాస్తవానికి దక్షిణాది రాష్ట్రాల గొంతు నొక్కే కుట్రగా ప్రతిపక్షాలు అభివర్ణిస్తున్నాయి. ప్రభుత్వం ప్రతిపాదించిన మూడు కీలక బిల్లుల ముసాయిదాను పరిశీలిస్తే, అధికార బీజేపీ తన రాజకీయ ప్రయోజనాల కోసం నియోజకవర్గాల పునర్విభజన అస్త్రాన్ని ప్రయోగిస్తోందని స్పష్టమవుతోంది. ముఖ్యంగా 2026 డీలిమిటేషన్ బిల్లు, మిగతా 3లో..

## నామినేటెడ్ పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్

- ప్రభుత్వం, పార్టీ పనితీరుపై ఇన్-చార్జ్ సుదీర్ఘ చర్చ
- నామినేటెడ్ పోస్టులకు గ్రీన్ సిగ్నల్; త్వరలో జీవోలు
- ఎమ్మెల్యేల అసహనం, జీవన్ రెడ్డి రాజీనామాపై విశ్లేషణ
- జీహెచ్ఎంసీ ఎన్నికలు, డీలిమిటేషన్‌పై వ్యూహరచన
- కూటమి భేటీ కోసం సీఎం రేవంత్ ఢిల్లీ పర్యటన
- ఈ నెల 20న బ్యారేజీ పనుల పరిశీలనకు సీఎం పయనం



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీ తన పాలనా వేగాన్ని, పార్టీ సంస్థాగత బలోపేతాన్ని సమన్వయం చేసుకునే దిశగా అడుగులు వేస్తోంది. బుధవారం రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్ చార్జ్ మీనాక్షి నటరాజన్ నేతృత్వంలో జరిగిన సుదీర్ఘ సమీక్షా సమావేశం ఇటు ప్రభుత్వంలోనూ, అటు పార్టీ శ్రేణుల్లోనూ కొత్త ఉత్సాహాన్ని నింపింది. మిగతా 2లో..



## డీలిమిటేషన్‌పై రేవంత్ అబద్ధాలు

- పెరిగిన జనాభాకు తగ్గట్టుగా ఎంపీ సీట్లు పెరగాల్సిందే
- సీఎం చెబుతున్న హైబ్రిడ్ సిస్టమ్ అర్థం లేనిదని విమర్శ
- దేశంలో విభజన తేవడానికే కాంగ్రెస్ దక్షిణాది కార్డు వాడుతోంది
- రిజర్వేషన్లు అడ్డుకోవడానికే కాంగ్రెస్ కొత్త పంచాయితీ
- సెక్షన్ 81 ప్రకారమే సీట్ల పెంపు ఉంటుందని స్పష్టత

05

# కేసీఆర్ మౌన వ్రతం

- కీలక బిల్లులపై కేసీఆర్ బయటకు రాకపోవడంపై విమర్శలు
- మహిళా రిజర్వేషన్, పునర్విభజనపై వైఖరి చెప్పలేదు
- కేంద్రంపై సీఎం గళమెత్తుతున్నా కేసీఆర్ నోరు విప్పడం లేదు
- కేటీఆర్, హరీష్‌లతో చర్చల వివరాలు లీకులకే పరిమితం
- కీలక అంశాల్లో మౌనం వల్ల తెలంగాణకు అన్యాయం జరిగే ఛాన్స్
- కేంద్రంపై స్పందించకపోవడం వెనుక హిడెన్ అజెండా ఉందనే చర్చ



04

## చదువు.. ప్రాణాలు తీసేంత భారమా..?

- ఫలితాల వేళ పిల్లల ఆత్మహత్యలు పెరగడం ఆందోళనకరం
- విద్యాసంస్థలు మార్కుల కోసమే పిల్లలను బందీలుగా చేస్తున్నాయి
- పిల్లలను ఇతరులతో పోల్చి తల్లిదండ్రులు ఒత్తిడి పెంచకూడదు
- గెలుపుతో పాటు ఓటమిని స్వీకరించేలా పిల్లలను తీర్చిదిద్దాలి
- ఏ పరిస్థితిలోనైనా తోడుంటామనే నమ్మకం పిల్లలకు ఇవ్వాలి
- మార్కుల కంటే పిల్లల్లోని టాలెంట్‌ను గుర్తించి గౌరవించాలి

02





## అన్యాయం చేస్తే ఉద్యమం తప్పదు

- అన్యాయం జరిగితే దక్షిణాదిలో భారీ పోరాటం తప్పదు
- దక్షిణ భారతీయుల ప్రయోజనాల కోసం రాజీపడబోం
- ప్రాతినిధ్యం తగ్గించడం ప్రజాస్వామ్యానికే విరుద్ధం
- జనాభా తగ్గించిన రాష్ట్రాలను అణచివేయడం సరికాదు
- పాత నిర్ణయానికే కట్టుబడి ఉన్నామని స్పష్టత
- ఢిల్లీ పాలకులు వాస్తవాలు గుర్తించాలని హితవు

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:** దేశంలో 'డీలిమిటేషన్' అనే అంశం పెను సంచలనంగా మారింది. నియోజకవర్గాల పునర్విభజన పేరిట కేంద్ర ప్రభుత్వం వేయబోయే అడుగులు దక్షిణాది రాష్ట్రాల ఉనికిని, మిగతా 4లో..

# భానుడి ప్రతాపం అల్లాడుతున్న జనాలు



- అడవిదేవులపల్లి లో 43.10 డిగ్రీలు..!
- రాగాల నాలుగు రోజులు 44,45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ అవకాశం

**అడవిదేవులపల్లి, విశాలభారతి:**

అడవిదేవులపల్లి మండలంలో భానుడు భగభగలాడుతున్నాడు. బుధవారం అడవిదేవులపల్లి మండల కేంద్రంలో అత్యధికంగా 43.10 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఏప్రిల్ మొదటి వారంలో వేసవి తాపానికి ప్రజలు అల్లాడుతున్నారు. ఎండను దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఏప్రిల్ మొదటి వారంలో భగభగలాడుతున్న సూర్యుడు తన ప్రతాపాన్ని పెంచేశాడు. గత గత వారం రోజుల నుంచి ఎండ తీవ్రరూపం దాల్చింది. పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. నల్లగొండ జిల్లాలో గతేడాది ఇదే సమయానికి పగటి పూట అత్యధికంగా 36 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా ఈ ఏడాది 43.10 డిగ్రీలకు చేరుకుంది. జిల్లాలో పలు నియోజకవర్గలలో పరిధిలోని నాగార్జునసాగర్, మిర్యాలగూడలో 39 డిగ్రీలు నమోదు కాగా, దేవరకొండ మారుమూల గిరిజన తండాలలో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అత్యధిక ఉష్ణోగ్రతల వల్ల ఎండ సెగ తీవ్ర స్థాయిలో కనిపించింది. ఎండ ధాటికి తట్టుకోలేక మధ్యాహ్నం పూట రోడ్ల మీద జన సంచారం పలుచబడింది. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ రోడ్ల మీద జనం చాలా తక్కువగా కనిపించారు. అత్యవసర పనుల విషయంలో మినహాయించి మిగతా సందర్భాల్లో రోడ్ల మీదకు వచ్చేందుకు జనం జంకే పరిస్థితి ఏర్పడింది. జిల్లా కేంద్రమైన క్లాక్ టవర్ సెంటర్లో మధ్యాహ్నం పూట నిర్మానుష్యంగా కనిపించాయి. ఎక్కువ ప్రమాదం ఎవరికంటే ఎండ సమయం లో బయట ఎక్కువగా తిరగడం వల్ల పిల్లల్లో ఎక్కువగా వడదెబ్బ తగిలే అవకాశం ఉందని వైద్యులు అంటున్నారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, క్రీడాకారులు, బాలింతలపై ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. దీర్ఘకాలిక వ్యాధులు, స్థూలకాయం ఉన్నవారు, మద్యం ఎక్కువగా తీసుకునే వారు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. జాగ్రత్తలు తప్పవంటున్న నిపుణులు ప్రజలు బయటకు తిరిగే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు, వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వడదెబ్బ వంటివి తగలకుండా నీటిని ఎక్కువగా తీసుకుంటూ సాధ్యమైనంత వరకు నీడలో ఉండాలని సూచిస్తున్నారు. వడదెబ్బ తగిలిన తర్వాత మళ్లీ ఎండలోకి వెళ్లకూడదని, చల్లని నీడలో విశ్రాంతి తీసుకోవాలని అంటున్నారు. బయట తిరిగే సమయంలో తలకు టోపీ పెట్టుకోవాలని, గొడుగు వాడాలని, రోజుకు ఐదు లీటర్లకు తగ్గకుండా నీరు తాగాలని, సమయానికి ఆహారం తీసుకోవాలని, ఉప్పు కలిపిన ద్రావాలు తాగాలని, శరీరంలో నీటి శాతాన్ని పెంచుకునేందుకు పుచ్చకాయ, కొబ్బరి నీళ్లు తాగాల తాగాలని, వదులైన కాటన్ దుస్తులు. ధరించాలని సూచిస్తున్నారు.

# పెద్దల సభకు వేం





**మొదటిపేజీ తరువాయి**

బాధ్యతలు చేపట్టిన వెంటనే నరేందర్ రెడ్డిని క్యాబినెట్ హోదాతో ముఖ్య సలహాదారుగా ప్రభుత్వం నియమించింది. ప్రభుత్వ నిర్ణయాల్లో, రాజకీయ వ్యూహాల్లో కీలక పాత్ర పోషిస్తున్న ఆయన తన అపార అనుభవంతో పరిపాలనకు చేదోడు వాదోడుగా నిలుస్తున్నారు. ఆయన నమ్మకానికి, నిబద్ధతకు గుర్తింపుగానే నేడు రాజ్యసభ సభ్యత్వం వరించింది. రేవంత్ రెడ్డి, నరేందర్ రెడ్డి మధ్య ఉన్న అనుబంధం కేవలం రాజకీయాలకే పరిమితం కాలేదు. రక్త సంబంధం లేకపోయినా అన్నదమ్ముల కంటే మిన్నగా వీరు ఒకరికొకరు తోడుగా నిలిచారు. రాజకీయ భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిన తరుణంలో కూడా ఒకరిపై ఒకరు నమ్మకం కోల్పోకుండా పోరాటం సాగించారు. తన కోసం ఒక అడుగు ముందుకేసి కష్టాల్లో పడ్డ తన ఆత్మీయుడి కోసం నరేందర్ రెడ్డి ఎంతో తాపత్రయపడ్డారు. జైలు గోడల మధ్య కాలం గడిపినా, నిద్రలేని రాత్రులు గడిపినా వారి బంధం మరింత బలపడిందే తప్ప సడలలేదు. అన్నీ తానై వ్యవహరిస్తున్న తన మిత్రుడికి రాజ్యసభ సీటు దక్కేలా రేవంత్ రెడ్డి చేసిన ప్రయత్నాలు నేడు ఫలించాయి. కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థుల ఎంపికలో నరేందర్ రెడ్డి పేరు ఖరారు కావడానికి ముందు రాష్ట్ర స్థాయిలో తీవ్రమైన పోటీ నెలకొంది. సుమారు 16 మంది సీనియర్ నేతలు ఈ రేసులో నిలిచారు. అధిష్టానం వద్ద పలువురు నేతలు పెద్ద ఎత్తున లాబీయింగ్ చేసినా ముఖ్యమంత్రి మాత్రం తన నిర్ణయానికే మొగ్గు చూపారు. తనకు అత్యంత నమ్మకస్తుడైన వ్యక్తికి ప్రాధాన్యత ఇవ్వాలని రేవంత్ రెడ్డి పట్టుబట్టడంతో హైకమాండ్ చివరకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రియాంక గాంధీ వంటి అగ్రనేతలు కూడా ఈ సీటు విషయంలో ఆసక్తి కనబరిచినప్పటికీ రేవంత్ రెడ్డి తన వివేచనతో నరేందర్ రెడ్డికి మార్గం సుగమం చేశారు. ఇది రేవంత్ రెడ్డి రాజకీయ చాకచక్యానికి నిదర్శనమని పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. తెలంగాణ కాంగ్రెస్‌లో నేటి పరిణామం గతంలో వైఎస్సార్ హయాంలోని రాజకీయాలను గుర్తుకు తెస్తోంది. నాటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డికి కేవీపీ రామచందర్ రావు ఏ విధంగా ఆత్మగా ఉండేవారో, నేడు రేవంత్ రెడ్డికి నరేందర్ రెడ్డి అదే విధంగా ఉంటున్నారు. వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు రాజకీయ వ్యవహారాలన్నీ కేవీపీ కనుసన్నల్లోనే సాగేవి. ఇప్పుడు తెలంగాణలో కూడా పొలిటికల్ సెటిల్‌మెంట్లు, పార్టీ అంతర్గత వ్యవహారాలను నరేందర్ రెడ్డి అత్యంత నైపుణ్యంతో నిర్వహిస్తున్నారు. సీఎంపై ఎటువంటి రాజకీయ ఒత్తిడి పడకుండా అడ్డుగా నిలుస్తూ పరిపాలన సజావుగా సాగేలా చూస్తున్నారు. ప్రభుత్వంలో నెంబర్ టూ పాత్రను పోషిస్తూ రేవంత్ రెడ్డికి తిరుగులేని భరోసాగా నిలుస్తున్నారు. కాంగ్రెస్ జాతీయ పార్టీ కావడంతో ఢిల్లీ స్థాయిలో ప్రతిరోజూ అనేక కీలక చర్చలు జరుగుతుంటాయి. ఈ నేపథ్యంలో తనకు అత్యంత సన్నిహితుడైన వ్యక్తి రాజ్యసభలో ఉంటే జాతీయ స్థాయి రాజకీయాల్లో తెలంగాణ వాణిని వినిపించడం సులభమవుతుందని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ప్రతీ చిన్న విషయానికి తాను ఢిల్లీ వెళ్లాల్సిన అవసరం లేకుండా నరేందర్ రెడ్డి అక్కడ అన్ని వ్యవహారాలను చక్కబెడతారని ముఖ్యమంత్రి నమ్ముతున్నారు. హస్తినలో తెలంగాణ ప్రయోజనాలను కాపాడటంతో పాటు కేంద్రంతో సమన్వయం సాధించడంలో నరేందర్ రెడ్డి కీలక వారధిగా మారనున్నారు. ఈ క్రమంలోనే అందరి అంచనాలను తలకిందులు చేస్తూ తన మిత్రుడిని పెద్దల సభకు పంపడంలో సీఎం విజయం సాధించారు. ఓటుకు నోటు కేసు సమయంలో నరేందర్ రెడ్డి ఎదుర్కొన్న విచారణ, పడిన ఇబ్బందులు వారిద్దరి మధ్య ఎమోషనల్ బాండింగ్‌ను మరింత పెంచాయి. రేవంత్ రెడ్డిని ఎమ్మెల్సీ చేసే క్రమంలో చిక్కుల్లో పడ్డ నరేందర్ రెడ్డి ఆ సమయంలో తీవ్ర మనోవేదనకు గురయ్యారు. ఆ సంక్షోభం నుండి బయటపడిన తర్వాత వారిద్దరూ మరింత దృఢ నిశ్చయంతో ముందుకు సాగారు. కష్టకాలంలో తనను విడిచి వెళ్లని ఆత్మీయుడిని గౌరవించుకోవడం రేవంత్ రెడ్డికి ఉన్న కృతజ్ఞతకు నిదర్శనం. రాజకీయాల్లో కృతజ్ఞత అనేది అరుదుగా కనిపించే కాలంలో ఈ మిత్రద్వయం నైతిక విలువలకు పెద్దపీట వేస్తోంది. నరేందర్ రెడ్డికి లభించిన ఈ పదవిని ఒక వ్యక్తిగత విజయంగా కాకుండా వారి సామూహిక పోరాటానికి దక్కిన గౌరవంగా భావిస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి నరేందర్ రెడ్డి ముఖ్యమంత్రి సలహాదారుగా రాజకీయాల్లో చురుగ్గా వ్యవహరిస్తున్నారు. పరిపాలనలో ఎటువంటి అవరోధాలు ఎదురైనా తన అనుభవంతో వాటిని పరిష్కరిస్తున్నారు. అసంతృప్త నేతలను బుజ్జగించడంలో, ఇతర పార్టీల నుండి చేరికలను సమన్వయం చేయడంలో ఆయన వ్యూహాలు అద్భుతంగా పనిచేస్తున్నాయి. ఇప్పుడు ఎంపీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన పరిధి మరింత విస్తరించనుంది. రాష్ట్ర రాజకీయాలతో పాటు దేశ రాజధానిలో కూడా ఆయన తన మార్క్ పాలిటిక్స్ ప్రదర్శించనున్నారు. కేవీపీ రామచందర్ రావు మాదిరిగానే హస్తినలో తెలంగాణ కాంగ్రెస్ గొంతుకగా ఆయన కీలక పాత్ర పోషించనున్నారు. నేడు పార్లమెంట్ భవనంలో జరగనున్న ప్రమాణ స్వీకారంతో నరేందర్ రెడ్డి రాజకీయ జీవితంలో ఒక సువర్ణ అధ్యాయం మొదలుకాబోతోంది. సామాన్యుల సమస్యలను పెద్దల సభలో వినిపించడానికి ఆయన సిద్ధమవుతున్నారు. పాలకుర్తి వంటి నియోజకవర్గాల అభివృద్ధిని కాంక్షిస్తూనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తానని ఆయన సన్నిహితుల వద్ద ధీమా వ్యక్తం చేస్తున్నారు. రేవంత్ రెడ్డి వేగానికి అనుగుణంగా నడుస్తూ కాంగ్రెస్ పార్టీని మరో పదేళ్ల పాటు అధికారంలో ఉంచేందుకు అవసరమైన రాజకీయ వ్యూహాలను ఆయన సిద్ధం చేయనున్నారు. మిత్రుడి నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ నరేందర్ రెడ్డి రాజ్యసభలో ఏ విధంగా రాణిస్తారో చూడాలి. ఎట్టకేలకు ఒక సామాన్య రైతు బిడ్డ రాజకీయ సలహాదారు స్థాయి నుండి రాజ్యసభ సభ్యుని వరకు ఎదిగిన ఈ ప్రయాణం అద్భుతం.



# చదువు.. ప్రాణాలు తీసేంత భారమా..?

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

నేటి సమాజంలో విద్యార్థుల బలవన్మరణాల వార్తలు వింటుంటే గుండె తరుక్కుపోతోంది. కన్నవారి కలలను నిజం చేయాల్సిన బిడ్డలు, పరీక్షా ఫలితాలు విడుదలయ్యే సమయానికి విగతజీవులుగా మారుతుండటం అత్యంత విషాదకరం. చదువు అనేది జీవితాన్ని తీర్చిదిద్దాలి కానీ, ప్రాణాలను తీసే ఆయుధంగా మారకూడదు. పదవ తరగతి, ఇంటర్మీడియట్ ఫలితాల వేళ మరణ మృదంగం వినిపిస్తుంటే, అసలు మన విద్యావ్యవస్థ ఎటు వైపు వెళుతోంది అనే ప్రశ్న ప్రతి ఒక్కరినీ వేధిస్తోంది. కేవలం కొన్ని మార్కులు తక్కువ వచ్చాయని, లేదా పరీక్షల్లో విఫలమయ్యామని పసి హృదయాలు ప్రాణాలు విడుస్తుంటే, ఆ లోటు ఎవరూ పూడ్చలేనిది. ఈ అనూహ్య మరణాలకు ప్రధాన కారణం విద్యార్థులపై పెరుగుతున్న విపరీతమైన ఒత్తిడి. ఇవాళ విద్య అనేది జ్ఞాన సముపార్జన కంటే కూడా ఒక వ్యాపారంగా మారిపోయింది. ర్యాంకులు, గ్రేడ్ల వేటలో విద్యార్థుల మనోభావాలకు తావు లేకుండా పోతోంది. ఆ విద్యార్థుల బలవన్మరణాలకు సామాజిక, కుటుంబ, విద్యా సంబంధిత అంశాలు పెనవేసుకుని ఉన్నాయి. ఒక్క అపజయాన్ని కూడా తట్టుకోలేని సున్నితమైన మనస్తత్వాలను మనం తయారు చేస్తున్నామా అన్న సందేహం కలుగుతోంది. వైఫల్యం అనేది నేర్చుకోవడానికి ఒక మెట్టు మాత్రమే అని చెప్పాల్సిన పెద్దలే, దానిని అవమానంగా చూస్తుండటం విద్యార్థులను ఆత్మహత్యల వైపు ప్రేరేపిస్తోంది. దేశ విద్యావ్యవస్థలో మార్పులు రావాల్సిన సమయం ఆసన్నమైంది. ప్రస్తుత విద్యా విధానం కేవలం జ్ఞాపకశక్తికి, మార్కులకు మాత్రమే ప్రాధాన్యత ఇస్తోంది తప్ప, విద్యార్థిలోని సృజనాత్మకతను లేదా నాయకత్వ లక్షణాలను గుర్తించడం లేదు. పుస్తకాల మోత, కోచింగ్ సెంటర్ల నిర్బంధం విద్యార్థులను రోబోలుగా మారుస్తున్నాయి. నాలుగు గోడల మధ్య పగలూ రాత్రి తేడా లేకుండా గడిపే విద్యార్థులకు బయటి ప్రపంచం ఎలా ఉంటుందో తెలియడం లేదు. సామాజిక అవగాహన లేకపోవడంతో చిన్న సమస్య ఎదురైనా దానిని ఎలా ఎదుర్కోవాలో తెలియక ప్రాణాలు తీసుకునేంతటి తీవ్ర నిర్ణయాలు తీసుకుంటున్నారు. విద్యాసంస్థలు నేడు ర్యాంకుల ఫ్యాక్టరీలుగా మారిపోయాయి. తమ సంస్థ ప్రచారాల కోసం విద్యార్థుల విలువైన కాలాన్ని కేవలం పుస్తకాలకే పరిమితం చేస్తున్నాయి. విద్యార్థుల మధ్య ఆరోగ్యకరమైన పోటీని పెంచాల్సింది పోయి, గొర్రెల మందలా ఒకే రేసులో పరిగెత్తిస్తున్నాయి. క్రీడలు, వినోదం, సామాజిక స్పృహ లేని చదువులు పిల్లలను మానసిక రోగులుగా మారుస్తున్నాయి. ర్యాంకులు రాకపోతే ఆ విద్యార్థి పనికిరాని వాడనే ముద్ర వేసే విద్యాసంస్థల ధోరణి మారాలి. ప్రతి విద్యార్థిలో ఒక ప్రత్యేక నైపుణ్యం ఉంటుందని, దానిని గుర్తించి ప్రోత్సహించడమే విద్యాసంస్థల ప్రధాన బాధ్యత అని గుర్తించాలి. ఇక తల్లితండ్రుల పాత్ర గురించి ఎంత చెప్పినా తక్కువే. తమ నెరవేరని కోరికలను పిల్లలపై రుద్ది, వారిని ఒత్తిడికి గురి చేయడం సర్వసాధారణమైపోయింది. పక్కింటి పిల్లాడికి వచ్చిన మార్కులతో తమ బిడ్డను పోల్చడం ద్వారా పిల్లల్లో ఆత్మన్యూనతా భావాన్ని కలిగిస్తున్నారు. మార్కులు తక్కువ వస్తే సమాజంలో తమ పరువు పోతుందనే అపోహలో తల్లితండ్రులు ఉండటం దురదృష్టకరం. పిల్లలకు మార్కులు కాదు, వారి భవిష్యత్తు ముఖ్యం. ఏది ఏమైనా మేము నీ వెనుక ఉన్నామనే భరోసా తల్లితండ్రుల నుంచి లభిస్తే, ఏ విద్యార్థి కూడా ఆత్మహత్య వంటి పిరికిపంద చర్యలకు పాల్పడడు. ఒక్క ఫెయిల్యూర్ జీవితాంతం వెంటాడే శాపం కాదని విద్యార్థులకు అర్థమయ్యేలా చెప్పాలి. చరిత్రలో గొప్ప విజయం సాధించిన వారందరూ అనేక అపజయాలను దాటుకుని వచ్చినవారే. థామస్ ఆల్వా ఎడిసన్ నుంచి అబ్దుల్ కలాం వరకు ప్రతి ఒక్కరి జీవితం పోరాటాలతో కూడుకున్నదే. ఒక పరీక్ష తప్పితే జీవితమే అంతమైపోతుందనే అజ్ఞానం నుంచి విద్యార్థులు బయటకు రావాలి. అపజయాలను స్వీకరించే మానసిక స్థైర్యాన్ని విద్యార్థి దశ నుంచే అలవరచుకోవాలి. విజయం వచ్చినప్పుడు పొంగిపోకుండా, అపజయం ఎదురైనప్పుడు కుంగిపోకుండా ఉండే సమతుల్యత నేటి తరానికి చాలా అవసరం. సమాజం కూడా విద్యార్థులను చూసే కోణాన్ని మార్చుకోవాలి. కేవలం డాక్టర్లు, ఇంజనీర్లు మాత్రమే గొప్పవారు అనే భావన పోవాలి. నేడు ప్రతి రంగంలోనూ అపారమైన అవకాశాలు ఉన్నాయి. కళలు, క్రీడలు, సాహిత్యం, వ్యాపారం ఇలా ఏ రంగంలోనైనా ప్రతిభ చూపే అవకాశం ఉంది. విద్యార్థులను వారి మార్కులతో కాకుండా వారిలో ఉన్న వినూత్న ఆలోచనలతో గుర్తించాలి. ఒక విద్యార్థి పరీక్షలో వెనుకబడితే అతనికి మరింత మద్దతు ఇవ్వాలే తప్ప, వేలెత్తి చూపకూడదు. సామాజిక ఆమోదం లేకపోవడం కూడా విద్యార్థులను మానసికంగా కుంగదీస్తోంది. ఉపాధ్యాయులు కేవలం పాఠాలు చెప్పే బోధకులుగా మాత్రమే కాకుండా, విద్యార్థులకు మార్గదర్శకులుగా ఉండాలి. నిత్యం మార్కుల గురించే కాకుండా, సమాజంలో ఎలా బతకాలి, కష్టాలు ఎదురైనప్పుడు ఎలా నిలబడాలి అనే విషయాలపై అవగాహన కల్పించాలి. విద్యార్థులతో స్నేహపూర్వకంగా ఉంటూ వారిలోని భయాలను పోగొట్టాలి. మానసిక విశ్లేషణ చేస్తూ, ఒత్తిడిలో ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి తగిన కౌన్సిలింగ్ ఇవ్వాలి. విద్యార్థిలో ఆత్మవిశ్వాసం నింపడం అనేది గణిత సూత్రాలు నేర్పడం కంటే చాలా ముఖ్యం. నేటి యువత భవిష్యత్ భారతావనికి మూలస్తంభాలు. అటువంటి వారు చిన్న వయసులోనే బలవంతంగా ప్రాణాలు కోల్పోవడం జాతికి పెద్ద నష్టం. ర్యాంకుల వేటలో పడి మానవీయ విలువలను మర్చిపోతున్నాం. విద్యార్థులకు స్వేచ్ఛా వాతావరణం కల్పించి, వారిని సృజనాత్మకంగా ఎదిగేలా చూడాలి. ఈ పోటీ ప్రపంచంలో తట్టుకుని నిలబడేలా వారికి మానసిక దృఢత్వాన్ని అందించాలి. అపజయాలను ధైర్యంగా ఎదుర్కొనేలా వారిని తీర్చిదిద్దవలసిన బాధ్యత అటు కుటుంబంపై, ఇటు విద్యాసంస్థలపై మరియు మొత్తం సమాజంపై ఉంది. ప్రాణం అనేది వెలకట్టలేనిది. ఒక పరీక్షా పత్రం మీ జీవితాన్ని నిర్ణయించలేదు. విద్యార్థులు తమపై తాము నమ్మకం ఉంచుకోవాలి. తల్లితండ్రులు తమ పిల్లల మనసులను చదవాలి. విద్యాసంస్థలు వ్యాపార దృక్పథాన్ని వీడాలి. అప్పుడే మన విద్యావ్యవస్థ నుంచి ఆత్మహత్యల వార్తలు మాయమై, విజయగాథలు వినిపిస్తాయి. మార్కుల వేట నుంచి మనిషిగా ఎదిగే క్రమమే నిజమైన విద్య అని అందరూ గ్రహించాలి. వైఫల్యం ఒక ముగింపు కాదు, అది మరో అద్భుతమైన ప్రయాణానికి ఆరంభం కావాలి. చదువు ఒత్తిడి లేని సమాజాన్ని నిర్మించుకోవడం మనందరి తక్షణ కర్తవ్యం.

# నామినేటెడ్ పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్

**మొదటిపేజీ తరువాయి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు బి. మహేశ్ కుమార్ గౌడ్ లతో దాదాపు మూడు గంటల పాటు సాగిన ఈ చర్చలు రాష్ట్ర భవిష్యత్తు రాజకీయ ముఖచిత్రాన్ని ప్రతిబింబించాయి. పాలనలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమిస్తూనే, పార్టీ శ్రేణుల అసంతృప్తిని చల్లార్చేందుకు అవసరమైన వ్యూహాలపై ఈ భేటీలో విస్తృతంగా మంతనాలు జరిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి ఏ మేరకు చేరుతున్నాయనే అంశంపైనే ప్రధానంగా దృష్టి సారించినట్లు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరుగుతోంది. ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఇచ్చిన హామీల అమలులో సాధించిన పురోగతిపై మీనాక్షి నటరాజన్ ఆరా తీశారు. ముఖ్యంగా ఆరు గ్యారంటీల అమలు తీరును విశ్లేషిస్తూనే, ప్రజల్లో వస్తున్న ఫీడ్‌బ్యాక్‌ను సీఎం రేవంత్ రెడ్డి వివరించినట్లు తెలుస్తోంది. మంత్రుల పనితీరుపై వస్తున్న నివేదికలతో పాటు, ఇటీవల కాలంలో కొందరు మంత్రులపై వెల్లువెత్తిన అవినీతి ఆరోపణలు చర్చకు వచ్చినట్లు సమాచారం. ఈ ఆరోపణలు పార్టీ ప్రతిష్టను దెబ్బతీయకుండా తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని ఇన్ చార్జ్ సూచించారు. పాలనలో పారదర్శకతకు పెద్దపీట వేస్తూనే, విపక్షాల విమర్శలకు తగిన సమాధానం చెప్పేలా మంత్రులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రికి స్పష్టం చేసినట్లుగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. పార్టీలో సీనియర్ నేత జీవన్ రెడ్డి రాజీనామా ఉదంతం ఈ సమావేశంలో ప్రత్యేక చర్చకు దారితీసింది. క్షేత్రస్థాయిలో ఎమ్మెల్యేల మధ్య నెలకొన్న విభేదాలు, పార్టీలో పెరిగిన అసంతృప్తి అంశాలను అధిష్టానం సీరియస్‌గా తీసుకుంది. పాత కాంగ్రెస్ నేతలు, కొత్తగా చేరిన వారి మధ్య సమన్వయ లోపం లేకుండా చూడాలని, కార్యకర్తల మనోభావాలను దెబ్బతీయకూడదని చర్చించారు. జీవన్ రెడ్డి వంటి సీనియర్ నేతలను బుజ్జగించి, వారి అనుభవాన్ని పార్టీకి ఉపయోగపడేలా చూసుకోవాలని నిర్ణయించారు. సంస్థాగతంగా పార్టీని పటిష్టం చేయాలంటే అంతర్గత కలహాలను పక్కనబెట్టి అందరూ ఐక్యంగా ముందుకు వెళ్లాల్సిన అవసరాన్ని మీనాక్షి నటరాజన్ ఈ సందర్భంగా బలంగా నొక్కి చెప్పారు. ఎప్పటి నుంచో ఊరిస్తున్న నామినేటెడ్ పోస్టుల భర్తీపై ఈ సమావేశం ఒక స్పష్టమైన నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. పదవుల కోసం ఎదురుచూస్తున్న ఆశావాహులకు ఇది ఒక తీపి కబురుగా మారింది. సామాజిక సమీకరణాలను తూచా తప్పకుండా పాటిస్తూ, పార్టీ కోసం నిరంతరం శ్రమించిన నిజమైన కార్యకర్తలకు గుర్తింపునివ్వాలని సీఎం రేవంత్ రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మరియు మైనార్టీ వర్గాలకు సముచిత స్థానం కల్పిస్తూనే, క్షేత్రస్థాయిలో పార్టీకి వెన్నుదన్నుగా ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. మరో రెండు మూడు రోజుల్లోనే ఈ నామినేటెడ్ పోస్టులకు సంబంధించిన ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉండటంతో గాంధీ భవన్ వర్గాల్లో సందడి మొదలైంది. రాష్ట్రంలో రాబోయే జీహెచ్‌ఎంసీ ఎన్నికలతో పాటు ఇతర స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీని సమాయత్తం చేయడంపై పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తన కార్యాచరణను వివరించారు. ముఖ్యంగా గ్రేటర్ పరిధిలోని మూడు కార్పొరేషన్ల పరిధిలో పార్టీ పరిస్థితిని మెరుగుపరచుకోవడానికి అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. జిల్లా స్థాయి కమిటీల భర్తీ ప్రక్రియను వేగవంతం చేసి, ప్రతి నియోజకవర్గంలో పార్టీ కేడర్‌ను యాక్టివేట్ చేయాలని భావిస్తున్నారు. పార్టీ కార్యక్రమాలు కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా, గల్లీ స్థాయి వరకు ప్రజల్లోకి తీసుకెళ్లేలా జిల్లా స్థాయి నేతలకు దిశానిర్దేశం చేయాలని ఇన్ చార్జ్ సూచించారు. ఇది రాబోయే ఎన్నికల్లో పార్టీకి ఒక బలమైన పునాదిగా మారుతుందని నేతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిన డీలిమిటేషన్ మరియు మహిళా రిజర్వేషన్ల అంశం తెలంగాణ రాజకీయాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందనే దానిపై సుదీర్ఘ విశ్లేషణ జరిగింది. భవిష్యత్తులో నియోజకవర్గాల పునర్విభజన జరిగితే ఎదురయ్యే రాజకీయ సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే నాయకత్వాన్ని సిద్ధం చేయాలని చర్చించారు. మహిళా రిజర్వేషన్ల అమలు ద్వారా మహిళా ఓటర్లను పార్టీ వైపు తిప్పుకునేందుకు తీసుకోవాల్సిన ప్రత్యేక చర్యల గురించి ఆలోచనలు చేశారు. యువతను మరియు మహిళలను పెద్ద ఎత్తున పార్టీలోకి ఆహ్వానించి, వారికి రాజకీయ ప్రాధాన్యత కల్పించడం ద్వారా పార్టీ ఓటు బ్యాంకును పటిష్టం చేయాలని నిర్ణయించారు. సమీక్షా సమావేశం ముగిసిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన 68వ ఢిల్లీ పర్యటనకు సిద్ధమవడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. జాతీయ స్థాయిలో ఇండియా కూటమి నేతలతో జరగబోయే కీలక భేటీలో ఆయన పాల్గొననున్నారు. కేంద్రం ప్రతిపాదించిన డీలిమిటేషన్ అంశంపై రాష్ట్రాల హక్కులను కాపాడటం, మహిళా రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ వైఖరిని స్పష్టం చేయడమే ఈ పర్యటన ప్రధాన ఉద్దేశం. పార్టీ అధిష్టానంతో ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటూ, రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చే ప్రయత్నం రేవంత్ రెడ్డి చేస్తున్నారు. ఈ పర్యటన ముగిసిన వెంటనే రాష్ట్రంలో పాలనాపరమైన మరింత వేగం పుంజుకునే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 20న జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పర్యటించనున్నారు. ముఖ్యంగా వివాదాస్పదమైన మేడిగడ్డ బ్యారేజీని స్వయంగా సందర్శించి క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించనున్నారు. బ్యారేజీ వద్ద జరుగుతున్న జియో ఫిజికల్ పరీక్షల తీరును పరిశీలించి, పునరుద్ధరణ పనులపై ఇంజనీర్లకు ఆదేశాలు ఇవ్వనున్నారు. గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూనే, ప్రాజెక్టును త్వరితగతిన ప్రజలకు అందుబాటులోకి తెచ్చేలా ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని చాటిచెప్పడమే ఈ పర్యటన లక్ష్యంగా కనిపిస్తోంది. సాంకేతిక లోపాలను సవరించి రైతులకు నీటిని అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం భావిస్తున్నారు. మేడిగడ్డ పర్యటనతో పాటు కాళేశ్వరంలో నిర్వహించనున్న 'సరస్వతి అంత్య పుష్కరాల' ఏర్పాట్లపై కూడా ముఖ్యమంత్రి సమీక్ష జరపనున్నారు. ఆధ్యాత్మిక ప్రాముఖ్యత కలిగిన ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉండటంతో, వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించనున్నారు. అభివృద్ధి పనులతో పాటు సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలకూ సమాన ప్రాధాన్యతనిస్తూ ప్రజల మనసు గెలుచుకునే ప్రయత్నం ప్రభుత్వం చేస్తోంది. ఈ పర్యటనలో స్థానిక సమస్యలపై కూడా ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించే అవకాశం ఉందని అధికార వర్గాలు వెల్లడించాయి. మొత్తంగా చూస్తే, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం ఒక నిర్దిష్టమైన లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు స్పష్టమవుతోంది. అంతర్గత విభేదాలను పరిష్కరించుకుంటూ, నామినేటెడ్ పదవుల ద్వారా కార్యకర్తలను సంతోషపెడుతూ, ప్రజా సమస్యలపై పోరాటం సాగిస్తోంది. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడం ద్వారా వచ్చే ఎన్నికల్లో మళ్లీ విజయం సాధించాలనే పట్టుదలతో నేతలు కనిపిస్తున్నారు. రాబోయే కొద్ది రోజులు తెలంగాణ రాజకీయాల్లో ఎంతో కీలకంగా మారనున్నాయి. ముఖ్యమంత్రి ఢిల్లీ పర్యటన ఫలితాలు, భూపాలపల్లి పర్యటనలో తీసుకునే నిర్ణయాలు రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని ఎటువైపు మలుపు తిప్పుతాయో వేచి చూడాలి. ప్రభుత్వం, పార్టీ మధ్య సమన్వయం కుదరడం కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది.



# చిన్నారిని గొంతు నులిమి హత్య చేసిన తండ్రి

**యాదాద్రి భువనగిరి, విశాలభారతి:**

జిల్లాలోని భువనగిరి మండలం హనుమాపురం గ్రామంలో బుధవారం దారుణ ఘటన చోటుచేసుకుంది. ఎర్రబోయిన శ్రీరామ్ (34) తన 20 నెలల కుమార్తె నిత్యశ్రీను గొంతు నులిమి హత్య చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం, శ్రీరామ్‌కు ఎర్రబోయిన నాగరాణి (28)తో మూడు సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. ఇద్దరూ వినికిడి, మాటల లోపంతో బాధపడుతున్నారు. గత సంవత్సరం నుంచి దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నట్లు సమాచారం. నెల రోజుల క్రితం నాగరాణి తన పుట్టింటి నుంచి తిరిగి వచ్చి భర్తతో కలిసి నివసిస్తోంది. బుధవారం ఉదయం శ్రీరామ్ తన కుమార్తెను గ్రామ శివారులోని చెరువు వద్దకు తీసుకెళ్లి హత్య చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# టీటీడీపీ బోర్డు ఉంది.. బాస్ లేరు!

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలుగుదేశం పార్టీ జాతీయ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీల ప్రకటనతో ఆయా ప్రాంతాల్లో రాజకీయ సందడి నెలకొన్నప్పటికీ, తెలంగాణలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ఒకప్పుడు పార్టీకి పెట్టని కోటగా ఉన్న తెలంగాణలో ప్రస్తుతం నాయకత్వ లేమి స్పష్టంగా కనిపిస్తోంది. జాతీయ కమిటీలో తెలంగాణకు అరకొర ప్రాధాన్యం కల్పించి, పూర్తిస్థాయి రాష్ట్ర కమిటీని ప్రకటించకుండా విస్మరించడంపై ఇక్కడి కేడర్ తీవ్ర స్థాయిలో నిరాశ వ్యక్తం చేస్తోంది. 2023 ఎన్నికల వేళ పార్టీ అధ్యక్ష పదవికి కాసాని జ్ఞానేశ్వర్ రాజీనామా చేసినప్పటి నుండి ఈ స్థానం ఖాళీగానే ఉండటం, పార్టీ మనుగడపై కార్యకర్తల్లో సందిగ్ధతను పెంచుతోంది. చంద్రబాబు నాయుడు, నారా లోకేశ్ వంటి కీలక నేతలు ఏపీ రాజకీయాలపై కేంద్రీకరిస్తూ తెలంగాణను గాలికొదిలేశారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. రాష్ట్ర విభజన తర్వాత ఎందరో నేతలు అధికారం కోసం ఇతర పార్టీల తీర్థం పుచ్చుకున్నా, క్షేత్రస్థాయిలో పార్టీ జెండాను మోసే కార్యకర్తలు మాత్రం వెనకడుగు వేయలేదు. గడిచిన కాలంలో జరిగిన అనేక పరిణామాలు ఈ విషయాన్ని నిరూపించాయి. అయితే, నాయకత్వం నుండి తగిన దిశానిర్దేశం లేకపోవడంతో, బలమైన ఓటు బ్యాంకు ఉన్న చోట కూడా పార్టీ ఉనికి ప్రశ్నార్థకంగా మారుతోంది. ఇది కేవలం నేతల నిర్లక్ష్యం వల్లనే జరుగుతోందని కింది స్థాయి నాయకులు బహిరంగంగానే వాపోతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో పోటీ నుండి తప్పుకోవాలని అధిష్టానం తీసుకున్న నిర్ణయం కార్యకర్తలను తీవ్రంగా కలిచివేసింది. అప్పట్లో ఎన్నికల తర్వాత పార్టీని ప్రక్షాళన చేసి పటిష్టపరుస్తామని హామీ ఇచ్చినప్పటికీ, ఆ దిశగా అడుగులు పడలేదు. నాయకత్వం లేకపోయినా కొన్ని జిల్లాల్లో స్థానిక ఎన్నికల సమయంలో కార్యకర్తలు సొంతంగానే పోరాడి విజయాలు సాధించిన సందర్భాలు ఉన్నాయి. తమ రక్తం ధారపోసి పార్టీని బతికించుకుంటున్న తమను, అధినాయకత్వం కనీసం పట్టించుకోకపోవడం




పట్ల వారు తీవ్ర అసహనాన్ని ప్రదర్శిస్తున్నారు. పార్టీ బతికే ఉందనే భరోసా ఇవ్వడంలో హైకమాండ్ విఫలమవుతోందనేది జగమెరిగిన సత్యం. రాష్ట్ర కమిటీ నియామకం కోసం తెలంగాణకు చెందిన సీనియర్ నేతలు పలుమార్లు చంద్రబాబును, లోకేశ్ ను కలిశారు. తమ గోడును వెళ్లబోసుకున్నా, కేవలం హామీలతోనే కాలయాపన చేస్తున్నారని వారు భావిస్తున్నారు. తాజాగా ప్రకటించిన కమిటీలలో తెలంగాణ నుండి కేవలం ముగ్గురికి మాత్రమే చోటు దక్కడం ఇక్కడి పరిస్థితికి అద్దం పడుతోంది. సీనియర్ నేతలు అరవింద్ కుమార్ గౌడ్, బక్కిన నర్సింహులును పొలిట్ బ్యూరోలోకి తీసుకుని, నన్నూరి నర్సిరెడ్డికి జాతీయ అధికార ప్రతినిధి పదవి కట్టబెట్టి చేతులు దులుపుకున్నారనే వాదన వినిపిస్తోంది. ఈ ముగ్గురు నేతలు మాత్రమే తెలంగాణలో పార్టీని ఏ విధంగా ముందుకు తీసుకెళ్తారనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.

ప్రస్తుతం తెలంగాణ రాజకీయాలు అత్యంత ఆసక్తికరంగా మారుతున్నాయి. అధికార కాంగ్రెస్ పార్టీ తన బలాన్ని పెంచుకునే ప్రయత్నాల్లో ఉండగా, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ తన ఉనికిని కాపాడుకోవడానికి పోరాడుతోంది. ఇటువంటి తరుణంలో టీడీపీకి ఉన్న కేడర్ బలం ఏ పార్టీకైనా అత్యంత కీలకం. అందుకే ఇటు కాంగ్రెస్, అటు బీఆర్ఎస్ నేతలు టీడీపీ మద్దతు కోసం రహస్యంగా ప్రయత్నాలు చేస్తున్న సందర్భాలు లేకపోలేదు. క్షేత్రస్థాయిలో ఇంతటి డిమాండ్ ఉన్నప్పటికీ, సొంత పార్టీ అధినాయకత్వం మద్దతు ఇవ్వకపోవడం కార్యకర్తలకు శాపంగా మారింది. తమ రాజకీయ భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని వారు ఆవేదన చెందుతున్నారు. ఒకప్పుడు ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ ప్రస్థానం తెలంగాణ గడ్డ నుండే ప్రారంభమైంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికీ పసుపు జెండాను అభిమానించే ప్రజలు లక్షలాది మంది ఉన్నారు. కానీ, ప్రస్తుత నిశ్శబ్ద వాతావరణం చూస్తుంటే పార్టీని ఇక్కడ మూసివేసే దిశగా అడుగులు వేస్తున్నారా అనే అనుమానాలు బలపడుతున్నాయి. కమిటీల ప్రకటనలో తెలంగాణ పేరు ఎత్తకపోవడం వెనుక ఏదైనా రాజకీయ వ్యూహం ఉందా లేదా కేవలం అలసత్వమేనా అన్నది అర్థం కావడం లేదు. చురుకైన నాయకత్వం ఉంటే పుంజుకునే అవకాశం ఉన్నా, హైకమాండ్ మాత్రం కాలం గడిపే ధోరణినే అవలంబిస్తోందని విశ్లేషకులు భావిస్తున్నారు. పార్టీని నమ్ముకున్న ద్వితీయ శ్రేణి నాయకులు ఇప్పుడు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఇతర పార్టీల నుండి ఆకర్షణీయమైన ఆఫర్లు వస్తున్నా, పార్టీ పట్ల ఉన్న నిబద్ధతతో వారు ఇక్కడే కొనసాగుతున్నారు. అయితే, రాష్ట్ర కమిటీ లేకపోవడం వల్ల పార్టీ తరపున ఎటువంటి కార్యక్రమాలు చేపట్టలేకపోతున్నారు. దీనివల్ల ప్రజల్లో పార్టీకి ఉన్న ఆదరణ క్రమంగా తగ్గే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. కేవలం నామమాత్రపు పదవులతో తెలంగాణలో పార్టీని నడపడం సాధ్యం కాదని, పూర్తిస్థాయి యంత్రాంగం అవసరమని వారు స్పష్టం చేస్తున్నారు. చంద్రబాబు నాయుడు తన వ్యూహాలను మార్చుకోకపోతే తెలంగాణలో టీడీపీ కనుమరుగయ్యే ప్రమాదం ఉంది. జాతీయ స్థాయిలో రాజకీయ చక్రం తిప్పాలని భావిస్తున్న టీడీపీ, తన పునాదులు ఉన్న ప్రాంతాన్ని విస్మరించడం సరైన నిర్ణయం కాదని రాజకీయ పండితులు అభిప్రాయపడుతున్నారు. తెలంగాణలో పార్టీకి గతంలో వచ్చిన ఓట్ల శాతం చూస్తే, ఇప్పటికీ అది నిర్ణయాత్మక శక్తిగానే ఉంది. కానీ, ఆ శక్తిని ఏకీకృతం చేసే నాథుడు కరువయ్యాడు. లోకేశ్ పాదయాత్రలు, చంద్రబాబు పర్యటనలు ఏపీకే పరిమితం కావడం వల్ల తెలంగాణలో ఒక రకమైన శూన్యత ఏర్పడింది. ఈ శూన్యాన్ని భర్తీ చేయడంలో అధిష్టానం వెనకడుగు వేయడం కార్యకర్తల మనోస్థైర్యాన్ని దెబ్బతీస్తోంది. తమను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూస్తున్నారా అనే ప్రశ్నలు ఇప్పుడు గట్టిగా వినిపిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో తెలంగాణలో పార్టీని నిలబెట్టాలంటే తక్షణమే రాష్ట్ర కమిటీని ప్రకటించాల్సిన అవసరం ఉంది. సమర్థవంతమైన నాయకుడిని అధ్యక్షుడిగా నియమించి, అన్ని జిల్లాల్లోనూ కమిటీలను పునరుద్ధరించాలి. లేనిపక్షంలో ఉన్న కేడర్ కూడా ఇతర పార్టీల వైపు చూసే అవకాశం ఉంది. తెలంగాణలో టీడీపీ మద్దతు కోసం ఇతర పార్టీలు వెంపర్లాడుతున్నాయంటే, ఇక్కడ పార్టీకి ఎంతటి ప్రాధాన్యత ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆ ప్రాధాన్యతను గుర్తించడంలో అధినాయకత్వం విఫలమైతే, అది చారిత్రక తప్పిదంగా మిగిలిపోయే అవకాశం ఉంది. కార్యకర్తల ఆగ్రహం కట్టలు తెంచుకోకముందే దిద్దుబాటు చర్యలు చేపట్టడం అవసరం. తెలంగాణ టీడీపీ కేడర్ ఇప్పుడు ఒక సంధిగ్ధంలో ఉంది. అధిష్టానం నుండి స్పష్టమైన ప్రకటన కోసం వారు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు. రాజకీయాల్లో ఎప్పుడు ఏం జరుగుతుందో చెప్పలేము కానీ, సొంత పార్టీ కార్యకర్తలను నిర్లక్ష్యం చేయడం ఏ పార్టీకైనా శ్రేయస్కరం కాదు. తెలంగాణలో పార్టీ ఉనికిని చాటాలంటే కేవలం పదవులు సరిపోవు, బలమైన కార్యాచరణ, కార్యకర్తలకు భరోసా ఇచ్చే నాయకత్వం కావాలి. చంద్రబాబు, లోకేశ్ ఇప్పటికైనా స్పందించి తెలంగాణ రాష్ట్ర కమిటీపై ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని, పార్టీని మళ్లీ గాడిలో పెట్టాలని ప్రతి టీడీపీ సైనికుడు కోరుకుంటున్నాడు.

## రైజింగ్ రామగుండంగా పేరు తీసుకురావాలి

**ఎం.ఎస్.రాజ్ ఠాకూర్**

**విశాలభారతి , గోదావరిఖని:**

రైజింగ్ రామగుండం గా పేరు తీసుకువచ్చేందుకు మేము సైతం అంటూ ప్రతి ఒక పౌరుడు కదలి రావాలని రామగుండం శాసన సభ్యులు ఎం.ఎస్.రాజ్ ఠాకూర్ పిలుపునిచ్చారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా 9వ డివిజన్ లో రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామితో కలిసి బుధవారం వార్డు సందర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామగుండం నగరాన్ని ఒక స్వచ్ఛమైన అద్భుత నగరంగా తీర్చిదిద్దడం పౌరుల భాగస్వామ్యంతోనే సాధ్యమవుతుందని అన్నారు. నగరంలోని నాలాల పూడిక తీత ఒక దశాబ్ద కాలంగా చేపట్టడం జరగలేదని అన్నారు. ప్రస్తుతం రామగుండం నగర పాలక సంస్థకు సమర్థత ,అనుభవం కలిగిన పాలక వర్గం ఏర్పడిన క్రమంలో శానిటేషన్ తో పాటు అన్ని సమస్యలు తీరిపోతాయని అన్నారు. వర్షాకాలంలో వరద ముప్పు తో పాటు దుర్గంధం నుండి ప్రజలు పడుతున్న ఇబ్బందులు నివారించడానికి పూర్తి స్థాయిలో కాంక్రీట్ కాలువ నిర్మాణం త్వరలో చేపడతామని అన్నారు. ఊరంటే రామగుండంలా ఉండాలి అనే విధంగా ఈ నగరాన్ని రూపుదిద్దుకుందామని అన్నారు. రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి మాట్లాడుతూ కాలువ లో చెత్త వేయకుండా ప్రజలు సహకరించాలని కోరారు. మునిసిపల్ సిబ్బందికి చెత్త ఇవ్వాలని అన్నారు.వర్షాకాలం లోపు నగరంలోని అన్ని నాళాల్లో పూడిక తొలగించే కార్యక్రమాన్ని ప్రణాళికాబద్ధంగా చేపడుతున్నామని అన్నారు.ఇళ్లతో పాటు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వినోభా నగర్,రెల్లి వాడ లో ప్రవహిస్తున్న మురుగు నీటి కాలువలో యంత్రాలు, సిబ్బంది సహాయంతో పూడిక తొలగించి సాఫీగా ప్రవహించేలా చర్యలు తీసుకున్నారు. ఎం ఎల్ ఎ, మేయర్ అధికారులకు ,సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తూ దగ్గరుండి పనులను పర్యవేక్షించారు. ప్రెస్ క్లబ్ నుండి ప్రారంభించి గల్లీ గల్లీలో తిరుగుతూ మునిసిపల్ సిబ్బందికి సూచనలు ఇస్తూ పిచ్చి చెట్లు, కొమ్మలు, పొదలు తొలగించేలా చర్యలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, స్థానిక కార్పొరేటర్ తాళ్లపెల్లి యుగంధర్ తో పాటు పలువురు కార్పొరేటర్లు,నగర పాలక సంస్థ డిప్యూటీ కమీషనర్ నాయిని వెంకట స్వామి, ఇ ఇ పి వి రామన్, టి పి ఎస్ నవీన్ , ఎ ఇ జమీల్ , సానిటరీ ఇన్స్పెక్టర్ రంగు నాగ భూషణం, సూపర్ వైజర్ రవి కుమార్ , ఎలక్ట్రికల్ ఎ. ఇ. రాంజీ , వార్డు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మహిళల ముసుగులో మోసం

**మొదటిపేజీ తరువాయి**




131వ రాజ్యాంగ సవరణ బిల్లుల వెనుక ఉన్న అసలు వ్యూహం దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యాన్ని తగ్గించి, ఉత్తరాదికి అయాచిత లబ్ధి చేకూర్చడమేనన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం లోక్‌సభ సీట్ల కేటాయింపు 1971 జనాభా లెక్కల ఆధారంగా కొనసాగుతోంది. అయితే కొత్త ప్రతిపాదనల ప్రకారం 2011 జనాభా లెక్కలను ప్రామాణికంగా తీసుకుంటే, జనాభా నియంత్రణలో అద్భుత ప్రగతి సాధించిన దక్షిణాది రాష్ట్రాలకు అది తీరని శాపంగా మారనుంది. దశాబ్దాలుగా కేంద్రం పిలుపునిచ్చిన కుటుంబ నియంత్రణ పథకాలను చిత్తశుద్ధితో అమలు చేసి, అక్షరాస్యతను పెంచుకున్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాలు ఇప్పుడు ఆ పాపానికే భారీ మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. జనాభా పెరగకపోవడం వల్ల ఈ రాష్ట్రాల సీట్ల సంఖ్య తగ్గడం లేదా యథాతథంగా ఉండటం జరిగితే, దేశ ప్రగతిలో భాగస్వాములైనందుకు వీరికి లభించే బహుమతి ఇదేనా అని విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు ఉత్తరాది రాష్ట్రాలలో పేదరికం, నిరక్షరాస్యత కారణంగా జనాభా విపరీతంగా పెరిగింది. ఇప్పుడు అదే జనాభా ప్రాతిపదికన సీట్ల విభజన చేపడితే, ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్ వంటి రాష్ట్రాలకు లోక్‌సభలో సీట్ల సంఖ్య అమాంతం పెరిగిపోతుంది. ఇది దేశ సమాఖ్య స్ఫూర్తికే విఘాతమని ప్రజాస్వామ్యవాదులు హెచ్చరిస్తున్నారు. జనాభాను నియంత్రించని రాష్ట్రాలకు ఎక్కువ రాజకీయ బలం కల్పించడం ద్వారా, ప్రగతిశీల రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్నారని ప్రతిపక్షాలు మండిపడుతున్నాయి. ఉత్తరాది రాష్ట్రాలపైనే తన రాజకీయ మనుగడను ఆధారపడి ఉన్న బీజేపీ, భవిష్యత్తులో కూడా కేంద్రంలో తన పట్టును సుస్థిరం చేసుకోవడానికే ఈ ఎత్తుగడ వేసిందని రాజకీయ విశ్లేషణలు వినిపిస్తున్నాయి. లోక్‌సభ సభ్యుల సంఖ్యను ప్రస్తుతమున్న 543 నుంచి ఏకంగా 850కి పెంచాలని చూడటం వెనుక కూడా పెద్ద రాజకీయ వ్యూహం దాగి ఉంది. రాజ్యాంగంలోని 82వ అధికరణానికి సవరణలు చేయడం ద్వారా 1971 నాటి నిబంధనను తొలగించి, కొత్త సమీకరణాలకు తెరలేపుతున్నారు. మహిళా రిజర్వేషన్లు అమలు కావాలంటే జనగణన పూర్తి కావాలని గతంలోనే ప్రకటించిన ప్రభుత్వం, ఇప్పుడు హడావుడిగా డీలిమిటేషన్ ప్రక్రియను ముగించాలని చూడటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మహిళలకు అధికారం ఇవ్వడం కంటే, ఆ ముసుగులో దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చివేసి దక్షిణాదిని శాశ్వతంగా ద్వితీయ శ్రేణి రాష్ట్రాలుగా మార్చే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా ఈ బిల్లుల ఆమోదానికి రాజ్యాంగం ప్రకారం ఉండాల్సిన మూడింట రెండు వంతుల మెజార్టీ నిబంధనను పక్కన పెట్టి, కేవలం సాధారణ మెజార్టీతోనే చెల్లుబాటు అయ్యేలా నిబంధనలను రూపొందించడం గమనార్హం. ఇది పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని మేధావులు అభిప్రాయపడుతున్నారు. ఎన్డీయే ప్రభుత్వానికి ఉన్న సంఖ్యాబలంతో ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటూ, రాష్ట్రాల అభిప్రాయాలను కనీసం పరిగణనలోకి తీసుకోకుండా ముందుకు వెళ్లడం సమాఖ్య వ్యవస్థకు గొడ్డలి పెట్టు వంటిది. ప్రతిపక్షాల గొంతు నొక్కడమే కాకుండా, దక్షిణాది ప్రజల ఆత్మగౌరవాన్ని కూడా ఈ నిర్ణయం దెబ్బతీసేలా ఉంది. జనాభా ప్రాతిపదికన సీట్ల కేటాయింపు జరిగితే కేంద్రం నుంచి వచ్చే నిధుల పంపిణీలో కూడా దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర అన్యాయం జరుగుతుంది. ఎక్కువ పన్నులు చెల్లిస్తూ దేశ ఆర్థిక వ్యవస్థను నడిపిస్తున్న దక్షిణాది రాష్ట్రాలకు, తక్కువ సీట్లు ఉండటం వల్ల భవిష్యత్తులో కేంద్ర బడ్జెట్‌లో సరైన వాటా దక్కదు. ఉత్తరాది రాష్ట్రాల జనాభా అవసరాల పేరుతో దక్షిణాది సంపదను తరలించుకుపోయే కుట్రలో భాగంగానే ఈ డీలిమిటేషన్ బిల్లును మోదీ ప్రభుత్వం ముందుకు తెచ్చిందని ఆర్థిక విశ్లేషకులు భావిస్తున్నారు. ఇది కేవలం రాజకీయ సీట్ల సమస్య మాత్రమే కాదు, దక్షిణాది రాష్ట్రాల ఆర్థిక మనుగడకు సంబంధించిన ప్రశ్నగా మారుతోంది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ మూడు బిల్లులు ఒకదానితో ఒకటి పెనవేసుకుని ఉన్నాయి. 2026 డీలిమిటేషన్ బిల్లు ద్వారా నియోజకవర్గాల సరిహద్దులు మారుతుంటే, 131వ రాజ్యాంగ సవరణ బిల్లు ఆ మార్పులకు చట్టపరమైన రక్షణ కల్పిస్తుంది. ఇక కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల సవరణ బిల్లు ద్వారా కీలకమైన ప్రాంతాలపై కేంద్రం తన పట్టును మరింత బిగించనుంది. ఈ మూడు బిల్లుల కలయిక దేశంలో ఒకే రకమైన రాజకీయ ఆధిపత్యాన్ని చెలాయించేందుకు మార్గం సుగమం చేస్తోంది. ఇది ప్రజాస్వామ్యంలోని వైవిధ్యాన్ని నాశనం చేసి, ఒకే సిద్ధాంతం, ఒకే అధికారం అన్న చందంగా దేశాన్ని నడిపించేందుకు చేస్తున్న ప్రయత్నంగా కనిపిస్తోంది. ప్రస్తుతం జరుగుతున్న ప్రత్యేక సమావేశాలలో ఈ బిల్లులపై చర్చ జరగకముందే ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఖరారు చేసుకున్నట్లు తెలుస్తోంది. మహిళా రిజర్వేషన్ల పట్ల తమకు ఉన్న చిత్తశుద్ధిని నిరూపించుకోవాలంటే, జనగణన తర్వాతే అమలు చేస్తామన్న పాత వాగ్దానానికి కట్టుబడి ఉండాలి. కానీ, ఆ నెపంతో డీలిమిటేషన్ ప్రక్రియను తెరపైకి తెచ్చి దేశాన్ని రెండు ముక్కలుగా చేసేలా వ్యవహరించడం సమంజసం కాదు. ప్రభుత్వ నిర్ణయం వల్ల దక్షిణాది ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తిని గమనించకుండా, కేవలం సీట్ల లెక్కలకే ప్రాధాన్యత ఇవ్వడం దేశ సమగ్రతకు మంచిది కాదు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, కేరళ ప్రభుత్వాలు ఈ బిల్లులను ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నాయి. రాష్ట్రాల హక్కుల కోసం పోరాడుతున్న ప్రాంతీయ పార్టీలను బలహీనపరిచి, జాతీయ పార్టీల ఆధిపత్యాన్ని పెంచడమే లక్ష్యంగా ఈ మార్పులు ఉన్నాయన్నది జగమెరిగిన సత్యం. 2011 జనాభా లెక్కలనే ప్రామాణికంగా తీసుకోవడం వెనుక ఉన్న అసలు ఉద్దేశ్యం బీజేపీ బలంగా ఉన్న హిందీ రాష్ట్రాల్లో సీట్లను పెంచుకోవడమే. దీనివల్ల లోక్‌సభలో దక్షిణాది గొంతు మూగబోయే ప్రమాదం ఉంది. ప్రజాస్వామ్యంలో ప్రజలందరికీ సమాన ప్రాతినిధ్యం ఉండాలి కానీ, ప్రగతి సాధించిన వారిని శిక్షించేలా ఉండకూడదు. ఈ ప్రత్యేక సమావేశాలు కేవలం ఒక రాజకీయ ప్రహసనంగా మిగిలిపోకూడదు. మహిళలకు సాధికారత కల్పించడం ఎంత ముఖ్యమో, దేశంలోని అన్ని ప్రాంతాలకు సమాన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం కూడా అంతే ముఖ్యం. మోదీ ప్రభుత్వం తన పంతాన్ని వీడి, దక్షిణాది రాష్ట్రాల ఆందోళనలను పరిగణనలోకి తీసుకోవాలి. లేనిపక్షంలో, ఈ డీలిమిటేషన్ ప్రక్రియ దేశంలో కొత్త రకమైన ప్రాంతీయ విభేదాలకు దారితీస్తుంది. అభివృద్ధి చెందిన రాష్ట్రాలకు అన్యాయం చేస్తూ, కేవలం ఓట్ల రాజకీయాల కోసం నియోజకవర్గాలను పునర్విభజించడం ప్రజాస్వామ్య విలువలకే విరుద్ధం. ప్రభుత్వం తన అడుగులను పునరాలోచించుకోకపోతే, చరిత్రలో ఇది ఒక చీకటి అధ్యాయంగా మిగిలిపోతుంది.

# ఇంటర్ టాపర్లను సన్మానించిన సిపి

**నిజామాబాద్, విశాలభారతి:**



ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలలో ప్రతిభను కనబరిచి టాపర్లుగా నిలిచిన ఉషోదయ జూనియర్ కళాశాల విద్యార్థులను నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య అభినందించారు బుధవారం బోధనలో ఉషోదయ కళాశాల ఇంటర్ టాపర్లను ఆయన పూలమాల శాలువాలతో సత్కరించి అభినందించారు రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ మార్కులను సాధించడం అభినందనీయమని ప్రశంసించారు ఇంటర్ ద్వితీయ సంవత్సరం ప్రథమ సంవత్సరం ఫలితాలలో జిల్లాలో ఉషోదయ జూనియర్ కళాశాల టాపర్గా నిలిచిందని ప్రశంసించారు ఈ కార్యక్రమంలో ఉషోదయ విద్యాసంస్థల చైర్మన్ సూర్య ప్రకాష్ రావు డైరెక్టర్ దుశాంత్ రమణి బోధన్ ఏసిపి శ్రీనివాసరావు సిఐ వెంకటనారాయణ కళాశాల ప్రిన్సిపాల్ అధ్యాపకులు ఉన్నారు.

# హస్తం పార్టీలో అసంతృప్తి హోరు..!

**మొదటిపేజీ తరువాయి**

తెలంగాణలో అధికారం హస్తగతం చేసుకున్న ఆనందం కాంగ్రెస్ శ్రేణుల్లో మెండుగా ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో మాత్రం అసంతృప్తి జ్వాలలు అంతర్గతంగా రగులుతూనే ఉన్నాయి. ముఖ్యంగా బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన ఎమ్మెల్యేల పరిస్థితి ఇప్పుడు 'ముందు నుయ్యి వెనుక గొయ్యి'లా తయారైంది. తమ రాజకీయ భవిష్యత్తు కోసం, నియోజకవర్గాల అభివృద్ధి పేరుతో పార్టీ మారిన పది మంది ఎమ్మెల్యేలకు ఇప్పుడు ఊహించని సవాళ్లు ఎదురవుతున్నాయి. పదవుల పంపకంలో ప్రాధాన్యత దక్కకపోవడం, ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంతో వీరంతా ఇప్పుడు డైలమాలో పడ్డారు. కొందరు బాహాటంగానే విమర్శలు గుప్పిస్తుండగా, మరికొందరు లోలోపల మథనపడుతూ తమ అసంతృప్తిని సున్నితంగా వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిణామాల్లో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి వ్యవహారం అత్యంత ఆసక్తికరంగా మారింది. పార్టీ మారిన పది మందిలో ఆయనే అందరికంటే ముందుగా తన పంథాను మార్చుకున్నారు. మున్సిపల్ ఎన్నికల వేళ ఆయన అనుసరించిన వ్యూహం రాజకీయ వర్గాలను ఆశ్చర్యపరిచింది. తన సోదరుడిని తిరిగి బీఆర్ఎస్‌లోకి పంపి, పురపోరులో గులాబీ పార్టీ విజయానికి ఆయన గట్టిగా కృషి చేశారు. క్షేత్రస్థాయిలో పార్టీ క్యాడర్‌ను కాపాడుకోవడానికి ఆయన చేసిన ఈ 'యూటర్న్' ఫలితాన్ని ఇచ్చింది. పటాన్‌చెరులో మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఏకపక్ష విజయం సాధించడం వెనుక మహిపాల్ రెడ్డి వ్యూహాత్మక మద్దతు ఉందనేది బహిరంగ రహస్యం. కాంగ్రెస్‌లో ఉంటూనే ఇతర పార్టీలకు సహకరించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. అనుభవజ్ఞుడైన రాజకీయ వేత్త, మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. అసలు రాష్ట్రంలో ప్రభుత్వం పనిచేస్తుందా అని ఆయన ప్రశ్నించడం కాంగ్రెస్ అధిష్ఠానాన్ని ఆత్మరక్షణలో పడేసింది. వ్యవసాయ సలహాదారుడిగా ప్రభుత్వం ఆయనకు పదవిని కట్టబెట్టినప్పటికీ, అది కేవలం అలంకారప్రాయంగానే మిగిలిపోయిందన్నది ఆయన ఆవేదన. సిద్ధాపూర్ రిజర్వాయర్‌కు నిధుల విడుదల విషయంలో మంత్రుల చుట్టూ ఇరవై సార్లు తిరిగినా ఫలితం లేకపోవడం, చివరకు మంత్రులు తన ఫోన్ కాల్స్‌కు కూడా స్పందించకపోవడం పోచారాన్ని తీవ్ర అసహనానికి గురిచేసింది. ఈ పరిస్థితుల్లో కాంగ్రెస్‌లో కొనసాగడం అవసరమా అన్న దిశగా ఆయన ఆలోచిస్తున్నట్లు సమాచారం, ఇది ఆయన పునరాగమనానికి సంకేతంగా కనిపిస్తోంది.

జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. అభివృద్ధి మంత్రం జపించి పార్టీ మారిన వీరికి, ఇప్పుడు నియోజకవర్గాల్లో ప్రజలకు సమాధానం చెప్పుకోలేని పరిస్థితి నెలకొంది. నిధుల కేటాయింపులో జాప్యం, స్థానిక కాంగ్రెస్ నేతల నుంచి ఎదురవుతున్న వ్యతిరేకత వీరిని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. పార్టీ మారిన రెండేళ్లు గడుస్తున్నా ఆశించిన స్థాయిలో పనులు జరగకపోవడంతో, తమ రాజకీయ అస్తిత్వం ప్రమాదంలో పడుతుందనే ఆందోళన వీరిలో స్పష్టంగా కనిపిస్తోంది. పైగా తమకు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన భరోసా లభించకపోవడంతో వీరు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. మునుగోడు పోరులో గెలిచిన కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అసంతృప్తి మరో కోణంలో ఉంది. సీనియర్ నాయకుడిగా తనకు మంత్రి పదవి దక్కుతుందని ఆశించిన ఆయనకు, అది దక్కకపోవడంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై నేరుగా విమర్శనాస్త్రాలు సంధిస్తున్నారు. అవకాశం దొరికినప్పుడల్లా ప్రభుత్వ నిర్ణయాలను తప్పుబడుతూ, తన అసహనాన్ని వెళ్లగక్కుతున్నారు. పార్టీలోని అంతర్గత విభేదాలు ఇలా బహిర్గతం కావడం వల్ల కాంగ్రెస్ ప్రతిష్టకు భంగం కలుగుతోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సీనియారిటీని గౌరవించలేదని భావిస్తున్న రాజగోపాల్ రెడ్డి, భవిష్యత్తులో తన సొంత పంథాను ఎంచుకునే అవకాశాలు లేకపోలేదన్న చర్చ సాగుతోంది. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు క్యాబినెట్‌లో ప్రాతినిధ్యం లేకపోవడం మరో ప్రధాన సమస్యగా మారింది. ఈ జిల్లా నుంచి పలువురు సీనియర్లు గెలిచినప్పటికీ, వారికి మంత్రి పదవులు లభించలేదు. కేవలం పి. సుదర్శన్ రెడ్డిని సలహాదారుగా నియమించి చేతులు దులుపుకున్నారనే విమర్శలు గట్టిగా వినిపిస్తున్నాయి. రేకులపల్లి భూపతి రెడ్డి, మదన్ మోహన్ రావు వంటి నాయకులకు తగిన గుర్తింపు లభించలేదనే భావన జిల్లా ప్రజల్లో నెలకొంది. ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే బలమైన నాయకత్వం లేకపోవడం వల్ల నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల అభివృద్ధి కుంటుపడుతోందని స్థానిక నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది రాబోయే ఎన్నికలపై ప్రభావం చూపే అవకాశం ఉందని జిల్లా రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. గత ప్రభుత్వాల్లో ఈ ప్రాంతాల నుంచి ఐదుగురు మంత్రులు ఉండేవారు, కానీ ఇప్పుడు ఒక్కరూ లేకపోవడం గమనార్హం. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తనకు మంత్రి పదవి కావాలని బాహాటంగానే తన డిమాండ్‌ను వినిపిస్తున్నారు. ఈ కీలక ప్రాంతాల నుంచి ప్రాతినిధ్యం లేకపోవడం వల్ల పాలనాపరమైన సమస్యలు తలెత్తుతున్నాయని ఆయన వాదిస్తున్నారు. పార్టీ అభివృద్ధి కోసం కష్టపడిన వారికి గుర్తింపు ఉండాలని, రాజధాని ప్రాంతం నుంచి కనీసం ఒక్కరికైనా అవకాశం ఇవ్వాలని ఆయన పట్టుబడుతున్నారు. ఈ అసంతృప్తి జ్వాలలు మెల్లగా ఇతర జిల్లాలకు కూడా వ్యాపిస్తున్నాయి. రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేసిన వ్యాఖ్యలు పార్టీలో కొత్త వివాదాన్ని రేపాయి. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మాస్ లీడర్ కాదని ఆయన వ్యాఖ్యానించడం రాజకీయ వర్గాల్లో కలకలం సృష్టించింది. ఒకవేళ జగ్గారెడ్డిని పీసీసీ చీఫ్‌గా నియమిస్తే పార్టీకి వంద సీట్లు వస్తాయని చెప్పడం ద్వారా ఆయన ప్రస్తుత నాయకత్వంపై పరోక్షంగా అసంతృప్తిని వెళ్లగక్కారు. పార్టీ అధికారంలో ఉన్న సమయంలో ఇలాంటి వ్యాఖ్యలు చేయడం వల్ల కార్యకర్తల్లో గందరగోళం ఏర్పడుతోంది. సీనియర్ మంత్రుల మధ్య ఉన్న సమన్వయ లోపం ఈ వ్యాఖ్యల ద్వారా స్పష్టంగా కనిపిస్తోంది. ఇది పార్టీ అంతర్గత క్రమశిక్షణపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. కాంగ్రెస్ పార్టీలో ఎప్పుడూ ఉండే లాబీయింగ్ రాజకీయాలు ఇప్పుడు మరింత ముదిరాయి. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, సీనియర్ మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి వంటి వారు ప్రస్తుత పరిస్థితులను గమనిస్తూ సరైన సమయం కోసం వేచి చూస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఢిల్లీ స్థాయిలో తమకున్న పలుకుబడిని ఉపయోగించుకుని, పరిస్థితులు తారుమారైనప్పుడు చక్రం తిప్పాలని వీరు భావిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీలో ప్రజాస్వామ్యం ఎక్కువగా ఉండటం వల్ల ఎవరికి వారు తమ స్వంత వర్గాలను కాపాడుకుంటూ, భవిష్యత్తు వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నారు. ఈ పరిణామాలు రేవంత్ రెడ్డి నాయకత్వానికి పెద్ద సవాలుగా పరిణమించే అవకాశం ఉంది. సీనియర్ నేత జీవన్ రెడ్డి వంటి వారు క్రమంగా మౌనం వహిస్తుండటం, ఇతర నేతలు పదవుల కోసం ఆరాటపడటం చూస్తుంటే కాంగ్రెస్‌లో అంతర్గత సంక్షోభం తలెత్తేలా కనిపిస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పాలనతో హైకమాండ్ వద్ద మార్కులు కొట్టేస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అసంతృప్తి నేతలను బుజ్జగించడంలో విఫలమవుతున్నారని తెలుస్తోంది. ఢిల్లీ పెద్దల మద్దతు రేవంత్ రెడ్డికి ఉన్నంత కాలం ఆయన పదవికి ముప్పు లేనప్పటికీ, అసంతృప్తి నేతలు తిరుగుబాటు జెండా ఎగరేస్తే మాత్రం ప్రభుత్వం ఇబ్బందుల్లో పడే ప్రమాదం ఉంది. ఫిరాయింపు ఎమ్మెల్యేలు మళ్లీ తమ సొంత గూటికి చేరేందుకు సిద్ధమవుతున్నట్లు కనిపిస్తుండటం తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త మలుపులకు నాంది కానుంది.



# కేసీఆర్ 'మౌన వ్రతం'

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో ఒకప్పుడు తిరుగులేని శక్తిగా వెలుగొందిన భారత్ రాష్ట్ర సమితి, నేడు ఆశించిన స్థాయిలో తన గళాన్ని వినిపించలేకపోవడం చర్చనీయాంశంగా మారింది. దేశవ్యాప్తంగా రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్న తరుణంలో, ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన వంటి అత్యంత కీలకమైన బిల్లులపై దేశమంతా గగ్గోలు పెడుతుంటే, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు అనుసరిస్తున్న మౌనం రాజకీయ వర్గాల్లో విస్మయాన్ని కలిగిస్తోంది. ఒకనాడు జాతీయ రాజకీయాలను శాసిస్తానని ప్రగల్భాలు పలికిన నేత, నేడు తన వ్యవసాయ క్షేత్రానికే పరిమితమై, బయటి ప్రపంచంతో సంబంధం లేనట్లుగా వ్యవహరించడం ఆ పార్టీ శ్రేణుల్లోనే ఆందోళన నింపుతోంది. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రతిపక్షాల సూచనలను బేఖాతరు చేస్తూ, అఖిలపక్ష సమావేశాలను సైతం నిర్వహించకుండా ఏకపక్షంగా ముందుకు సాగుతుండటంపై దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఇప్పటికే యుద్ధం ప్రకటించారు. రేవంత్ రెడ్డి, పినరయి విజయన్, ఎంకే స్టాలిన్ వంటి నేతలు నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు జరిగే అన్యాయాన్ని ఎండగడుతూ గళమెత్తుతున్నారు. లోక్‌సభ స్థానాల పునర్విభజన జరిగితే జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలు రాజకీయంగా ప్రాబల్యం కోల్పోయే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. ఇంతటి తీవ్రమైన పరిస్థితి నెలకొన్నప్పటికీ, పదేళ్లపాటు రాష్ట్రాన్ని పాలించిన అనుభవం ఉన్న కేసీఆర్ మాత్రం స్పందించకపోవడం గమనార్హం. సాధారణంగా ఏ చిన్న అంశం దొరికినా కేంద్రంపై విరుచుకుపడే కేసీఆర్, ఇప్పుడు ఇంతటి కీలకమైన బిల్లుల విషయంలో ఎందుకు వెనకడుగు వేస్తున్నారనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పుతో విరక్తి చెందారో లేక ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేవనెత్తుతున్న అంశాలకు మద్దతు తెలపడం ఇష్టం లేక మౌనం వహిస్తున్నారో అర్థం కావడం లేదు. రాజకీయ వైరిపక్షం అయినప్పటికీ, రాష్ట్ర ప్రయోజనాల విషయంలో కలిసి రావాల్సిన బాధ్యత ప్రధాన ప్రతిపక్ష నేతపై ఉంటుంది. కానీ, ప్రజా క్షేత్రంలోకి వచ్చి తన గళాన్ని వినిపించకుండా ఫామ్ హౌస్ గోడల మధ్యే రాజకీయాలు నెరపడం వల్ల తెలంగాణ ప్రయోజనాలకు విఘాతం కలిగే ప్రమాదం ఉంది. బిల్లుల విషయంలో బీఆర్ఎస్ వైఖరి ఏంటో తెలియజేయకుండా కేవలం లీకులతోనే సరిపెట్టడం ఆ పార్టీ దిగజారుతున్న తీరుకు అద్దం పడుతోంది. కేటీఆర్, హరీశ్‌రావు వంటి కీలక నేతలు ఫామ్ హౌస్ వెళ్లి అధినేతతో చర్చలు జరిపారని, మహిళా బిల్లుకు మద్దతు తెలపాలని నిర్ణయించారని సోషల్ మీడియాలోనూ, మీడియాలోనూ వార్తలు వస్తున్నాయి తప్ప, అధికారికంగా స్పష్టమైన ప్రకటన వెలువడలేదు. పునర్విభజన బిల్లుపై లోతుగా అధ్యయనం చేయాలని కేసీఆర్ సూచించినట్లు సమాచారం. అయితే, ఇప్పటికే కేంద్రం బిల్లులోని ముసాయిదాను అందరికీ అందుబాటులో ఉంచినప్పుడు, ఇంకా అధ్యయనం పేరుతో కాలయాపన చేయడం వెనుక ఉన్న అంతర్యమేమిటో ఎవరికీ అంతుచిక్కడం లేదు.



మోదీ ప్రభుత్వం తన పంతాన్ని నెగ్గించుకోవడానికి ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటోందని స్పష్టమవుతోంది. ముఖ్యంగా రాజ్యాంగ సవరణ అవసరమైన ఈ బిల్లులను ఆమోదింపజేసుకోవడానికి సభలో రెండింట మూడొంతుల మెజారిటీ అవసరం. ప్రస్తుతం ఎన్డీయే కూటమికి ఉన్న బలం సరిపోనందున, ఇతర పార్టీల మద్దతు కోసం తెరవెనుక ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి కీలక సమయంలో కేసీఆర్ మౌనం వహించడం వల్ల, ఆయన కేంద్రంతో ఏదైనా లోపాయికారీ ఒప్పందం చేసుకున్నారా లేక వ్యక్తిగత ఇబ్బందుల వల్ల బయటకు రావడంలేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజాస్వామ్యంలో ప్రధాన ప్రతిపక్షం తన పాత్రను విస్మరిస్తే అది పాలకులకు వరంగా మారుతుంది. కేంద్రం అనుసరిస్తున్న విధానాల వల్ల ఉత్తరాది రాష్ట్రాలకు లబ్ధి చేకూరి, దక్షిణాది రాష్ట్రాల గొంతు నొక్కేసే ప్రమాదం పొంచి ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. రేవంత్ రెడ్డి ఉదాహరణలతో సహా ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తుంటే, మేధావిగా చెప్పుకునే కేసీఆర్ దీనిపై మౌనం వహించడం తెలంగాణ సమాజానికి ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా ఉండి కూడా సభకు హాజరుకాకుండా, రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయించే అంశాలపై స్పందించకుండా ఉండటం బాధ్యతారాహిత్యమే అవుతుంది. కేవలం లీకుల ద్వారా రాజకీయం నడిపించడం వల్ల పార్టీ కేడర్‌లో కూడా నైతిక స్థైర్యం దెబ్బతినే అవకాశం ఉంది. పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టిన తర్వాత మాట్లాడదాం అని అనుకోవడం విజ్ఞత అనిపించుకోదు. చట్టం కాకముందే దానిలోని లోపాలను ఎత్తిచూపి, ప్రజలను చైతన్యపరచాల్సిన బాధ్యత రాజకీయ పార్టీలపై ఉంటుంది. కానీ బీఆర్ఎస్ మాత్రం ఆ దిశగా అడుగులు వేయడం లేదు. ఒకప్పుడు ఉద్యమనేతగా ప్రజల్లో ఉండి పోరాడిన కేసీఆర్, ఇప్పుడు కేవలం ఫామ్ హౌస్‌కే పరిమితం కావడం ఆయన రాజకీయ పతనానికి సంకేతమని ప్రత్యర్థులు విమర్శిస్తున్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజం, కానీ ఓటమి ఎదురైనప్పుడు ప్రజలకు దూరం కావడం సరైన పద్ధతి కాదు. ప్రస్తుత తరుణంలో ప్రతిపక్షాలన్నీ ఏకమై కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉంది. నియోజకవర్గాల పునర్విభజన అనేది కేవలం రాజకీయ అంశం మాత్రమే కాదు, అది రాష్ట్రాల ఉనికికి మరియు నిధుల కేటాయింపుకు సంబంధించిన జీవన్మరణ సమస్య. ఇలాంటి విషయంలో కూడా కేసీఆర్ తన వైఖరిని స్పష్టంగా వెల్లడించలేకపోవడం ఆయన రాజకీయ అభద్రతను సూచిస్తోంది. తన వారసులకు బాధ్యతలు అప్పగించి తాను విశ్రాంతి తీసుకోవాలని భావిస్తున్నారా, లేక కేంద్రంపై పోరాడే సత్తా కోల్పోయారా అన్న సందేహాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. అధికారంలో ఉన్నప్పుడు అన్నీ తానే అయి నడిపించిన కేసీఆర్, ఇప్పుడు తన బాధ్యతను మరచిపోవడం విచారకరం. ప్రధాని మోదీ అనుసరిస్తున్న అహంభావ పూరిత వైఖరిని అడ్డుకోవాలంటే అన్ని ప్రాంతీయ పార్టీలు బలంగా గళమెత్తాలి. కానీ కేసీఆర్ మౌనం వల్ల తెలంగాణ తరపున వినిపించాల్సిన గొంతు బలహీనపడుతోంది. ఒక రాష్ట్రానికి పదేళ్ల పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తికి ఉన్న గౌరవం, ఆయన స్పందించే తీరును బట్టే ఉంటుంది. కానీ కేసీఆర్ తీరు చూస్తుంటే ఆయనకు రాష్ట్ర ప్రయోజనాల కంటే రాజకీయ వ్యూహాలే ముఖ్యమనిపిస్తోంది. తెలంగాణ రాజకీయాల్లో బీఆర్ఎస్ ఉనికి ప్రశ్నార్థకంగా మారుతున్న తరుణంలో, కేసీఆర్ ఇప్పటికైనా తన మౌనాన్ని వీడాల్సి ఉంది. ఫామ్ హౌస్ రాజకీయాన్ని వదిలి ప్రజాక్షేత్రంలోకి వచ్చి కేంద్రంపై పోరాడకుంటే, భవిష్యత్తులో తెలంగాణ నష్టపోవడమే కాకుండా, ఆ పార్టీ ఉనికే ప్రమాదంలో పడే అవకాశం ఉంది. తన వ్యక్తిగత ఎజెండాల కోసం రాష్ట్ర ప్రయోజనాలను పణంగా పెడుతున్నారన్న విమర్శల నుంచి ఆయన బయటపడాలంటే, తక్షణమే కీలక బిల్లులపై తన స్పష్టమైన వైఖరిని బహిరంగంగా ప్రకటించాలి. లేనిపక్షంలో, చరిత్ర ఆయనను ఒక అసమర్థ ప్రతిపక్ష నేతగా ముద్ర వేసే ప్రమాదం ఉంది. బీఆర్ఎస్ పార్టీ అధినేతగా ఆయన తీసుకునే నిర్ణయమే ఆ పార్టీ భవిష్యత్తును నిర్ణయిస్తుంది.

# అన్యాయం చేస్తే ఉద్యమం తప్పదు

**మొదటిపేజీ తరువాయి**

ప్రభావాన్ని ప్రశ్నార్థకం చేసేలా ఉన్నాయన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్రానికి గట్టి హెచ్చరిక జారీ చేశారు. జనాభా నియంత్రణలో ఆదర్శంగా నిలిచిన రాష్ట్రాలకు శిక్ష వేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికే విరుద్ధమని ఆయన మండిపడ్డారు. ఈ ప్రక్రియ వల్ల దక్షిణాదికి అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోబోమని, అవసరమైతే దేశం గర్వించదగ్గ స్థాయిలో ఒక భారీ ప్రజా ఉద్యమానికి శ్రీకారం చుడతామని స్పష్టం చేశారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం దేశ సమగ్రతను దెబ్బతీయవద్దని ఆయన హితవు పలికారు. దక్షిణాది రాష్ట్రాలు దశాబ్దాలుగా జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని జనాభా నియంత్రణ పథకాలను అత్యంత సమర్థవంతంగా అమలు చేశాయి. విద్యా, వైద్య, ఆర్థిక రంగాల్లో అద్భుతమైన ప్రగతిని సాధిస్తూ దేశ జీడీపీలో సింహభాగాన్ని అందిస్తున్నాయి. ఇలాంటి అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాలను ప్రోత్సహించాల్సింది పోయి, వాటి రాజకీయ ప్రాతినిధ్యాన్ని తగ్గించడం అంటే అది అభివృద్ధికి వేసే సంకెళ్లే అవుతుందని కేటీఆర్ అభిప్రాయపడ్డారు. ఢిల్లీ పాలకుల తీరు చూస్తుంటే కష్టపడి పనిచేసే రాష్ట్రాలను తొక్కేయాలనే కుట్రలా కనిపిస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ఈ విషయంలో తాము మూడేళ్ల క్రితం తీసుకున్న దృఢమైన నిర్ణయానికే ఇప్పటికీ కట్టుబడి ఉన్నామని, ఇందులో రాజీ పడే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. భారతదేశం విభిన్న సంస్కృతులు, భాషల సమాహారం. సమాఖ్య వ్యవస్థలో అన్ని ప్రాంతాలకు సమాన ప్రాధాన్యత ఉండాలి. కానీ, రాబోయే నియోజకవర్గాల పునర్విభజన కేవలం జనాభా ప్రాతిపదికన మాత్రమే చేపడితే, ఉత్తరాది రాష్ట్రాలకు ఎంపీ సీట్లు భారీగా పెరిగి, దక్షిణాది రాష్ట్రాలు తమ ప్రభావాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. ఇది పార్లమెంటులో దక్షిణాది ప్రజల గొంతును నొక్కేయడమే అవుతుందని కేటీఆర్ విమర్శించారు. మనం గర్వించదగ్గ భారతీయులమని చెప్పుకోవడంలో ఎంత నిజం ఉందో, మన రాష్ట్రాల హక్కులను కాపాడుకోవడంలో కూడా అంతే బాధ్యత ఉందని ఆయన గుర్తు చేశారు. కేంద్రం అనుసరిస్తున్న ఈ ఏకపక్ష ధోరణి వల్ల రాష్ట్రాల మధ్య విభేదాలు తలెత్తే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. దక్షిణాది రాష్ట్రాల ప్రతినిధిత్వం తగ్గడం అంటే అది కేవలం ఒక రాజకీయ మార్పు మాత్రమే కాదు, అది ఆర్థిక నిర్ణయాలపై కూడా ప్రభావం చూపుతుంది. కేంద్రం నుంచి వచ్చే నిధుల కేటాయింపులో ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతోందన్న వాదన బలంగా ఉంది.



ఇప్పుడు రాజకీయంగా కూడా బలం తగ్గితే, భవిష్యత్తులో దక్షిణాది గొంతు ఢిల్లీ వీధుల్లో వినబడకుండా పోయే ప్రమాదం ఉంది. దీన్ని అరికట్టడానికి అన్ని రాష్ట్రాలు ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందని కేటీఆర్ పిలుపునిచ్చారు. ఇది కేవలం ఒక పార్టీకి సంబంధించిన సమస్య కాదు, కోట్లాది మంది దక్షిణ భారతీయుల ఆత్మగౌరవానికి సంబంధించిన అంశమని ఆయన పేర్కొన్నారు. అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న తెలంగాణ, తమిళనాడు, కేరళ, కర్ణాటక వంటి రాష్ట్రాలు తమ ప్రగతికి ప్రతిఫలంగా రాజకీయ శిక్షను అనుభవించాల్సి రావడం అత్యంత దురదృష్టకరం. జనాభాను పెంచుకుంటూ పోయిన రాష్ట్రాలకు ఎంపీ సీట్లు పెంచి బహుమతి ఇవ్వడం వల్ల దేశ ప్రగతి కుంటుపడుతుంది. కేంద్ర ప్రభుత్వం వాస్తవ పరిస్థితులను గ్రహించి, శాస్త్రీయ దృక్పథంతో నిర్ణయాలు తీసుకోవాలని కేటీఆర్ కోరారు. ఒకవేళ మొండిగా ముందుకెళ్తే మాత్రం దక్షిణాది ప్రజల నుంచి తీవ్ర ప్రతిఘటన తప్పదని ఆయన స్పష్టం చేశారు. ప్రాంతీయ వివక్షను వీడి, దేశంలోని అన్ని రాష్ట్రాలను సమానంగా చూడాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందని ఆయన గుర్తు చేశారు. నియోజకవర్గాల పెంపు అన్నది ప్రజాస్వామ్యంలో సహజ ప్రక్రియే అయినప్పటికీ, అది ఒక ప్రాంతానికి లాభం చేకూర్చి మరో ప్రాంతానికి నష్టం కలిగించేలా ఉండకూడదు. ప్రస్తుతం తెరపైకి వస్తున్న గణాంకాలు దక్షిణాది ప్రజల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ ఆందోళనను కేంద్రం పరిగణనలోకి తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఢిల్లీ పాలకులు తమ మొండి వైఖరిని వీడి, అన్ని వర్గాల ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకోవాలని ఆకాంక్షించారు. లేనిపక్షంలో చరిత్రలో ఎన్నడూ చూడని విధంగా దక్షిణాది రాష్ట్రాలన్నీ ఏకమై పోరాట బాట పట్టడం ఖాయమని ఆయన పేర్కొన్నారు. ఈ పోరాటంలో బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడూ ముందుంటుందని కేటీఆర్ స్పష్టం చేశారు. తమ ప్రజల హక్కుల కోసం, తమ రాష్ట్ర భవిష్యత్తు కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధమని ఆయన ప్రకటించారు. తెలంగాణ గడ్డపై నుంచి మొదలయ్యే ఈ పోరాటం దక్షిణ భారత దేశమంతటా పాకుతుందని ఆయన హెచ్చరించారు. కేంద్రం ఇప్పటికైనా తన ఆలోచనా విధానాన్ని మార్చుకుని, అభివృద్ధికి గుర్తింపునిచ్చేలా నియోజకవర్గాల విభజన చేయాలని కోరారు. ప్రజల మనోభావాలను అణచివేయాలని చూస్తే వచ్చే ఫలితాలు తీవ్రంగా ఉంటాయని ఆయన గుర్తు చేశారు. జాతీయ సమగ్రత అనేది కేవలం మాటల్లో ఉంటే సరిపోదు, అది చేతల్లో కూడా కనిపించాలని కేటీఆర్ అన్నారు. దక్షిణాది రాష్ట్రాలు దేశానికి వెన్నెముకగా నిలుస్తున్నాయి. అలాంటి వెన్నెముకను విరిచే ప్రయత్నం చేస్తే దేశం ఎలా నిలబడుతుందని ఆయన ప్రశ్నించారు. సమాఖ్య స్ఫూర్తిని కాపాడటంలో కేంద్ర ప్రభుత్వం విఫలమవుతోందని, డీలిమిటేషన్ విషయంలో కూడా అదే ధోరణి కొనసాగితే అది దేశ ఐక్యతకు ముప్పుగా పరిణమిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఢిల్లీ పెద్దలకు బుద్ధి ప్రబలాలని, దక్షిణాది ఆవేదనను ఆలకించాలని ఆయన కోరారు. కేటీఆర్ చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు దేశ వ్యాప్తంగా చర్చనీయాంశమయ్యాయి. దక్షిణాదిలోని ఇతర రాజకీయ పార్టీలు కూడా ఈ అంశంపై గొంతు కలిపే అవకాశం ఉంది. రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాల ప్రయోజనాల కోసం అందరూ ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని విశ్లేషకులు భావిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం కేవలం సంఖ్యా బలంపై దృష్టి పెట్టకుండా, రాష్ట్రాల మధ్య సమతుల్యతను కాపాడటంపై శ్రద్ధ వహించాలి. ఈ విషయంలో కేటీఆర్ చేసిన హెచ్చరిక ఒక బలమైన హెచ్చరికగా కేంద్రం పరిగణించాల్సి ఉంటుంది.

## బంచరాయితండలో అగ్నిప్రమాదం

**రూ.50 వేల ఆస్తి నష్టం**



**కురవి విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా కురవి మండలం బంచరాయితండ గ్రామంలో బుధవారం అగ్నిప్రమాదం సంభవించి గడ్డి వాము పూర్తిగా దగ్ధమైంది. గ్రామానికి చెందిన బాధవత్ శంకర్ (తండ్రి సీత్య) కు చెందిన గడ్డి వాము అకస్మాత్తుగా మంటలు అంటుకుని క్షణాల్లోనే అగ్నికి ఆహుతైంది. మంటలు ఎగసిపడుతున్న దృశ్యాన్ని గమనించిన గ్రామస్తుడు దేవేందర్ అప్రమత్తంగా వ్యవహరిస్తూ వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది తక్షణమే సంఘటనా స్థలానికి చేరుకుని సమయోచిత చర్యలు తీసుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. వారి చురుకైన స్పందనతో అగ్ని మరింత విస్తరించకుండా నిలువరించగలిగారు. ఈ ప్రమాదంలో గడ్డి వాము పూర్తిగా కాలిపోవడంతో బాధిత కుటుంబానికి సుమారు రూ.50 వేల మేర నష్టం వాటిల్లిందని బాధితులు తెలిపారు. మంటలు ఎలా చెలరేగాయన్నది తెలియాల్సి ఉంది. ఘటనతో గ్రామంలో ఆందోళన నెలకొనగా, బాధిత కుటుంబానికి ప్రభుత్వం నుంచి సహాయం అందించాలని స్థానికులు కోరుతున్నారు.

## జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులుగా జాహంగీర్



**మోత్కూరు,విశాలభారతి:** జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులుగా మోత్కూరు సాక్షి రిపోర్టర్ వెలిమినేటి జాహంగీర్ మూడోసారి నియమితులయ్యారు. గత మూడు దశాబ్దాలపైగా జర్నలిస్టుగా రాణిస్తున్న జాహంగీర్ ప్రస్తుతం టీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీ సభ్యులుగా , కొనసాగుతున్నారు..జర్నలిస్టులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై తమ వంతుగా నిరంతరం కృషి చేస్తున్నారు. ఆయన చేస్తున్న అంకితభావం నిబద్ధతనే ప్రస్తుతం జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సభ్యులుగా నియమిస్తూ ఇటీవల రాష్ట్ర సమాచార కమీషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా జాహంగీర్ బుధవారం "తెలుగు ప్రభ "ప్రతినిదితో మాట్లాడుతూ జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం కృషి చేస్తానని, న్యాయబద్ధంగా రావాల్సిన అక్రిడేషన్లు, అర్హులైన జర్నలిస్టందరికీ ఇళ్లస్థలాల అంశంపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కృషి నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు అక్రిడేషన్ కమిటీ సభ్యులుగా జాహంగీర్ నియామకం పట్ల మోత్కూరు జర్నలిస్టులు బుర్ర శ్రీను, గాదెబోయిన నాగరాజు, వారాల నరేష్ తో పాటు పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## రామగుండంలో దోస్త్ షార్ట్ ఫిలిం షూటింగ్

**విశాలభారతి , గోదావరిఖని:** రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో సృజనాత్మక రంగానికి మరింత ఉత్సాహాన్ని నింపుతూ "దోస్త్" లఘు చిత్ర చిత్రీకరణ బుధవారం ఘనంగా ప్రారంభమైంది. పల్లవి చరణం మీడియా క్రియేషన్ బ్యానర్‌పై రూపొందుతున్న ఈ చిత్రం షూటింగ్‌ను బి పవర్ హౌస్ హనుమాన్ జంక్షన్ వద్ద ప్రారంభించారు. ప్రారంభోత్సవ వేడుకకు సినీ, మీడియా రంగాలకు చెందిన ప్రముఖులు హాజరై సందడి చేశారు. ఈ చిత్రాన్ని రామగుండానికి చెందిన సీనియర్ ఫోటోగ్రాఫర్, దర్శకుడు మోదుంపల్లి రామస్వామి రూపొందిస్తున్నారు. సమాజానికి సందేశం అందించే కథాంశంతో రూపొందుతున్న "దోస్త్" చిత్రం, నేటి యువతలో స్నేహం, బాధ్యత, విలువల ప్రాముఖ్యతను ప్రతిబింబించేలా ఉంటుందని దర్శకుడు తెలిపారు. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా హాజరైన డైరెక్టర్ వర్మ, గోదావరిఖని సీనియర్ జర్నలిస్టు దయానంద్ గాంధీ, సినీ రచయిత దయ నర్సింగ్, దర్శకుడు దామెర శంకర్ చిత్ర బృందాన్ని అభినందించారు.



## దళిత క్రైస్తవులు అన్యాయం

**క్రిస్టియన్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి మాణిక్యాల శ్రీనివాస్**

**నిజామాబాద్, విశాలభారతి:**

ప్రతి మనిషి పుట్టుకతో తన కులం పుట్టుతుందని మతాలు మనుషులు ఇష్టానుసారంగా మారవచ్చునని క్రైస్తవ హక్కుల రక్షణ సమితి అష్ట అధ్యక్షుడు డాక్టర్ అశోక్, క్రిస్టియన్ కౌన్సిల్ రాష్ట్ర కార్యదర్శి మాణిక్యాల శ్రీనివాస్ తెలిపారు .ఆర్మూర్ ప్రెస్ క్లబ్ భవనంలో బుధవారం విలేకరుల సమావేశం లో వారు మాట్లాడారు. దళితులు క్రైస్తవ మతంలోకి మారితే ఎస్సి హోదా రద్దు చేయడంపై సుప్రీంకోర్టు పునఃసమీక్షించాలని కోరారు. మతం వేరు కులం వేరు అని ఈ రెండింటిని వేరువేరుగా చూడాలన్నారు. క్రైస్తవ మతంలోకి మారితే దళితులకు ఎస్సీ అట్రాసిటీ కేసు పెట్టడం వర్తించదని సుప్రీంకోర్టు తీర్పు ఇవ్వడం వలన అణగారిన దళితులకు అన్యాయం జరిగినట్లని పేర్కొన్నారు. హిందువులలోని ఇతర కులస్తులు క్రైస్తవ మతంలోకి మారిన బీసీలుగానే పరిగణలోకి తీసుకుంటారని చెప్పారు. దళితులు మతం మారితేనే ఎస్సి హోదా పోతుందా అని వారు ప్రశ్నించారు. సుప్రీంకోర్టు తీర్పు మత స్వేచ్ఛను, ప్రాథమిక హక్కులను కాలరాస్తుందని చెప్పారు. దళితులు కాకుండా ఇతరులు క్రైస్తవులుగా మారితే రిజర్వేషన్లు వర్తిస్తున్నాయని చెప్పారు. మతం, కులాలు వేరు కాబట్టి దళిత క్రైస్తవులకు ఎస్సీ చట్టాలను వర్తింపజేయాలన్నారు. సుప్రీంకోర్టు దళిత క్రైస్తవులకు ఇచ్చిన తీర్పును తొలగించాలని ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. రైతు కూలి సంఘం రాష్ట్ర కార్యదర్శి బి దేవరాం, ప్రజాస్వామ్య పరిరక్షణ కమిటీ మండల చైర్మన్ మూగ ప్రభాకర్ మాట్లాడుతూ దళిత క్రైస్తవులకు రిజర్వేషన్లను తొలగిస్తామనడం సమంజసం కాదన్నారు. అగ్రవర్ణాలకు సైతం రిజర్వేషన్లు అమలు చేస్తూ అణగారిన వారిని రిజర్వేషన్లు తొలగిస్తే సమిష్టిగా ఉండి ఉద్యమిస్తామన్నారు. దళిత క్రైస్తవులపై ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు ధర్మాసనం పునః సమీక్షించాలని వారు కోరారు. ఈ సమావేశంలో ఆర్మూర్ క్రైస్తవ అసోసియేషన్ మండల అధ్యక్షులు జాన రమేష్, మండల ప్రధాన కార్యదర్శి పాస్టర్ రాజ్ పాల్ దినకర్, పాస్టర్ ప్రకాష్, పాస్టర్ ఆగస్టిన్ తదితరులు పాల్గొన్నారు.




## విదేశీ ఉద్యోగాలపై కీలక ప్రకటన

**రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి**

**విశాలభారతి, మంచిర్యాల:**

మంచిర్యాలలోని తన నివాసంలో కార్మిక మరియు గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి మీడియాతో సమావేశమై టాంకామ్ ద్వారా విదేశాల్లో ఉద్యోగావకాశాలపై రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. జర్మనీ వంటి దేశాల్లో భారీగా ఉద్యోగావకాశాలు ఉన్నాయని, తెలంగాణ యువత ఆ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. జర్మనీలో ప్రతి సంవత్సరం సుమారు 5 లక్షల ఉద్యోగాల అవసరం ఉందని, అందుకు అనుగుణంగా ప్రతి ఏడాది 90 వేల వీసాలు జారీ చేసేందుకు ఆ దేశం ముందుకు వచ్చిందన్నారు. రాష్ట్రంలో ఏటీసీల ద్వారా 25 వేల మంది యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ ఇస్తున్నామని, ఇందుకోసం ప్రభుత్వం ₹4,000 కోట్లు ఖర్చు చేస్తోందని తెలిపారు.టాంకామ్ ద్వారా నాలుగు నెలల్లోనే జర్మన్ భాష శిక్షణ అందిస్తామని, ప్రైవేటు ఏజెన్సీల మోసాలకు గురికాకుండా యువత జాగ్రత్తగా ఉండాలని సూచించారు. విదేశాల్లో భారతీయులకు మంచి పేరు ఉందని, అక్కడి చట్టాలను గౌరవిస్తూ కష్టపడి పనిచేస్తారని గుర్తుచేశారు. నెలకు ₹2 లక్షలకు పైగా వేతనాలు పొందే అవకాశాలు ఉన్నాయని చెప్పారు.కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చిందని, ఇప్పటికే లక్షకు పైగా ఉద్యోగాలు కల్పించిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చెందుతుందని తెలిపారు. స్థానిక నిరుద్యోగ యువత టాంకామ్ అందిస్తున్న అవకాశాలను వినియోగించుకోవాలని కోరారు. తెలంగాణ గిగ్ వర్కర్స్ యాక్ట్ దేశానికి ఆదర్శంగా నిలిచిందని, అసంఘటిత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని మంత్రి వివరించారు.



## ఫ్లైఓవర్ ప్రణాళికల మార్పుపై చౌటుప్పల్‌లో రాస్తారోకో



**యాదాద్రి భువనగిరి, విశాలభారతి:** జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ వంతెన ప్రణాళికలను మార్చారని ఆరోపిస్తూ జిల్లాలోని చౌటుప్పల్‌లో భాజపా కార్యకర్తలు బుధవారం రాస్తారోకో చేపట్టారు. గత ప్రణాళిక ప్రకారం హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై స్థానిక ఆర్టీసీ బస్సు స్టేషన్ ఎదుట అండర్‌పాస్ నిర్మించాలని వారు డిమాండ్ చేశారు. మట్టికట్ట నిర్మాణం వల్ల స్థానిక ప్రజలు రహదారిని దాటేందుకు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందని, రద్దీ పెరిగి ప్రమాదాలు సంభవించే ప్రమాదం ఉందని ఆర్డీవో శేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. భాజపా పురపాలక కమిటీ అధ్యక్షురాలు కడారి కల్పనా యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దూడల భిక్షంగౌడ్, రాష్ట్ర కమిటీ సభ్యుడు గోవర్ధన్ రెడ్డి, నాయకులు శంకరయ్య, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యపై సోషల్ మీడియా ఆరోపణలు

**కఠిన చర్యలు తీసుకోవాలని వినతి**




**ఆలేరు, విశాలభారతి:** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, ఆలేరు నియోజకవర్గ అభివృద్ధి దిశగా కృషి చేస్తున్న ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యపై బీఆర్ఎస్ నాయకులు సోషల్ మీడియా, ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అసత్య ఆరోపణలు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆలేరు మాజీ ఎంపీపీ అశోక్ డిమాండ్ చేశారు. బుధవారం ఏసీపీ శ్రీనివాస్ నాయుడు, సీఐ యాలాద్రి, ఆలేరు ఎస్సై వినయ్ కుమార్‌లకు వినతిపత్రం అందజేశారు. ప్రజాప్రతినిధుల ప్రతిష్టను దెబ్బతీయే విధంగా తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బైరంనగరం సర్పంచ్ కంపరాజు వెంకటేశ్వరరాజు, మండల నాయకులు కంథీ నాగరాజు, వీరభద్రం రాజు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**నిజామాబాద్, విశాలభారతి :** మాక్లూర్ మండల హెడ్ క్వార్టర్ లో మాదాపూర్ గ్రామం లో ఐకెపి ఆహ్వానంమేరకు మాక్లూర్ మండలం అధ్యక్షురాలు బిజెపిగంగోని మదారి మమత రాజేశ్వర్ వెళ్లడం జరిగినది అధికారులతో ప్రారంభించడం జరిగినది.

## మాటూరు విద్యార్థికి సన్మానం



**మోటకొండూర్,విశాలభారతి:** మోటకొండూరు మండలంలోని మాటూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులు సాత్విక్, ఆర్థికులు ఐదో తరగతి గురుకుల ప్రవేశ పరీక్షలో సీట్లు సాధించిన సందర్భంగా గ్రామ సర్పంచ్ సిద్ధులు, ఏఎపీసీ చైర్మన్ సుదగాని సబిత శుభాకాంక్షలు తెలుపుతూ సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సిద్ధులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతున్నదానికి ఈ విజయమే నిదర్శనమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు రమేష్, ఉపాధ్యాయులు నీలిమ, స్వాతి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కౌన్సిలర్ సంపత్ అభినందన సభ పోస్టర్ ఆవిష్కరణ




**ఆలేరు, విశాలభారతి:** ఆలేరు పట్టణ కేంద్రంలో ఏబీవీపీ పూర్వ కార్యకర్తల ఆధ్వర్యంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ పూర్వ బాగ్‌కో ఆలేరు-రాజపేట-యాదగిరిగుట్ట ఇన్‌చార్జి కన్వీనర్‌గా సేవలందించిన, ప్రస్తుతం ఆలేరు మున్సిపాలిటీ ఐదో వార్డు కౌన్సిలర్‌గా గెలుపొందిన పాసికంటి సంపత్‌కు ఆత్మీయ అభినందన సభ నిర్వహించనున్న సందర్భంగా బుధవారం సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి కన్వీనర్ పేరెపు ఆనంద్ హాజరై మాట్లాడుతూ, ఆలేరు ప్రాంతానికి చెందిన సంపత్ విద్యార్థి దశలో ఏబీవీపీలో చురుకుగా పనిచేసి విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పలు పోరాటాలు నిర్వహించారని తెలిపారు. అనంతరం భారతీయ జనతా యువమోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడిగా సేవలందించి, నేడు ప్రజాక్షేత్రంలో మున్సిపాలిటీ ఐదో వార్డులో విజయకేతనం ఎగరవేయడం గర్వకారణమని అన్నారు. ఈ సందర్భంగా ఏప్రిల్ 19, ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక కమలమ్మ జనార్దన్ గార్డెన్‌లో నిర్వహించనున్న అభినందన సభకు ఆంధ్రప్రదేశ్-ఛత్తీస్‌గఢ్ ప్రాంత పూర్వ సంఘటన్ కార్యదర్శి నారిశెట్టి ఆదిశేషు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు. ఈ కార్యక్రమంలో మైదా భాస్కర్, దీపక్ చారి, శ్రీకాంత్, వినయ్, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువత కోసం శిక్షణ




**విశాలభారతి , ఎన్ టిపిసి:** నిరుద్యోగ యువత కోసం వృత్తి విద్యా శిక్షణ మరియు ఉద్యోగ కల్పన కార్యక్రమంలో భాగంగా ప్లాస్టిక్ పరిశ్రమలో ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో, ఎన్‌టిపిసి రామగుండం (హెచ్‌ఆర్-సిఎస్‌ఆర్) సిపెట్ - హైదరాబాద్ ద్వారా నిరుద్యోగ యువత కోసం ఒక వృత్తి విద్యా శిక్షణ మరియు ఉద్యోగ కల్పన కార్యక్రమాన్ని నిర్వహించబోతున్నారు.ఆసక్తిగల అభ్యర్థులు దయచేసి క్రింద ఇవ్వబడిన క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి దరఖాస్తు చేసుకోగలరు.అర్హతా ప్రమాణాలు,వయస్సు: 18 నుండి 30 సంవత్సరాలు,కనీస విద్యార్హత: 10వ తరగతి ఉత్తీర్ణత లింగం అబ్బాయిలు మరియు అమ్మాయిలు ఇద్దరూ దరఖాస్తు చేసుకోవచ్చు.ఎంపికైన అభ్యర్థులను 4 నెలల పాటు ఉచితంగా రెసిడెన్షియల్ శిక్షణ కోసం సిపెట్, హైదరాబాద్‌కు పంపబడతారు.పరిమిత సీట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఎన్‌టిపిసి రామగుండం చుట్టుపక్కల గ్రామాలకు చెందిన అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది.

## పాఠశాలలో "అరైవ్ అలైవ్" ప్రచారం




**దేవరప్పుల విశాలభారతి:** మండలం సింగరాజుపల్లి హరిజన కాలనీలో నీ ప్రాథమిక పాఠశాలలో "అరైవ్ అలైవ్" కార్యక్రమం ఉత్సాహ ంగా నిర్వహించబడింది. రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు తరగతి గదిలోనే కాకుండా, క్షేత్రస్థాయిలో కూడా అవగాహన కల్పించారు. పాదచారులు ఎడమవైపు నడవడం, బైక్ పై ప్రయాణించే వారు హెల్మెట్ ధరించడం, కారులో బెల్టు పెట్టుకోవడం, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం, వంటి ముఖ్య నియమాలను వివరించారు. అలాగే మద్యం సేవిఃచి వాహనం నడపకూడదు, అని ఓవర్ స్పీడ్ కు దూరంగా ఉండాలని, యూటర్న్ లను జాగ్రత్తగా తీసుకోవాలని, బోర్డులను గమనిస్తూ డ్రైవింగ్ చేయాలని సూచించారు. ప్రత్యక్షంగా అవగాహన కల్పించేందుకు పాఠశాల ముందు రోడ్డుపై సున్నంతో జీబ్రా క్రాసింగ్ గీసి ఉపాధ్యా యులు పర్యవేక్షణలో విద్యార్థులను క్రమశిక్షణతో దాటించారు. ఈ సందర్భంగా చిన్నారులు రోడ్డుపై వెళ్తున్న వాహనదారులకు హెల్మెట్ ధరించాలని, త్రిబుల్ రైడింగ్ చేయవద్దని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయవద్దని,నీ కోసం మీ కుటుంబ సభ్యులు ఎదురుచూస్తున్నారు అని, బాధ్యతను గుర్తు చేశారు. వాహనదారులు విద్యార్థుల అవగాహన కార్యక్రమాన్ని ప్రశంసిస్తూ వారి సూచనలు పాటిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు చింత శ్రీలత, రాపాక శ్రీలత, రాపాక రమ్య, ఆయా లక్ష్మి, రాపాక శిరీశ రాపాక లలిత,తో పాటు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్.. వ్యక్తికి 2 రోజుల జైలు



**విశాలభారతి, గోదావరిఖని:** రామగుండం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ బి.రాజేశ్వరరావు ఆధ్వర్యంలో డ్రంక్&డ్రైవ్ లో దొరికిన ముగ్గురిని , సెకండ్ అడిషనల్ మేజిస్ట్రేట్ గోదావరిఖని, శ్రీ వెంకటేష్ దుర్వ ముందు హాజరుపరుచగా ఇద్దరికి 4000 రూపాయల జరిమానా విధించారు. ఒక వ్యక్తి కి రెండవ సారి పట్టుబడగా 02 రోజుల జైలు శిక్ష విధించారు. వీరిని కరీంనగర్ జిల్లా జైలుకు తరలించడం జరిగింది. అనంతరం సీఐ మాట్లాడుతూ వాహనం మద్యం తాగి వాహనం నడప రాదని నడిపినచో వారిపై చట్టరీత్యా చర్య తీసుకోవడం జరుగుతుంది . మరియు వాహనానికి సంబంధించిన పత్రములు మరియు టూ వీలర్ వెహికల్స్ నడిపేవారు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని మరియు రాంగ్ రూట్లో వెళ్లరాదని ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వాహన్నాన్ని అతివేగంగా నడపరాదని సిఐ తెలియజేయడం జరిగింది.

## అంబేద్కర్ జయంతిని నిర్వహించని విద్యాసంస్థల పై చర్యలు తీసుకోవాలి

- అంబేద్కర్ జయంతినీ కొన్ని విద్యాసంస్థల్లో నిర్వహించకపోవడం సిగ్గుచేటు
- రాజ్యంగ నిర్మాత అంబేద్కర్ జయంతినీ నిర్లక్ష్యం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలి
- ఎస్ఎఫ్ఐ టౌన్ సెక్రటరీ కొప్పుల రవీందర్ డిమాండ్

**భద్రాచలం, విశాలభారతి:** భారత రాజ్యాంగ నిర్మాత, సమానత్వం, సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి దేశవ్యాప్తంగా ఘనంగా నిర్వహించబడుతున్న సమయంలో, కొన్ని విద్యా సంస్థలలో ఈ మహనుభావుడి జయంతిని నిర్వహించకపోవడం అత్యంత బాధాకరమని కొప్పుల రవీందర్ అన్నారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తూ, విద్య సంస్థల అధికారుల నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ కేవలం ఏ ఒక్క కులానికి వర్గానికి చెందిన వాడు కాదని ఆయన ఆలోచనలు దేశానికి ఆదర్శమని, మార్గదర్శకమని, ఆయన అన్నారు. అలాంటి మహనీయుని జయంతిని జరపకపోవడం అంటే సమానత్వం, రాజ్యాంగ విలువలను అవమానించడం అనే అర్థం వస్తుందనీ ఆయన తప్పుపట్టారు. ప్రభుత్వం నిర్వహిస్తున్న విద్య సంస్థల్లో విద్యార్థులకు చరిత్ర, సామాజిక చైతన్యం పెంపొందించాల్సిన బాధ్యత ఉన్న అధికారులు, అంబేద్కర్ జయంతిని నిర్లక్ష్యం చేయడం ద్వారా తమ బాధ్యతలను విస్మరించారనీ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది కేవలం పరిపాలనా వైఫల్యం మాత్రమే కాకుండా, సామాజిక న్యాయం పట్ల ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనం అవుతుంద నీ ఎస్ఎఫ్ఐ స్పష్టం చేస్తోందనీ ఆయన పేర్కొన్నారు.ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలనీ. సంబంధిత అధికారులపై విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలనీ. ప్రతి విద్య సంస్థల్లో జాతీయ నాయకుల జయంతులు తప్పనిసరిగా నిర్వహించేలా స్పష్టమైన మార్గదర్శకాలు అమలు చేయాలనీ ,విద్యార్థుల్లో చైతన్యం పెంచడం కోసం అంబేద్కర్ ఆలోచనలను విస్తృతంగా చర్చించాలనీ, సమానత్వం, హక్కులు, విద్య ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడం విద్యా సంస్థల ప్రధాన బాధ్యతగా ఉండాలనీ ఎస్ఎఫ్ఐగా హెచ్చరిస్తునామానిమా ఆయన తెలిపారు.ఈ సమస్యను తేలికగా తీసుకుంటే భవిష్యత్తులో ఎస్ఎఫ్ఐగా ఆందోళనలు చేపడతామనీ, విద్యార్థుల హక్కులు, సామాజిక న్యాయం కోసం ఎస్ఎఫ్ఐ ఎప్పటికీ పోరాడుతుందనీ రవీందర్ అన్నారు. ఈ కార్యక్రమంలో తరుణ్ ప్రశాంత్ పృథ్వి తదితరులు పాల్గొన్నారు.




# డీలిమిటేషన్‌పై రేవంత్ అబద్ధాలు



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

నియోజకవర్గాల పునర్విభజన అంశంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాగిస్తున్న ప్రచారం కేవలం రాజకీయ లబ్ధి కోసమేనని, ఆయన చెబుతున్నవన్నీ పచ్చి అబద్ధాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు తీవ్రస్థాయిలో విమర్శించారు. బుధవారం వరంగల్ జిల్లాలో పర్యటించిన ఆయన, అక్కడ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తీరుపై మండిపడ్డారు. దేశంలో జనాభా పెరుగుదలకు అనుగుణంగా ప్రాతినిధ్యం పెరగాల్సిన అవసరం ఉందని, దీన్ని రాజ్యాంగబద్ధంగా నిర్వహించే ప్రక్రియను రేవంత్ రెడ్డి వక్రీకరిస్తున్నారని ఆయన ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం చట్టప్రకారం అడుగులు వేస్తుంటే, ప్రజలను తప్పుదోవ పట్టించేలా రేవంత్ రెడ్డి అసత్య ప్రచారాలకు తెరలేపారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో 1971 జనాభా లెక్కల ఆధారంగా ఇప్పటివరకు నియోజకవర్గాల సంఖ్య కొనసాగుతోందని, అయితే ప్రస్తుత పరిస్థితుల్లో మార్పులు అనివార్యమని రాంచందర్ రావు స్పష్టం చేశారు. ఒకప్పుడు 70 కోట్ల జనాభా ఉన్న సమయంలో 540 ఎంపీ సీట్లు ఉండేవని, ప్రస్తుతం దేశ జనాభా 140 కోట్లకు చేరుకున్న తరుణంలో సీట్ల సంఖ్య పెరగాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన వివరించారు. జనాభా నిష్పత్తికి తగ్గట్టుగా ప్రజల గొంతుక పార్లమెంటులో వినిపించాలంటే డీలిమిటేషన్ ప్రక్రియ శాస్త్రీయంగా జరగాల్సిందేనని ఆయన నొక్కి చెప్పారు. దీనిని కేవలం దక్షిణాది రాష్ట్రాలకు జరుగుతున్న అన్యాయంగా చిత్రీకరించడం కాంగ్రెస్ కుట్రలో భాగమని, అభివృద్ధిని అడ్డుకోవడమే వారి ధ్యేయమని ఆయన విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల ప్రతిపాదించిన హైబ్రిడ్ సిస్టమ్ విధానంపై రాంచందర్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రేవంత్ రెడ్డి మాట్లాడుతున్న మాటలు అర్థం లేనివని, అసలు ప్రపంచంలో ఎక్కడా లేని వింత పోకడలను ఆయన ప్రస్తావిస్తున్నారని ఎద్దేవా చేశారు. నియోజకవర్గాల పెంపు అనేది ఎవరో ఒకరి ఇష్టానుసారం జరిగేది కాదని, రాజ్యాంగంలోని సెక్షన్ 81 నిబంధనల ప్రకారం ఇది కొనసాగుతుందని ఆయన గుర్తు చేశారు. సాంకేతిక అంశాలపై కనీస అవగాహన లేకుండా, కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం కొత్త సిద్ధాంతాలను తెరపైకి తెచ్చి రేవంత్ రెడ్డి ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని ఆయన మండిపడ్డారు. దేశాన్ని విభజించే ధోరణిలో కాంగ్రెస్ పార్టీ వ్యవహరిస్తోందని, దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం అన్యాయం చేస్తోందంటూ ప్రాంతీయ విద్వేషాలను రగిలిస్తోందని రాంచందర్ రావు ఆరోపించారు. ఒకవైపు దేశ సమగ్రత గురించి మాట్లాడుతూనే, మరోవైపు ఉత్తరదక్షిణ విభజన రేఖను గీయడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని ఆయన విమర్శించారు. మతాల మధ్య చిచ్చు పెట్టడం కాంగ్రెస్ పార్టీకి అలవాటైన విద్యేనని, ఇప్పుడు ప్రాంతాల మధ్య కూడా వైషమ్యాలు పెంచాలని చూస్తోందని ధ్వజమెత్తారు. డీలిమిటేషన్ ప్రక్రియను అడ్డుపెట్టుకుని రాజకీయ పబ్బం గడుపుకోవాలని చూడటం శోచనీయమని ఆయన వ్యాఖ్యానించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అంశాన్ని ప్రస్తావిస్తూ రాంచందర్ రావు కాంగ్రెస్ ద్వంద్వ నీతిని ఎండగట్టారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు మహిళా బిల్లును ఆమోదించడంలో కాంగ్రెస్ ఎందుకు విఫలమైందో రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు మోదీ ప్రభుత్వం చిత్తశుద్ధితో మహిళలకు ప్రాతినిధ్యం కల్పించేందుకు బిల్లును తీసుకువస్తే, దానిని అడ్డుకోవడానికి డీలిమిటేషన్ అనే పంచాయితీని కాంగ్రెస్ కావాలనే ముందుకు తెచ్చిందని ఆయన విశ్లేషించారు. మహిళలకు చట్టసభల్లో గౌరవం దక్కడం కాంగ్రెస్ పార్టీకి ఇష్టం లేదని, అందుకే ఇన్ని అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆయన ఘాటుగా విమర్శించారు. హైదరాబాద్ నగరం విషయంలో కాంగ్రెస్ తీసుకున్న నిర్ణయాలను కూడా ఆయన తప్పుబట్టారు. గతంలో హైదరాబాద్‌ను మూడు ముక్కలు చేసినప్పుడు ముఖ్యమంత్రి ఎవరి అనుమతి తీసుకున్నారని, అప్పుడు ప్రజాస్వామ్య విలువల గురించి ఎందుకు ఆలోచించలేదని ఆయన ప్రశ్నించారు. సొంత నిర్ణయాలతో నగర రూపురేఖలను మార్చిన చరిత్ర కాంగ్రెస్‌దని, ఇప్పుడు కేంద్రం చేస్తున్న రాజ్యాంగబద్ధమైన ప్రక్రియను మాత్రం తప్పు పట్టడం వారి నైజమని అన్నారు. రేవంత్ రెడ్డి చెబుతున్నవన్నీ కట్టుకథలని, వాస్తవాలకు దూరంగా ఉన్నాయని ఆయన కొట్టిపారేశారు. నియోజకవర్గాల పెంపు అనేది ఒక నిర్దిష్టమైన శాతంతో, పారదర్శకంగా జరుగుతుందని రాంచందర్ రావు స్పష్టం చేశారు. ఉన్న సీట్లను శాస్త్రీయ పద్ధతిలో పెంచుతామని, ఇందులో ఎవరికీ అన్యాయం జరిగే ప్రసక్తే లేదని ఆయన హామీ ఇచ్చారు. ఇండియా అలయన్స్ పేరుతో ఒక్కటైన పార్టీలు దేశంలో లేనిపోని విభేదాలను సృష్టిస్తున్నాయని ఆయన ఆరోపించారు. ప్రజల్లో భయాందోళనలు కలిగించి రాజకీయ లబ్ధి పొందడమే ఈ కూటమి అసలు ఉద్దేశమని ఆయన విమర్శించారు. అభివృద్ధి పనుల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికే కాంగ్రెస్ ఇలాంటి అనవసర రభస చేస్తోందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ సమాజం రేవంత్ రెడ్డి మాటలను నమ్మే స్థితిలో లేదని రాంచందర్ రావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమై, ఇప్పుడు డీలిమిటేషన్ పేరుతో కాలయాపన చేస్తోందని విమర్శించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, అభివృద్ధి ప్రాజెక్టుల గురించి పట్టించుకోకుండా, కేంద్రంపై బురద చల్లడమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి పాలన సాగిస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ ఎప్పుడూ రాజ్యాంగబద్ధంగా, ప్రజల ప్రయోజనాల కోసమే నిర్ణయాలు తీసుకుంటుందని, డీలిమిటేషన్ విషయంలో కూడా ఇదే పద్ధతి అనుసరిస్తుందని ఆయన స్పష్టం చేశారు. వరంగల్ జిల్లా అభివృద్ధిని కూడా కాంగ్రెస్ సర్కార్ విస్మరించిందని రాంచందర్ రావు విమర్శించారు. స్థానిక సమస్యలను పరిష్కరించడం చేతకాక, జాతీయ స్థాయి అంశాలపై తప్పుడు ప్రచారాలు చేస్తూ ప్రభుత్వం పబ్బం గడుపుకుంటోందని అన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, త్వరలోనే కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ముఖ్యమంత్రి బాధ్యతాయుతమైన పదవిలో ఉండి, ఇలాంటి బాధ్యతారహితమైన వ్యాఖ్యలు చేయడం రాష్ట్ర ప్రతిష్ఠను దెబ్బతీస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. డీలిమిటేషన్ ప్రక్రియపై ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇది దేశ భవిష్యత్తు కోసం, మెరుగైన ప్రజా ప్రాతినిధ్యం కోసం చేపడుతున్న చర్య అని రాంచందర్ రావు పునరుద్ఘాటించారు. రేవంత్ రెడ్డి తన దుష్ప్రచారాన్ని మానుకుని, రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి సారించాలని హితవు పలికారు. అబద్ధాలతో రాజకీయం చేయడం ఎంతో కాలం సాగదని, వాస్తవాలు త్వరలోనే ప్రజల ముందుకు వస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గాల పెంపు ద్వారా సామాన్య ప్రజలకు తమ ప్రతినిధులను ఎన్నుకునే అవకాశం మరింత సులభతరం అవుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## శ్రీ చైతన్య వొకేషనల్ జూనియర్ కళాశాల విజయభేరి

**రాష్ట్ర–జిల్లా స్థాయి ర్యాంకులతో విద్యార్థుల ప్రతిభ చాటింపు**



**మహబూబాబాద్ జిల్లా విశాలభారతి:**

ఇటీవల విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో శ్రీ చైతన్య వొకేషనల్ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విజయభేరి మోగించారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల్లో రాష్ట్ర మరియు జిల్లా స్థాయి ర్యాంకులను సాధించి కళాశాల కీర్తిని మరింత పెంచారు. ద్వితీయ సంవత్సర ఫలితాల్లో గుగులోత్ పావని (ఎంఎస్‌డబ్ల్యూ) 987/1000 మార్కులతో అగ్రస్థానంలో నిలిచి విశేష ప్రతిభ కనబరిచింది. భూక్యా రోజా 966 మార్కులు, మద్దినేని అనిత 965 మార్కులు సాధించి ప్రతిభ చాటగా, పూనం కావ్య (ఎంఎల్టీ) 927 మార్కులు, గుగులోత్ సంధ్య (ఎంఎల్టీ) 791 మార్కులు, బండి సందీప్ (ఈటీ) 769 మార్కులతో మంచి ఫలితాలు సాధించారు. ప్రథమ సంవత్సరంలో బానోత్ ప్రశాంత్ (ఎంఎల్టీ) 454/500 మార్కులతో ముందంజలో నిలిచాడు. మడిపెల్లి రామ్ చరణ్ 439 మార్కులు, దప్పు మీనాక్షి (ఎంటీఎస్‌డబ్ల్యూ) 428 మార్కులు, సుంకరి శిరీష (ఎస్‌డబ్ల్యూ) 421 మార్కులు, పాత వివేక్ (ఈటీ) 358 మార్కులు సాధించి తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ చల్లగాలి మోజెస్ విద్యార్థులను అభినందిస్తూ, క్రమశిక్షణతో చదువుకుంటూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని గొప్ప విజయాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఐ. పుల్లారావు, వైస్ ప్రిన్సిపాల్ తిరుమలేష్, శ్రీనివాస్ రెడ్డి, ప్రసాద్, కళావతి, సురేందర్, సత్యనారాయణ, రాజు, రమ, అరుణ, లిఖిత తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటల సాగుతో రైతులకు లాభాదాయకం




**నల్లు సుధాకర్ రెడ్డి ఆత్మ కమిటీ చైర్మన్**

**మహబూబాబాద్, విశాలభారతి:**

పంట మార్పిడి, ప్రత్యామ్నాయ పంటల సాగు చేపట్టడంతోనే రైతులకు వ్యవసాయం లాబాసాటిగా మారుతుందని ఆత్మ కమిటీ చైర్మన్ నల్ల సుధాకర్ రెడ్డి పిలుపునిచ్చారు. కురవి మండల కేంద్రంలోని వ్యవసాయ క్షేత్రంలో రైతులకు ఆయిల్ ఫామ్ సాగుపై అవగాహన సదస్సును ఉద్యానవన మరియు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆత్మ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ రైతులందరూ ఒకే పంట నిరంతరం సాగు చేయడం వలన భూసారం తగ్గిపోవడం, పంటకు డిమాండ్ తగ్గి రైతులకు నష్టాలు రావడం జరుగుతుందని కాబట్టి ప్రతి రైతు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని దానిలో భాగంగా ఆయిల ్ఫామ్ సాగు ఎక్కువ విస్తీర్ణంలో ఆధునిక పద్ధతులతో రైతాంగం సాగు చేసి, ప్రభుత్వము నుండి వచ్చే అనేక రాయితీలను పొందాలని కోరారు అదేవిధంగా తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన భూసార పరీక్షలను ప్రతి రైతు ఉపయోగించుకోవాలనీ కోరారు. కెవికే మల్యాల శాస్త్రవేత్తలు ప్రశాంత్, సుహాసి ని లు రైతులకు సాగులో మెలకువలు గురించి వివరించారు. ఉద్యానవన జిల్లాఅధికారి మరియన్న మాట్లాడుతూ ఉద్యానవన సాగుతూనే రైతులకు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు సాధించవచ్చునని అన్నారు ఆయిల్ ఫామ్ సాగు డైరీ మరియు కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయిల్ ఫాం సాగు చేసిన ఆదర్శ రైతులు వెంకట్ రెడ్డి, ప్రతాపని పుల్లయ్య, రామ్ రెడ్డి, సత్యనారాయణ లను చైర్మన్ మరియు అధికారులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు నరసింహారావు, శాంతి ప్రియ, రాజేశ్వరి రైతులు పాల్గొన్నారు.

## పోషణ పక్వాడలో సామూహిక శ్రీమంతులు

**తొలి వెయ్యి రోజులు బిడ్డ భవిష్యత్తుకు కీలకం**

**ఆలేరు,విశాలభారతి:**




బిడ్డ ఎదుగుదలలో పోషకాహారం కీలక పాత్ర పోషిస్తుందని, ముఖ్యంగా జననం ముందు నుంచి తొలి వెయ్యి రోజులు మెదడు అభివృద్ధికి అత్యంత ముఖ్యమని ఆలేరు మున్సిపల్ చైర్ పర్సన్ బాలమణి భాస్కర్, సీడీపీవో స్వరాజ్యం పేర్కొన్నారు. బుధవారం ఆలేరు పట్టణ కేంద్రంలోని ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో పోషణ పక్వాడ (9 నుంచి 23 వరకు) కార్యక్రమంలో భాగంగా సామూహిక శ్రీమంతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారు గర్భిణీలకు గర్భధారణ సమయంలో తీసుకోవాల్సిన పోషకాహారం, పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గర్భిణీలు సమయానుసారంగా వైద్య పరీక్షలు చేయించుకొని, సాధ్యమైనంతవరకు సాధారణ ప్రసవం జరిగేలా వైద్యుల సూచనలు పాటించాలని సూచించారు. ప్రసవం అనంతరం వెంటనే ముర్రుపాలు పట్టించడం, ఆరు నెలల వరకు పూర్తిగా తల్లిపాలు ఇవ్వడం, ఆరు నెలల తరువాత అనుబంధ పోషకాహారం ప్రారంభించడం ఎంతో అవసరమన్నారు. రెండు సంవత్సరాల వరకు తల్లిపాలు కొనసాగించడం వల్ల తల్లికి రొమ్ము క్యాన్సర్ ప్రమాదం తగ్గడంతో పాటు బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని వివరించారు. అంగన్వాడీలలో అందిస్తున్న పోషకాహారాన్ని గర్భిణీలు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెండో వార్డు కౌన్సిలర్ మరియమ్మ మార్క్, ఎంఆర్‌వో ఆంజనేయులు, ఎంపీడీవో సత్య ఆంజనేయ ప్రసాద్, ఏపీఎం సత్యనారాయణ, సూపర్వైజర్లు ఆండాలు, జ్యోతి, అంగన్వాడీ టీచర్లు, వెల్ఫేర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు

**చైర్పర్సన్ సోనియా దర్శన్**



**మొయినాబాద్, విశాలభారతి:** మున్సిపాలిటీ పరిధిలో ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని చైర్పర్సన్ సోనియా దర్శన్ తెలిపారు. మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఎనికేపల్లి 9వ వార్డులో రూ.15 లక్షల నిధులతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ మరియు సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. ప్రతి వార్డులో సమానంగా అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గరుగు రాజు, కౌన్సిలర్లు ముదిగొండ ప్రభాకర్, మహేష్, వార్డ్ ఆఫీసర్ వెంకటేష్, నాయకులు షాబాద్ దర్శన్, సాయికిరణ్ గౌడ్, రఘు, రమేష్, రాజేష్, బాల్‌రాజ్, బిక్షపతి, శ్రీశైలం, యాదగిరి, గోపాల్ రెడ్డి, శేఖర్ రెడ్డి, జంగయ్య, డి. శ్రీనివాస్, సురేష్, మహిపాల్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, మల్లేష్, సత్యనారాయణ గౌడ్, మహేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## వీధి కుక్కల స్వైర విహారం

**వృద్ధుడిపై దాడి, పరిస్థితి విషమం.. పట్టించుకోని అధికారులు... ప్రజల్లో ఆగ్రహం**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఉప్పరగూడలో వీధి కుక్కల సమస్య తీవ్ర రూపం దాల్చింది. తాజాగా వీధి కుక్కల దాడిలో ఓ వృద్ధుడు తీవ్రంగా గాయపడటంతో స్థానికంగా భయాందోళనలు నెలకొన్నాయి. గ్రామానికి చెందిన ఎన్ను జయపాల్ రెడ్డి (75)పై ఆకస్మికంగా దాడి చేసిన వీధి కుక్కలు ఆయనను తీవ్రంగా గాయపరిచాయి. దాడి సమయంలో గాయాలపాలైన జయపాల్ రెడ్డి పరిస్థితి విషమంగా మారడంతో కుటుంబ సభ్యులు వెంటనే నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం ఆందోళనకరంగా ఉన్నట్లు సమాచారం. గ్రామంలో గత కొంతకాలంగా వీధి కుక్కలు గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నప్పటికీ, సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు ఫిర్యాదులు చేసినా స్పందన లేకపోవడం పట్ల ప్రజలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రాణాలకు ముప్పుగా మారుతున్న ఈ సమస్యపై తక్షణ చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. వీధి కుక్కలను నియంత్రించడంలో అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తే మరిన్ని ఇలాంటి ఘటనలు జరిగే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఈ ఘటనతో అధికారులు వెంటనే స్పందించి, వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటారా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు .

## లచ్చాపురంలో దారుణ ఘటన

- దాడి, అవమానంతో వృద్ధుడి ఆత్మహత్య
- ఇంటిలోకి చొరబడి దాడి... ప్రజల ముందే అవమానం
- మానసిక వేదనతో ఉరివేసుకున్న తండ్రి
- ఇంటిలోకి బలవంతంగా ప్రవేశించి వృద్ధుడిపై దాడి చేసిన ఇద్దరు వ్యక్తులు
- బజారులో బట్టలు ఊడదీసి అవమానించారన్న ఆరోపణలు
- అవమానాన్ని తట్టుకోలేక ఉరివేసుకొని ఆత్మహత్య చేసిన బాధితుడు



**అశ్వారావుపేట, విశాలభారతి:** దమ్మపేట మండలం రాచురుపల్లి పంచాయతీ పరిధిలోని లచ్చాపురం గ్రామంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. దాడి చేసి ప్రజల ముందే అవమానించడంతో మనస్తాపానికి గురైన వృద్ధుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానికంగా కలకలం రేపింది.గ్రామానికి చెందిన పొలిమేర తేజ (30), వృత్తి కూలీ, తన తండ్రి పొలిమేర వెంకటేశ్వరరావు (63)పై జరిగిన ఘటనపై దమ్మపేట పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేశారు.ఫిర్యాదు వివరాల ప్రకారం, ఈ రోజు ఉదయం సుమారు 8:30 గంటల సమయంలో తిరువీధుల జేమ్స్ (55), గద్దల వెంకట రమణ (57) కలిసి బాధితుడి ఇంటి వద్దకు వచ్చారు. ఎవరో ఫోన్ చేసి తమపై దుర్భాషలాడినట్టు చెప్పడంతో కక్షపూరితంగా స్పందించిన వారు, ఇంటిలోకి బలవంతంగా ప్రవేశించి పొలిమేర వెంకటేశ్వరరావును కాలర్ పట్టుకొని బయటకు లాగి బజారులోకి తీసుకెళ్లి ప్రజల మధ్య క్రూరంగా దాడి చేశారు. అంతేకాకుండా, ఆయనను బట్టలు ఊడదీసి ప్రజల ముందే అమానుషంగా అవమానపరిచినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనను తన కళ్లముందే చూసిన తేజ వారిని ఆపేందుకు ప్రయత్నిస్తూ "ఏమైనా తప్పు జరిగి ఉంటే క్షమించండి, దయచేసి కొట్టకండి" అని వేడుకున్నా, వారు మరింతగా దాడి కొనసాగించారని తెలిపారు.ఈ సంఘటనను చూసిన గ్రామస్థులు ప్రశ్నించగా, "మీకు సంబంధం లేదు, అడ్డొస్తే మిమ్మల్ని కూడా కొడతాం" అంటూ బెదిరించినట్టు తెలిపారు. జరిగిన అవమానం, మానసిక వేదనను తట్టుకోలేక పొలిమేర వెంకటేశ్వరరావు ఇంటి వెనుక షెడ్లోకి వెళ్లి ఇనుప కడ్డికి తాడుతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయనను ఆ స్థితిలో గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే దింపి దమ్మపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మరణించినట్టు వైద్యులు నిర్ధారించారు.ఈ ఘటనపై తిరువీధుల జేమ్స్, గద్దల వెంకట రమణలపై తక్షణమే కేసు నమోదు చేసి, కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితుడి కుమారుడు పోలీసులను కోరాడు.ఈ సంఘటనపై స్థానికుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది.

# బాధ్యతారాహిత్యం వల్లే ప్రమాదాలు

**రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్**




**నిజామాబాద్, విశాలభారతి:**

నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని ఎంతోమంది నిండు ప్రాణాలను కోల్పోతున్నారని రాష్ట్ర రవాణా, బీ.సీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా బుధవారం నిజామాబాద్ శివారులోని సుగుణ గార్డెన్స్ లో పోలీస్ రవాణా శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన అరైవ్అలైవ్ కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించగా, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలంబర్తి, ఆర్టీసీ ఎం.డీ నాగిరెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, మేయర్ ఉమారాణి, రాష్ట్ర మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిక్ అన్సారీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ట్రాఫిక్ నిబంధనలు పాటించాల్సిన ఆవశ్యకత గురించి నొక్కి చెప్పారు. ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు స్వీయ నియంత్రణ పాటించాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా అజాగ్రత్తగా, అతివేగంగా వాహనాలు నడపడం, మద్యం మత్తులో డ్రైవింగ్ చేయడం, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకపోవడం వంటివి రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం అవుతున్నాయని అన్నారు. వ్యక్తిగతంగా వారి కుటుంబాలతో పాటు సమాజానికి, ఇతరులకు కూడా తీరని నష్టం చేకూరుస్తున్నారని, ఎవరికివారు తమవంతు బాధ్యతగా భావిస్తూ ట్రాఫిక్ రూల్స్ ను విధిగా పాటించినపుడే ప్రమాదాల నివారణ సాధ్యమవుతుందని హితవు పలికారు. ముఖ్యంగా యువకులు, విద్యార్థులు వేగంగా వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారకులై నిండు ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వెలిబుచ్చారు. మనపై కుటుంబం ఆధారపడి ఉందనే విషయాన్ని గుర్తుంచుకుని, తప్పక ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, లేకుంటే కుటుంబం మొత్తం చిన్నాభిన్నం అయ్యే పరిస్థితి నెలకొంటుందని అన్నారు. నిరంతర తనిఖీలు నిర్వహిస్తూ చలానాలు విధించినా, ఎన్ని చట్టాలు వచ్చినా, ప్రభుత్వ యంత్రాంగం ఎంతటి కఠిన చర్యలు చేపట్టినా కూడా, ప్రజల ఆలోచనా విధానాల్లో మార్పు రానంతవరకు రోడ్డు ప్రమాదాల పరిస్థితిలో మార్పు రాదని అభిప్రాయపడ్డారు. ప్రమాదాలను నిలువరించేందుకు ప్రతిఒక్కరు బాధ్యతాయుతంగా వాహనాలు నడుపుతూ, తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని హితవు పలికారు. ప్రజల్లో అవగాహనను పెంపొందించేందుకు ఉద్దేశించిన అరైవ్అలైవ్ లో భాగంగా విస్తృత స్థాయిలో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని, అన్ని వర్గాల వారు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ దిశగా ప్రభుత్వం కూడా పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపట్టడం జరుగుతోందని గుర్తు చేశారు. ఇదిలాఉండగా, నిజామాబాద్ జిల్లాకు త్వరలోనే కొత్త బస్ డిపో రానుందని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ద్వారా ప్రతిరోజూ 10వేల బస్సులు సుమారు 35 లక్షల కిలోమీటర్లు తిరుగుతూ, 65 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నాయని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, ఆర్టీసీ సంస్థ పరిరక్షణే ధ్యేయంగా తమ ప్రభుత్వం ముందుకెళ్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. రవాణా శాఖ పరంగా కూడా చెక్ పోస్టులు ఎత్తివేయడం వంటి అనేక నూతన సంస్కరణలను అమల్లోకి తెచ్చామని గుర్తు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, అదనపు కలెక్టర్ దిలీప్ కుమార్, సబ్ కలెక్టర్లు వికాస్ మహతో, అభిగ్యాన్ మాల్వియ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజిరెడ్డి, నుడచైర్మన్ కేశ వేణు, డాక్టర్ కవితా రెడ్డి, డీటీసీ దుర్గా ప్రమీల తదితరపాల్గొన్నారు.

## ఘనంగా చైర్మన్ నెల్లూరి రాజు జన్మదిన వేడుకలు

**ప్రత్యేక పూజలు నిర్వహణ**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్:** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కుంట్లూరు డివిజన్ గౌరెల్లి గ్రామంలో ఉన్న శ్రీ స్వయంభు లక్ష్మి నరసింహ స్వామి దేవాలయ చైర్మన్ నెల్లూరి రాజు జన్మదిన సందర్భంగా ఆలయంలో ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక అర్చనలు నిర్వహించి, చైర్మన్ నెల్లూరి రాజుకు ఆశీర్వచనాలు అందించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రసాదం స్వీకరించారు.చైర్మన్ నెల్లూరి రాజు జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ఈ పూజా కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య సాంప్రదాయబద్ధంగా జరిగింది. అలాగే ఆలయ అర్చకులు గోవర్ధన నవీన్ పంతులు మరియు ఇతర భక్తులు కూడా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ వైస్ చైర్మన్ చెంచల శ్రీనివాస్, కమిటీ సభ్యులు గ్యార దాస్, నేరుడు నాగరాజు, చిట్టిగారి రాజేష్ గౌడ్, వంగూరి ప్రవీణ్ కుమార్, కొత్త శివ గౌడ్, కొత్త ప్రశాంత్ గౌడ్, దాసుగారి బాల శివుడు గౌడ్, స్థానిక మండలం రిపోర్టర్లు శ్రీకాంత్ రెడ్డి, పాషా తదితరులు పాల్గొన్నారు.

## చిన్నరావిరాల గ్రామంలో సేవా కార్యక్రమాలు

**సర్పంచ్ పబ్బత్ బాలకిషన్ గౌడ్**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :** పేద ప్రజల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్ ) ఆ దిశగా కీలక పాత్ర పోషిస్తోందని చిన్నరావిరాల గ్రామ సర్పంచ్ పబ్బత్ బాలకిషన్ గౌడ్ పేర్కొన్నారు. గ్రామంలో సర్పంచ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో మంజూరైన రూ.32,000 విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును లబ్ధిదారుడు జంగం బాల్ రెడ్డికి అందజేశారు.అనారోగ్యంతో బాధపడుతున్న బాల్ రెడ్డి చికిత్స కోసం ఎమ్మెల్యే దృష్టికి సమస్యను తీసుకెళ్లగా, ఆయన సానుకూలంగా స్పందించి ఆర్థిక సహాయం మంజూరు చేయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ నాయకులు మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారికి అండగా నిలబడటంలో ఎమ్మెల్యే ఎప్పుడూ ముందుంటారని కొనియాడారు. ఇదే కార్యక్రమంలో భాగంగా, వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టారు. గ్రామ సర్పంచ్ పబ్బత్ బాలకిషన్ గౌడ్ చొరవతో కొత్త మోడల్ సెట్ ఏర్పాటు చేసి ప్రజలకు నిరంతర మంచినీటి సరఫరా కల్పించేలా చర్యలు తీసుకున్నారు. గ్రామ ప్రజలు ఈ చర్యపై హర్షం వ్యక్తం చేశారు. గ్రామ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తామని సర్పంచ్ పబ్బత్ బాలకిషన్ గౌడ్ ఈ సందర్భంగా తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ సద్దుపల్లి సురేష్ శంకర్ రెడ్డి, మాజీ సర్పంచులు జాలిగగం వెంకటేష్, కళ్లెం లింగారెడ్డి, వార్డు సభ్యులు ఆకిటి రామకృష్ణారెడ్డి, నా రెడ్డి రిషిత సతీష్ రెడ్డి, రాపోలు మల్లేష్, బండారు సత్యనారాయణతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## మహిళా రిజర్వేషన్‌లో బీసీలకు సబ్ కోట ఇవ్వాలి

- దేశంలోని అన్ని ప్రాంతీయ పార్టీలు మద్దతు తెలపాలి
- జాతీయ బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ర్యాగ అరుణ్ కుమార్



**ముషీరాబాద్, విశాలభారతి:** కేంద్ర ప్రభుత్వం తీసుకు వస్తున్న మహిళా రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోట ఇవ్వాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ ర్యాగ అరుణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఇందుకు గాను దేశంలోని అన్ని ప్రాంతీయ పార్టీలు బిసి సబ్ కోటాకు మద్దతు తెలిపాలని కోరారు. బీసీ మహిళా నాయకురాలు మట్ట జయంతి గౌడ్ చేస్తున్న నిరాహార దీక్షకు బుధవారం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం తో కలిసి అరుణ్ కుమార్ మద్దతు తెలిపి మాట్లాడారు. దశాబ్దాలుగా కేంద్రంలో పాలన కొనసాగిస్తున్న పాలకులు మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకురావడంలో ఇంత జాప్యం ఎందుకు ఏర్పడిందని ప్రశ్నించారు. తరతరాల నుండి నారి శక్తి గొప్పతనం ఎంతో ఉందని ఈ దేశానికి మహిళా నాయకత్వం అవసరమన్నారు. స్వాతంత్రం వచ్చిన నాటి నుండి బీసీలు అణిచివేయబడ్డారని, బీసీ మహిళల ఊసే లేకుండా చేశారని మండిపడ్డారు. దేశ మూలలైన బీసీలను పాలకులు దశాబ్దాలుగా విస్మరిస్తూ దగా చేశారని ఫైర్ అయ్యారు. రాష్ట్రంలో ఉన్న అన్ని రాజకీయ పార్టీల ప్రజా ప్రతినిధులు మహిళా రిజర్వేషన్ బిల్లులో బిసి సబ్ కోట కు మద్దతు తెలిపి పార్లమెంటులో మాట్లాడాలని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ అంశం ఉన్నప్పుడే సబ్ కోట విషయం తేల్చాలని లేనిపక్షంలో దేశంలోని అన్ని ప్రాంతీయ పార్టీలను కలుపుకొని ఒత్తిడి పెంచుతామని తెలిపారు.

## పుట్టింటికి వెళ్తున్నానని చెప్పి అదృశ్యమైన మహిళ



**రాజేంద్రనగర్, విశాలభారతి:** శంషాబాద్ పరిధిలో ఓ మహిళ అనుమానాస్పదంగా అదృశ్యమైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, సుమారు ఐదు సంవత్సరాల క్రితం ఫిర్యాదుదారుడు అనిత (25) అనే మహిళను వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు జగదీష్ (4), చిన్న కుమారుడు టిల్లు (11 నెలలు). ఇటీవల దాంపత్య విషయాలపై భార్యాభర్తల మధ్య గొడవ జరిగినట్లు సమాచారం. ఈ నెల 13వ తేదీ ఉదయం సుమారు 11 గంటల సమయంలో, ఇంట్లో స్నానం చేస్తున్న అనిత, కొద్దిసేపటికి ఇంటి నుంచి వెళ్లిపోయినట్లు తెలిసింది. ఆ సమయంలో ఇంట్లో ఫిర్యాదుదారుడి తల్లి దేవి (45) మరియు పెద్ద కుమారుడు మాత్రమే ఉన్నారు. ఫిర్యాదుదారుడు ఇంటికి తిరిగి వచ్చిన తరువాత తన భార్య కనిపించకపోవడంతో, ఆమె గురించి తన తల్లిని అడగగా, "తన పుట్టింటి షాద్‌నగర్ సమీపంలోని కమ్మన్‌పల్లి కి వెళ్తున్నాను" అని చెప్పి వెళ్లిపోయిందని తెలిపింది. వెంటనే ఫోన్ చేయగా ఆమె మొబైల్ స్విచ్ ఆఫ్‌లో ఉండటంతో అనుమానం కలిగింది. తదుపరి ఫిర్యాదుదారుడు తన భార్య కోసం చుట్టుపక్కల ప్రాంతాల్లో, బంధువుల ఇళ్లలో వెతికినా ఎలాంటి ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. అదృశ్యమైన అనిత ఎత్తు సుమారు 5 అడుగులు, చామనచాయ వర్ణం కలిగి ఉండి, తెలుగు మరియు లంబాడీ భాషలు మాట్లాడగలదు. చివరిసారిగా బూడిద రంగు చీర ధరించినట్లు సమాచారం. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు శంషాబాద్ పోలీసులు తెలిపారు.

## కాటేదాన్‌లో పారిశుద్ధ్య కార్మికులకు శాలువాలతో ఘన సత్కారం

**రాజేంద్రనగర్, విశాలభారతి:** డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా కాటేదాన్ డివిజన్‌లో పారిశుద్ధ్య కార్మికులకు ఘన సన్మానం నిర్వహించారు. రాష్ట్ర బీజేపీ పార్టీ ఆదేశాల మేరకు కాటేదాన్ డివిజన్ అధ్యక్షులు గోద పాండు యాదవ్ ఆధ్వర్యంలో పల్లె చెరువు వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, రాజేంద్ర నగర్ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన పారిశుద్ధ్య కార్మికులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడిన తోకల శ్రీనివాస్ రెడ్డి, పారిశుద్ధ్య కార్మికులు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ప్రతి రోజు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు వారు చేస్తున్న కృషి అమూల్యమని, వారి సేవలను ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని అన్నారు. సమాజం అభివృద్ధిలో వారి పాత్ర ఎంతో ముఖ్యమని కొనియాడారు. కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికుడు జవాన్ శేఖర్ సహా ఇతర కార్మికులను పార్టీ నాయకులు కలిసి గౌరవప్రదంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు రావుల భాస్కర్, డివిజన్ మాజీ అధ్యక్షుడు అడికే జనార్ధన్, కృష్ణ సంతు గాడ్, సిహెచ్ వెంకటరమణ గుప్తా, బబ్లు, బి నరసింహ, మజర్ భాయ్, సురేష్, శంకర్ రెడ్డి, రామారావు, శేఖర్ తదితరులు, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.




## ఇందిరమ్మ రాజ్యంలోనే పేదింటి కల నెరవేరింది: భీమ్ భరత్



**మొయినాబాద్, విశాలభారతి:** మొయినాబాద్ మండలం ఎలుకగూడ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇంటిని చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామేన భీమ్ భరత్ ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా భీమ్ భరత్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ పేదల పక్షాన నిలుస్తుందని అన్నారు. పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గత ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి నియోజకవర్గానికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తూ పేదల ఆశలను నెరవేర్చుతున్నారని తెలిపారు.ఇందిరమ్మ ఇళ్ల ద్వారా పేదలకు గృహ వసతి కల్పించడం కాంగ్రెస్ ప్రభుత్వ గొప్ప కార్యక్రమమని, పేదల కోసం తీసుకున్న నిర్ణయాలు వారికి ఎంతో మేలు చేస్తున్నాయని అన్నారు.ఈ కార్యక్రమంలో మొయినాబాద్ మండలం కాంగ్రెస్ అధ్యక్షుడు మానయ్య, ఉపాధ్యక్షుడు రవీందర్ రెడ్డి, ఎండి మినాజుద్దీన్, కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ, మాజీ ఎంపీటీసీ కేబుల్ రాజు, చిలుకూరు రాజు, కుమార్ యాదవ్, ఇందిరమ్మ కమిటీ అధ్యక్షుడు గుడిపల్లి ప్రభాకర్, శ్రీకాంత్, తోలకట్ట యాదయ్య, ఆలూరి ప్రభు, గుడిపల్లి ప్రసాద్, మహేష్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే గ్రామ కమిటీ అధ్యక్షులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, సీనియర్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

## ఇందిరమ్మ ఇళ్ల కోసం నిరుపేదల అర్జీలు

**అధికారుల దృష్టికి సమస్యలు**



**రాజేంద్రనగర్, విశాలభారతి:** రాజేంద్రనగర్ నియోజకవర్గం గండిపేట్ మండల పరిధిలోని జీహెచ్ఎంసీ 123వ డివిజన్‌లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలు ఇందిరమ్మ గృహాల కోసం ప్రభుత్వాన్ని ఆశ్రయించాయి. జన్నారం క్వార్టర్స్‌లో గత పది సంవత్సరాలుగా అద్దె ఇళ్లలోనే జీవనం సాగిస్తున్న 11 మంది నిరుపేద కుటుంబాలు తమకు స్వంత గృహాలు కల్పించాలని కోరుతూ అర్జీలు సమర్పించాయి. ఈ సందర్భంగా వారు తమ సమస్యలను రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ గారి దృష్టికి తీసుకెళ్లారు. చాలా కాలంగా అద్దె ఇళ్లలో నివసిస్తూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ప్రభుత్వం అందించే ఇందిరమ్మ గృహ పథకం ద్వారా తమకు శాశ్వత నివాసం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అధికారులు స్పందిస్తూ, ప్రభుత్వం నుంచి గృహాల మంజూరు ప్రక్రియ ప్రారంభమైన వెంటనే అర్హులైన వారికి ప్రాధాన్యత ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అర్జీలు సమర్పించిన ప్రతి కుటుంబం వివరాలను పరిశీలించి న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అర్జీలు సమర్పించిన ప్రజలతో పాటు జీహెచ్ఎంసీ 121, 122, 123 డివిజన్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పూలపల్లి కృష్ణారెడ్డి గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిరుపేదలకు గృహం అనేది ప్రాథమిక అవసరమని, ప్రభుత్వం వెంటనే స్పందించి ఇళ్ల మంజూరు ప్రక్రియ వేగవంతం చేయాలని కోరారు. అలాగే అర్హులైన ప్రతి కుటుంబానికి న్యాయం జరిగేలా తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక ప్రజలు ఈ సమస్యను త్వరగా పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## సాంకేతిక పరిణామం మానవాళి ఆకాంక్షలకు అనుగుణంగా ఉండాలి

**చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ ఛాన్సలర్ సీ.హెచ్.వీ.పురుషోత్తంరెడ్డి**

**మొయినాబాద్, విశాలభారతి:** సాంకేతిక పరిణామం మానవాళి ఆకాంక్షలకు అనుగుణంగా ఉండాలని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ ఫౌండర్ అండ్ ఛాన్సలర్ డాక్టర్ సీహెచ్.వీ. పురుషోత్తంరెడ్డి పేర్కొన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్ లోగల చైతన్య డీమ్డ్ టూబీ యూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో "క్లౌడ్ సెక్యూరిటీ సొల్యూషన్స్ యూజింగ్ మిషిన్ లెర్నింగ్ అండ్ డీప్ లెర్నింగ్ టెక్నిక్స్" అనే పరిశోధన సిద్ధాంతానికి గంధం విజయ్ కుమార్ కు పీహెచ్ డీ డిగ్రీ పట్టా లభించగా.. బుధవారం యూనివర్సిటీ ఫౌండర్ అండ్ ఛాన్సలర్ సీహెచ్.వీ. పురుషోత్తం రెడ్డి అధికారికంగా ప్రధానం చేశారు. ఈ పరిశోధన డాక్టర్ ఈ అరవింద్ పర్యవేక్షణలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ రంగంలో పరిశోధనలు జాతీయ అభివృద్ధికి ఎంతో కీలకమన్నారు. మిషన్ లెర్నింగ్ మరియు డీప్ లెర్నింగ్ టెక్నిక్ లను ఉపయోగించి. క్లౌడ్ సెక్యూరిటీ పరిష్కారాలు అనే అంశంపై పరిశోధన చేయడం చాలా అభినందనీయమని ఆయన పేర్కొన్నారు. ఈ పరిశోధనలు దేశానికే గర్వకారణమే కాకుండా భవిష్యత్తు అభివృద్ధికి బలమైన పునాదిని ఏర్పరుస్తాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్. సాత్వికా రెడ్డి, వైస్ ఛాన్సలర్ జీ.శంకర్ లింగం, రిజిస్టర్ ఎం.రవీందర్, క్రిస్టోఫర్, ఏ.రాజు, ఎం.జగదీశ్వర్, బి రాజేందర్ రెడ్డి, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ గాదే రాంబాబు రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




## ప్రియమైన నాన్నా హెల్మెట్ ధరించండి

**వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్ర సేనా రెడ్డి**




**విశాలభారతి, గోదావరిఖని:**

పాఠశాలల వద్ద రోడ్డు భద్రతపై సమగ్ర అవగాహన కార్యక్రమాలు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్ర సేన రెడ్డి అధ్వర్యంలో రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ (అరైవ్ అలైవ్ ) కార్యక్రమం లో భాగంగా విద్యార్థుల భద్రతను పరిరక్షించడం , రోడ్డు ప్రమాదాలను తగ్గించడం లక్ష్యంగా పాఠశాలలు, కాలనీలు, ప్రధాన చౌరస్తా, రహదారుల వద్ద , పలు పాఠశాల ల్లో రోడ్డు భద్రతపై వద్ద విద్యార్థులు, పోలీస్ సిబ్బంది మానవ హారాలు ఏర్పాటు చేసి రోడ్డు భద్రతపై విద్యార్థుల్లో, ప్రజల్లో చైతన్యం కల్పిస్తూ అవగాహన సమావేశాలు నిర్వహించి, ట్రాఫిక్ నిబంధనల ప్రాముఖ్యతను వివరించారు.హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ వినియోగం, సురక్షితంగా రోడ్డు దాటే విధానం వంటి అంశాలను విద్యార్థులకు ప్రాక్టికల్‌గా వివరించి అవగాహన కల్పించారు.స్కూల్స్ లలో భద్రత, ప్రమాదాల నివారణ భాగంగా అవగాహనా కల్పించి విద్యార్థుల ద్వారా తల్లిదండ్రులకు హెల్మెట్ ధరించే అవసరంపై లేఖలు రాయించే ప్రత్యేక ప్రచార కార్యక్రమం చేపట్టబడింది.విద్యార్థుల ద్వారా తల్లిదండ్రులకు హెల్మెట్ ధరించే అవసరంపై, ట్రాఫిక్ నిబంధనలపై లేఖలు రాయించే ప్రత్యేక ప్రచార కార్యక్రమం చేపట్టి ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లల భద్రతను దృష్టిలో ఉంచుకుని ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని విద్యార్థులు వారి ప్రియమైన నాన్నకి, రోడుపై చాలా ప్రమాదాలు అవుతాయి. నాన్న హెల్మెట్ ధరించు మాకు తీసుకొనిరా. నాకు ఇంకా అమ్మకు కూడా హెల్మెట్ తీసుకురా అని లేఖల ద్వారా విద్యార్థులు విజ్ఞప్తి చేశారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, నియమాలు పాటించడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని సీఐ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. అదేవిధంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఆటో లలో ఓవర్ లోడ్ ,పాఠశాల వాహనాల్లో అనుమతికి మించిన విద్యార్థులను తరలించడంపై తనిఖీలు ,మైనర్ డ్రైవింగ్, చిన్నపిల్లలతో ట్రిపుల్ రైడింగ్, వంటి కేసులపై చలాన్లు విధించబడ్డాయి. పాఠశాలల సమీపంలో అతివేగంగా వాహనాలు నడపడం, పిల్లలు, రైడర్లు హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వంటి ఉల్లంఘనలపై అవగాహనా కల్పించారు.ప్రజలు, ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లల భద్రత కోసం ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమాలలో గోదావరిఖని వంట ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేశ్వరరావు, ఎస్ ఐ రమేష్, అనూష, తదితరులు పాల్గొన్నారు.

## కవాడిపల్లిలో రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమం




- అలైవ్–ఎరైవ్ తో వేగ నియంత్రణకు బారికేడ్లు
- ప్రజాపాలన 99 రోజుల ప్రణాళికలో భాగంగా అమలు

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :**

గ్రామీణ ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలను తగ్గించి ప్రజల్లో భద్రతపై చైతన్యం పెంపొందించేందుకు కవాడిపల్లి గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజాపాలన - 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా గ్రామ సర్పంచ్ శ్రీమతి కోలన్ ప్రసన్న లక్ష్మి రవీందర్ రెడ్డి అధ్యక్షతన 'అలైవ్ - ఎరైవ్' కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్యంగా రహదారులపై వేగ నియంత్రణ కోసం విజ్ఞాన్ విశ్వవిద్యాలయం మరియు విజ్ఞాన్ ఇంజనీరింగ్ కళాశాల అందించిన బారికేడ్లను గ్రామ ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ బారికేడ్ల ద్వారా వాహనాల వేగాన్ని తగ్గించడం, గ్రామంలో జరిగే ప్రమాదాలను నివారించడం లక్ష్యంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. ముఖ్యంగా పాఠశాలలు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రదేశాల్లో వీటిని ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు మరింత భద్రత కల్పించబడుతుందని పేర్కొన్నారు.సర్పంచ్ కోలన్ ప్రసన్న లక్ష్మి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ.. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. వాహనదారులు ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడంతో పాటు హెల్మెట్ వినియోగం, వేగ పరిమితి, జాగ్రత్తలతో ప్రయాణించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని సూచించారు. గ్రామస్థులు కూడా రోడ్డు వినియోగంలో క్రమశిక్షణ పాటించాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రిటైర్డ్ RTC సీనియర్ డ్రైవర్ బండారి నరసింహ మాట్లాడుతూ.. తన అనుభవాలను పంచుకుంటూ "వేగం కన్నా క్షేమం మిన్న" అని పేర్కొన్నారు. వేగం వల్ల జరిగే ప్రమాదాల తీవ్రతను వివరిస్తూ, చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణనష్టానికి దారి తీస్తుందని హెచ్చరించారు. ప్రతి వాహనదారుడు తనతో పాటు ఇతరుల భద్రతను కూడా దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. గ్రామపంచాయతి కార్యదర్శి శ్రీ రజనీకాంత్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామంలో రోడ్డు భద్రత పై పర్యవేక్షణ చేయడానికి 10 మంది సభ్యులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ బృందం రోడ్డు భద్రత నియమాల అమలు, అవగాహన కార్యక్రమాలు, ప్రమాద ప్రాంతాల గుర్తింపు వంటి అంశాలపై పనిచేస్తుందని చెప్పారు. భవిష్యత్తులో పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించి మరింత అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు.గ్రామంలో ప్రజల భాగస్వామ్యంతో నిర్వహించిన ఈ రోడ్డు భద్రత కార్యక్రమం చైతన్యాన్ని పెంపొందించడంతో పాటు భవిష్యత్తులో ప్రమాదాల నివారణకు దోహదం చేస్తుందని స్థానికులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ రాసాల రాము యాదవ్, వార్డు సభ్యులు ఎర్రకోలు నిరోషా రవి యాదవ్, బొడిగె సురేష్ గౌడ్, ఇరుగు సాయి, విజ్ఞాన్ సంస్థల ప్రతినిధి బొడిగె వెంకటేష్ గౌడ్, జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువజన సంఘాల నాయకులు మెరుగు ఉపేందర్ యాదవ్, మెరుగు సందీప్ యాదవ్, గ్రామ పెద్దలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

NATIONAL news
WWW.VISHALABHARATI.COM
విశాల భారతి

# పీర్జాదిగూడ బిఆర్ఎస్ పార్టీలో భారీ చేరికలు

**మేడిపల్లి, విశాలభారతి:**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పీర్జాదిగూడలో మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన పార్టీ చేరికల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, బీఆర్ఎస్ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, క్యామ మల్లేష్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ కార్పొరేటర్ కౌడే పోచయ్య, విద్యావేత్త ఆకుల మధుకర్, వెల్లంకి శశిధర్ రెడ్డి, దొంతిరి మధుసూదన్ రెడ్డి, కసిరెడ్డి నారాయణ రెడ్డి, ఒంటెరు మాధవ రెడ్డి, సోమిరెడ్డి తో పాటు ఇతర పార్టీలకు చెందిన పలువురు నాయకులను బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ దక్షిణాది రాష్ట్రాలపై డీలిమిటేషన్ పేరుతో అన్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. అలాంటి ప్రయత్నాలను బీఆర్ఎస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని స్పష్టం చేశారు. అవసరమైతే కేసీఆర్ నాయకత్వంలో



ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. మహిళలకు స్థానిక సంస్థల్లో 50 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన పార్టీ బీఆర్ఎస్ అని గుర్తుచేసిన కేటీఆర్, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు కాలేదని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు ఇప్పటికీ నెరవేర్చలేదని అన్నారు. హైదరాబాద్‌లో భూకబ్జాలు పెరిగిపోయాయని, ప్రజలకు భద్రత లేకుండా పోయిందని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలపై దృష్టి పెట్టడం లేదని మండిపడ్డారు. ఉప్పల్ ఫ్లైఓవర్ పనులు సంవత్సరాలుగా సాగుతూనే ఉన్నాయని, కేంద్రంరాష్ట్రాల మధ్య సమన్వయం లోపంతో అభివృద్ధి నిలిచిపోయిందని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో మళ్లీ బీఆర్ఎస్ విజయం సాధిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓటు వేసి అభివృద్ధికి మద్దతు ఇవ్వాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కొల్తూరి మహేష్,దొంతిరి హరిశంకర్ రెడ్డి,మధుసూదన్ రెడ్డి, లేతాకుల మాధవి రఘుపతి రెడ్డి, మహిళా అధ్యక్షురాలు నిర్మల, యూత్ అధ్యక్షులు ప్రభు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు మనోరంజన్ రెడ్డి,మైనారిటి అధ్యక్షులు జిలాని పాష, జావీద్ ఖాన్, మాజీ మేయర్లు సామల బుచ్చిరెడ్డి, మేకల కావ్య, పోచారం మాజీ చైర్మన్ కొండల్ రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ రెడ్యా నాయక్, బోడుప్పల్ అధ్యక్షులు మంద సంజీవ రెడ్డి, సీనియర్ నాయకులు కొత్త రవి గౌడ్, మీసాల కృష్ణ, కొండల్ రెడ్డి, శేఖర్, మాధవ్ రెడ్డి, సురేందర్ రెడ్డి, రమేష్, పీర్జాదిగూడ, బోడుప్పల్, పోచారం, ఘట్కేసర్ నాయకులు మహిళలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి సెంటర్‌ని ప్రజలే ఉచ్చరిస్తున్నారు

- ప్రత్యేకించి దానికి ఎవరు పేరు పెట్టాల్సిన అవసరం లేదు
- టిడిపి మండల అధ్యక్షుడు తుళ్లూరు ప్రకాష్ రావు



**అశ్వాపురం, విశాలభారతి:** మండల కేంద్రంలోని టిడిపి సెంటర్ సర్కిల్లో గత మూడున్నర దశాబ్దాల కాలంగా అక్కడ టిడిపి కార్యాలయం ఉండడం వలన, ప్రజలు అనేక సమస్యలపై వచ్చి కార్యాలయంలోని నాయకులకు బాధలు చెప్పుకొని పరిష్కారం చేసుకుని వెళ్లేవారని అలా కాలక్రమేనా ప్రజల ఉచ్చరణతోనే మండల హెడ్ క్వార్టర్ లోని నాలుగు కూడళ్ల సెంటర్ ను టిడిపి సెంటర్ అంటూ ప్రజలే పిలుచుకోవడం మొదలెట్టారని టిడిపి మండల అధ్యక్షుడు తుళ్లూరు ప్రకాష్ రావు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొందరు స్వార్థ రాజకీయాల కోసం తాసిల్దార్ కార్యాలయానికి వెళ్లే మార్గం వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహాన్ని అక్కడి నుంచి తొలగించి ఆర్ అండ్ బి ప్రధాన రోడ్డుపై పెట్టి అది అంబేద్కర్ సెంటర్ అని పిలవాలని అనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రధాన రోడ్డుపై అంబేద్కర్ విగ్రహం నెలకొల్పడం సంతోషించదగ్గ విషయమని అంతమాత్రాన, ఎంతో కాలంగా పిలవబడుతున్న టిడిపి సెంటర్ అనే పేరును ఉచ్చరించకుండా చేయాలనే ఆలోచన అయింది కాదన్నారు. ఎవరు ఏ విగ్రహం పెడితే ఆ విగ్రహం పేరు ఆ సెంటర్ కి వస్తుందా అని ప్రశ్నించారు. మండల కేంద్రం సరిగ్గా పావు కిలోమీటర్లు కూడా లేదని దీనికి ఇంత రాద్ధాంతం చేయాల్సిన అవసరం లేదన్నారు. కావాలనే కొంతమంది రాజకీయాలు చేస్తూ అన్ని వర్గాల ప్రజలతో మైత్రి బంధాన్ని కొనసాగిస్తూ, ముందుకు సాగుతున్న తెలుగుదేశం పార్టీ ఎదుగుదలను ఓర్వలేకనే ఈ దిగజారుడు వ్యవహారాలకు పాల్పడుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు. రాజకీయంగా ఎదిగేందుకు అనేక మార్గాలు ఉన్నాయని ఇటువంటి చౌకబారు రాజకీయాలు చేస్తే ప్రజల హృదయాల్లో స్థానం ఎలా సంపాదిస్తారన్నారు. నాయకులుగా ఎదగాలంటే కృషి పట్టుదల తో పాటు నిష్పక్షపాతంగా ప్రజా సేవ చేస్తూ ప్రజా మన్నలను పొంది ప్రజల హృదయాల్లో స్థానం దక్కించుకుంటే ఎవరు అడ్డుపడరని ఆయన హితవు పలికారు. టిడిపి సెంటర్ ను ఎలా పిలవాలో మండల ప్రజలే నిర్ణయించుకుంటారని దీనికి ఎవరు పేర్లు పెట్టాల్సిన అవసరం లేదన్నారు.

# ఆదివాసీల ఆత్మగౌరవ ప్రతీక కొమరం భీం

- సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా



**పాల్వంచ, విశాలాభారతి:** ఆదివాసీల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన కొమరం భీం ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్.కె. సాబీర్ పాషా అన్నారు.పాల్వంచ మండలం తోగ్గూడెం గ్రామంలో బుధవారం నిర్వహించిన కొమరం భీం విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, నైజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా 'జల్ జంగల్ జమీన్' నినాదంతో ఆదివాసీ హక్కుల కోసం భీం చేసిన పోరాటం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో గిరిజన భూములు, అటవీ సంపదపై జరుగుతున్న దాడులను ఎదుర్కొనేందుకు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు.గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మహనీయుల విగ్రహాల ద్వారా యువతకు చరిత్రను పరిచయం చేయవచ్చని తెలిపారు.కార్యక్రమంలో పలువురు సిపిఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోడ్డు నిర్మాణం కొరకు 8వ డివిజన్‌లో ప్రజాసదస్సు



**పాల్వంచ విశాలభారతి:** పాల్వంచ పట్టణం, శ్రీనివాస కాలనీలోని శ్రీనివాసగిరి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకోవటానికి భక్తులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో వుంచుకుని గుట్టపైకి రోడ్డు నిర్మాణం చేపట్టడం కొరకు .15042026, ఉదయం 11 గంటలకు కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ 8వ డివిజన్ లో ప్రజాసదస్సు నిర్వహించడం జరిగినది. 8వ డివిజన్ కార్పొరేటర్ సిరివరపు లలిత కుమారి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డివిజన్ కు సంబంధించిన ప్రముఖులు జమ్ముల సీతారామ రెడ్డి, కాంపెల్లి కనకేష్, మార్కండ్రి హైమవతి, కాకాటి దుర్గాభవాని, కందుకూరి రామకృష్ణ, చల్లగుండ్ల వీరభద్రం, పులి సత్యనారాయణ, దూళిపాల కామస్వామి, తుమ్మలపూడి సత్యనారాయణ, కందుకూరి శేషయ్య, , కిలారి శివయ్య, కూసు రామారావు తదితరులతో పాటుగా 8వ డివిజన్ కు సంబందించిన శ్రీనివాస కాలనీ, బంజారా కాలనీ, కుంటినాగుల గూడెం, అయ్యప్ప నగర్ నుంచి ప్రజలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో జమ్ముల సీతారామ రెడ్డి FRA2006 సెక్షన్ 3(2)1 ప్రకారం ప్రజా అవసరాల దృష్ట్యా ఫారెస్ట్ ల్యాండ్ కన్వర్షన్ చేసి రోడ్డు మార్గం ఇవ్వవలసినదిగా తీర్మాణం ప్రవేశ పెట్టగా కాంపెల్లి కనకేష్, చల్లగుండ్ల వీరభద్రం తదితరులు బలపరుస్తూ మాట్లాడము జరిగినది. అనంతరం సభాధ్యక్షులు 8వ డివిజన్ కార్పొరేటర్ శ్రీమతి సిరివరపు లలిత కుమారి సభ ఆమోధానికి పెట్టగా సమావేశానికి హాజరయిన పెద్దలు ఏకగ్రీవంగా తీర్మాణం బలపరచడం జరిగినది. తక్షణం రోడ్డు పనులు చేపట్టేవిదముగా ఫారెస్ట్ అదికారులు సహకరించాలని సమావేశం విజ్ఞప్తి చేసింది. భక్తుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని అన్ని పక్షాలు ఏకతాటిపైకి వచ్చి సమస్య పరిష్కారానికి పూనుకున్నందుకు డిప్యూటీ మేయర్ శ్రీమతి సిరివరపు లలిత కుమారి ప్రతిఒక్కరికి దన్యవాదాలు తెలియచేసారు.

# భద్రాద్రి కొత్తగూడెం జిల్లా న్యాయమూర్తికి ఘన వీడ్కోలు

- పదవీకాలం ముగియనున్న సందర్భంగా దమ్మపేట బార్ అసోసియేషన్ సత్కారం
- జిల్లా న్యాయమూర్తికి మర్యాదపూర్వకంగా వీడ్కోలు పలికిన న్యాయవాదులు
- శాలువాతో సత్కరించి సేవలను కొనియాడిన బార్ అసోసియేషన్ ప్రతినిధులు
- దమ్మపేట కోర్టు స్థాపనలో కీలక పాత్రను గుర్తుచేసిన నాయకులు



**సత్తుపల్లి, విశాలభారతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కోర్టు జిల్లా న్యాయమూర్తి పదవీకాలం ముగియనున్న సందర్భంగా దమ్మపేట బార్ అసోసియేషన్ ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా వీడ్కోలు పలికారు.ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొంది మురళీ మోహన్, కార్యదర్శి లక్కినేని నరేంద్ర, ఈసీ సభ్యులు గోళ్ల భవాని కృష్ణ యాదవ్, నల్లపు ఉదయ్ న్యాయమూర్తిని కలిసి శాలువాతో సత్కరించి, ఆయన సేవలను కొనియాడారు.దమ్మపేట కోర్టు స్థాపనలో న్యాయమూర్తి కీలక పాత్రను గుర్తుచేసుకుంటూ, జిల్లా ప్రజలకు న్యాయం అందించడంలో చేసిన విశేష సేవలకు కృతజ్ఞతలు తెలిపారు.అలాగే, ఆయన భవిష్యత్తు కార్యక్రమాలకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# పిల్లలు పుట్టిన రోజున హెల్మెంట్ రిటర్న్ గిఫ్ట్ ఇవ్వాలి

- పాల్వంచ రూరల్ ఎస్సై బి సురేష్

**పాల్వంచ, విశాలభారతి:** పిల్లలు వారి పుట్టినరోజు సందర్భంగా తల్లిదండ్రులకు హెల్మెట్ రిటర్న్ గిఫ్ట్ గా ఇవ్వాలని మండల ప్రత్యేక అధికారి (జిల్లా ఆడిట్ అధికారి) శ్రీనివాస్ సూచించారు.బుధవారం నాగారం హై స్కూల్ విద్యార్థులకు రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల చానా సున్నితమైనది యాక్సిడెంట్ అయినప్పుడు ఎక్కువమంది తలకు దెబ్బ వలన ఎక్కువ మరణాలు సంభవిస్తున్నాయి వీటి నివారణకు హెల్మెట్ ధరించడం తప్పనిసరి కాబట్టి అందరూ హెల్మెట్ ఉపయోగించాలని సూచించారు.ఎస్సై సురేష్ మాట్లాడుతూ మైనర్లు డ్రైవింగ్ చేస్తే శిక్ష తల్లిదండ్రులకు వేయడం జరుగుతుందని తెలియజేశారు. ఎండాకాలంలో వాగులు, చెరువులలో ఈతకు వెళ్ళవద్దని తెలియజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బొగ్గ నారాయణ, ఎంపీఓ చెన్నకేశవులు, సర్పంచ్ స్వప్న, హై స్కూల్ హెడ్మాస్టర్ బి బాలయ్య, ఏపీవో పోరండ్ల రంగా, కార్యదర్శి దుర్గారావు, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.




# మంచిరెడ్డిపై ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఘాటు దాడి

- భూమి కబ్జాల ఆరోపణలు
- బహిరంగ చర్చకు సవాల్

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :**



ఇబ్రహీంపట్నం రాజకీయాల్లో మరోసారి ఆరోపణలు, ప్రతియారోపణలు ముదురుతున్నాయి. మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డిపై ప్రస్తుత ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతూ భూమి కబ్జాల వ్యవహారాన్ని బహిరంగ చర్చకు తీసుకురావాలని సవాల్ విసిరారు. ఈ వ్యాఖ్యలతో నియోజకవర్గ రాజకీయ వాతావరణం మరింత వేడెక్కింది. సోమవారం ఇబ్రహీంపట్నం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడిన ఎమ్మెల్యే మల్‌రెడ్డి, మంచిరెడ్డి కిషన్ రెడ్డి పలు ప్రాంతాల్లో విస్తారమైన భూములను అక్రమంగా ఆక్రమించుకున్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. ఆదిబట్లలో 10 ఎకరాలు, ఇబ్రహీంపట్నం బస్సు డిపో సమీపంలో 45 ఎకరాలు, సీతారాంపేటలో 12 ఎకరాల భూములు కబ్జా చేశారని పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై ఆధారాలతో అధికారుల సమక్షంలో ఎప్పుడైనా చర్చకు సిద్ధమని స్పష్టం చేస్తూ, తన సవాల్‌కు ముందుకు రావాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ పార్టీ వేదికల ద్వారా అసత్య ప్రచారం జరుగుతోందని మండిపడిన ఎమ్మెల్యే, మంచిరెడ్డి విజయాలు ప్రజల మద్దతుతో కాదని, రాజకీయ పరిస్థితుల అనుకూలతతోనే సాధించారని వ్యాఖ్యానించారు. 2009లో ఓట్ల చీలిక, 2014లో తాను పోటీ చేయకపోవడం వంటి అంశాల వల్లే ఆయన గెలిచారని విమర్శించారు. ఇబ్రహీంపట్నం బస్సు డిపో సమీప భూముల వ్యవహారంలో నకిలీ పత్రాలు సృష్టించలేదా అని ప్రశ్నించిన మల్‌రెడ్డి, కలెక్టర్ కార్యాలయం పరిసరాల్లోని భూములను బినామీల పేర్లతో కబ్జా చేశారని ఆరోపించారు. గతంలో ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధిని నిర్లక్ష్యం చేశారని కూడా విమర్శించారు. ఫార్మాసిటీ భూముల అంశంపై మేడిపల్లిలో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరిన ఎమ్మెల్యే, తనపై ఎవరైనా ఆరోపణలు చేస్తే వాటిని నిరూపించాలని డిమాండ్ చేశారు. తాను ఎక్కడైనా భూమి కబ్జా చేశానని రుజువు చేస్తే ఆ భూములను పేదలకు పంచేందుకు సిద్ధమని ప్రకటించారు. నియోజకవర్గ అభివృద్ధి పనుల్లో అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపిస్తూ, బస్సు డిపో సమీపంలో 1000 ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి పేదలకు అందజేస్తామని వెల్లడించారు. రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకోవాలని హెచ్చరించిన ఎమ్మెల్యే, నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ ఆరోపణల నేపథ్యంలో ఇబ్రహీంపట్నం రాజకీయాలు మరోసారి హాట్ టాపిక్‌గా మారగా, మంచిరెడ్డి వర్గం నుంచి ఎలాంటి ప్రతిస్పందన వస్తుందనే దానిపై స్థానికంగా ఆసక్తి నెలకొంది. ఈ కార్యక్రమంలో శేఖర్ గౌడ్, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ల అభివృద్ధిపై సమన్వయ సమావేశం

**గడ్డి అన్నారం చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి కీలక సూచనలు**

**విశాలభారతి, అబ్దుల్లాపూర్ మెట్ :**





తెలంగాణ రాష్ట్రంలో వ్యవసాయ మార్కెట్ల అభివృద్ధి, రైతుల సమస్యల పరిష్కారం, మార్కెట్ వ్యవస్థలో పారదర్శకత పెంపు వంటి అంశాలపై కీలక చర్చలు జరిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం హైదరాబాద్‌లోని బీఆర్‌కే భవన్‌లో రాష్ట్ర స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్లు, అధికారులు, రైతులు, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు. మార్కెట్ యార్డుల్లో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, ధరల అస్థిరత, మధ్యవర్తుల ప్రభావం, సదుపాయాల కొరత వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి పాల్గొని పలు కీలక సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా రైతులకు సరైన ధరలు అందేలా చర్యలు తీసుకోవాలని, మార్కెట్ యార్డుల్లో మౌలిక వసతులను మెరుగుపరచాలని, తూకం వ్యవస్థలో పారదర్శకత ఉండేలా చూడాలని సూచించారు. అదేవిధంగా రైతులకు నేరుగా లాభం చేకూరే విధంగా ప్రభుత్వ విధానాలు అమలు చేయాలని కోరారు. రైతుల సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వంతో పాటు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన అభిప్రాయపడ్డారు. రైతు సమస్యల పరిష్కారంలో మార్కెట్ కమిటీల పాత్ర కీలకమని, వాటిని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సమావేశంలో అధికారులు రైతుల అభిప్రాయాలను గమనించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో వ్యవసాయ మార్కెట్లను ఆధునికీకరించేందుకు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశం ద్వారా రైతుల సమస్యలకు పరిష్కార మార్గాలు కనుగొనే దిశగా ప్రభుత్వం మరింత దృష్టి సారిస్తున్నట్లు స్పష్టమైంది. ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర చారి, సెక్రటరీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# హిందూ సమ్మేళనం.. ప్రధాన వక్తగా మన్యశ్రీ లింగం సుధాకర్ రెడ్డి రాకతో ఉత్సాహం

**రాజేంద్రనగర్, విశాలభారతి :**

బండ్లగూడ జాగీర్‌లో హిందూ సమ్మేళనం - ముఖ్య వక్తగా మాన్యశ్రీ లింగం సుధాకర్ రెడ్డి బండ్లగూడ జాగీర్‌లో త్వరలో నిర్వహించబడనున్న హిందూ సమ్మేళనం కార్యక్రమం కోసం ఏర్పాట్లు వేగవంతంగా కొనసాగుతున్నాయి. ఈ సమ్మేళనానికి ముఖ్య వక్తగా విచ్చేయనున్న విద్యాభారతి దక్షిణ మధ్య క్షేత్ర సంఘటన మంత్రి, సంఘ ప్రచారకులు మాన్యశ్రీ లింగం సుధాకర్ రెడ్డిని హిందూ సమ్మేళన సమితి సభ్యులు సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సమితి ప్రతినిధులు ఆయనను కలసి



కార్యక్రమం వివరాలను తెలియజేస్తూ కరపత్రాన్ని అందజేశారు. సమాజంలో ధార్మిక చైతన్యం పెంపొందించడానికి, హిందూ సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణకు ఈ సమ్మేళనం ఒక వేదికగా నిలుస్తుందని వారు తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ముఖ్య వక్తగా రానున్న మాన్యశ్రీ లింగం సుధాకర్ రెడ్డి సమాజంలో జాతీయ చైతన్యం, సాంస్కృతిక విలువలపై తన ప్రసంగం ద్వారా అవగాహన కల్పించనున్నారని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో హరీశ్వర్ రెడ్డి, సత్యప్రియ చారి, లక్ష్మీకాంత్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, అభినయ్, రాజా రెడ్డి తదితరులు పాల్గొన్నారు. సమ్మేళనం విజయవంతం కావడానికి వారు తమ వంతు కృషి చేస్తున్నారు.

# సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ నూతన బ్రాంచ్ కార్యాలయం ప్రారంభం

- సింగరేణి ప్రాంతంలో సి ఐ టీ యూ నూతన బ్రాంచ్ కార్యాలయం ప్రారంభం
- ఉద్యోగుల హక్కులు, సంక్షేమం కోసం కీలక కేంద్రంగా మారనున్న కార్యాలయం
- కార్మికుల ఐక్యతతోనే సమస్యలకు పరిష్కారం సాధ్యమని నాయకుల పిలుపు



**సత్తుపల్లి, విశాలభారతి:** సింగరేణి ప్రాంతంలో కార్మిక ఉద్యమాలకు మరింత బలం చేకూర్చే దిశగా సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ సంఘం ఆధ్వర్యంలో సి ఐ టీ యూ నూతన బ్రాంచ్ కార్యాలయం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమం కార్మికుల ఉత్సాహం, ఐక్యతను ప్రతిబింబిస్తూ వేడుకల మధ్య నిర్వహించారు. ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా హాజరైన కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ, సింగరేణి ఉద్యోగుల హక్కుల సాధనలో సి ఐ టీ యూ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమం, భద్రత, వేతనాల సమస్యలు, సేవా నిబంధనల పరిరక్షణ వంటి అంశాల్లో ఈ కొత్త కార్యాలయం కేంద్ర బిందువుగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో భాగంగా తుమ్మల రాజారెడ్డి రిబ్బన్ కట్ చేసి కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో పలువురు నాయకులు ప్రసంగిస్తూ, కార్మికుల ఐక్యతే వారి ప్రధాన శక్తి అని, సంఘం బలోపేతం ద్వారానే సమస్యలకు శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని తెలిపారు. అనంతరం సింగరేణి యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మంద నరసింహారావు మాట్లాడుతూ కార్మిక హక్కుల పరిరక్షణలో సంఘం మరింత చురుకైన పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని సూచించారు.సింగరేణి ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. నూతన కార్యాలయం ద్వారా ఉద్యోగులకు అందుబాటులో సేవలు, సమస్యల పరిష్కారానికి వేగవంతమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో బ్రాంచ్ అధ్యక్షుడు గాదే సంపత్, బ్రాంచ్ సెక్రటరీ ముత్యాల కార్తీక్, కాంట్రాక్ట్ యూనియన్ జనరల్ సెక్రటరీ బలుగూరి మధు, సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు సుధాకర్, హరీష్, శంకర్, రఘురాం, సి ఐ టీ యూ రాష్ట్ర కమిటీ సభ్యులు చలమాల విటల్, మోరంపూడి పాండు, సిపిఎం పార్టీ డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి, సత్తుపల్లి పట్టణ కార్యదర్శి కాలిక సర్వేశ్వరరావు, రైతు సంఘం నాయకులు రావుల రాజబాబు తదితరులు పాల్గొన్నారు.ఈ ప్రారంభోత్సవం సింగరేణి కార్మిక ఉద్యమ చరిత్రలో మరో ముఖ్యమైన అడుగుగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు.

# రోడ్డు భద్రతపై అవగాహనతోనే ప్రమాదాల నివారణ

- విద్యార్థులు మార్గదర్శకులుగా నిలవాలి" : జిల్లా కలెక్టర్ అంకిత్




**పాల్వంచ విశాలభారతి:** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న "అరైవ్ - అ లైవ్" కార్యక్రమంలో భాగంగా బుధవారం పాత కొత్తగూడెం హనుమాన్ బస్తీ లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రోడ్డు భద్రతపై అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ అంకిత్ ఘనంగా ప్రారంభించారు. "రహదారుల భద్రత మన అందరి బాధ్యత" అనే నినాదంతో ప్రారంభమైన ఈ ర్యాలీలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని రోడ్డు భద్రతపై నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి జిల్లా కలెక్టర్ రహదారుల భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలను తగ్గించడానికి ప్రజల్లో, ముఖ్యంగా విద్యార్థుల్లో అవగాహన కల్పించడం అత్యంత కీలకమని అన్నారు . చిన్న వయస్సులోనే ట్రాఫిక్ నిబంధనలు, రహదారి భద్రతపై అవగాహన పెంపొందితే భవిష్యత్తులో బాధ్యతాయుత పౌరులుగా ఎదుగుతారని అన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులు, బంధువులు, ఉపాధ్యాయులు ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలి, కార్లలో ప్రయాణించే సమయంలో సీట్ బెల్ట్ ధరించాలనే విషయాన్ని గుర్తుచేయాలని సూచించారు. ట్రాఫిక్ సిగ్నల్స్, జీబ్రా క్రాసింగ్ వినియోగం, రోడ్డు నియమాల పాటింపు వంటి అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. పాఠశాలల్లో రోడ్డు భద్రతపై పోస్టర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థులకు ప్రత్యేక అవగాహనా తరగతులు నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. గ్రామాలు, పట్టణాల్లో ర్యాలీలు, అవగాహనా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రజల్లో భద్రతపై చైతన్యం పెంపొందించాలన్నారు. రోడ్డు ప్రమాదాల వల్ల అనేక కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని, ఈ ప్రమాదాలను తగ్గించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. "అరైవ్ - అ లైవ్" కార్యక్రమం ద్వారా ప్రజల్లో రహదారి భద్రతపై విస్తృత అవగాహన కల్పించడం లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏం ఈ ఓ మధురవాణి, ప్రధానోపాధ్యాయులు లక్ష్మి, కోఆర్డినేటర్ నాగశేఖరా శర్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు సంబంధిత శాఖల అధికారులు, పాల్గొన్నారు.

# తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు

**కలెక్టర్ ఇలా త్రిపాఠి**



**నిజామాబాద్, విశాల భారతి:** జిల్లాలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. భీమ్‌గల్ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం బాల్కొండ నియోజకవర్గం పరిధిలోని మండలాల ఎంపీడీఓలు, ఆర్.డబ్ల్యూ.ఎస్ ఏ.ఈలు, ఎం.పీ.ఓ లు ఇతర అధికారులతో కలెక్టర్ తాగునీరు సరఫరా తీరుతెన్నులపై సమీక్ష నిర్వహించారు. ఒక్కో మండలం వారీగా నీటి సరఫరా పరిస్థితి గురించి, అందుబాటులో ఉన్న నీటి వనరులు, చేపట్టాల్సి ఉన్న మరమ్మతులు తదితర వాటి గురించి అడిగి తెలుసుకున్నారు. వేసవి సీజన్ ను దృష్టిలో పెట్టుకుని తాగునీటి సరఫరా వ్యవస్థను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలన జరపాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని ఏ ఒక్క నివాస ప్రాంతంలోనూ నీటి ఎద్దడి రాకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తూ, అవసరమైన చోట యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలని ఆదేశించారు. పనులు చేపట్టడానికి ముందు స్థానిక ప్రజాప్రతినిధులను సంప్రదించాలని సూచించారు. ఆయా గ్రామాల వారీగా నీటి సరఫరా పరిస్థితిని నిరంతరం సమీక్షించాలని, చేతి పంపులు, బోరు బావులకు అవసరమైన చోట తక్షణమే మరమ్మతులు జరిపించాలని, చేతి పంపులకు ఫ్లషింగ్ చేయించాలని అన్నారు.

# అథ్లెటిక్స్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

**డిప్యూటీ మేయర్ సిరిపురపు లలితకుమారి**



**పాల్వంచ, విశాలభారతి:**

ఇటీవల హన్మకొండలోని జె.ఎన్ స్టేడియంలో నిర్వహించిన 11వ తెలంగాణ రాష్ట్ర సీనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో పాల్వంచ శ్రీనివాస కాలనీ, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ గ్రౌండ్లో అథ్లెటిక్స్ కోచ్ పి. నాగేంద్ర ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో మొత్తం 14 పతకాలు సాధించిన సందర్భంగా జరిగిన అభినందన సభ కు ముఖ్య అతిథిగా హాజరైన కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత మాట్లాడుతూ, క్రీడాకారులు క్రమశిక్షణతో కఠినంగా శిక్షణ పొందడం ద్వారా రాష్ట్ర, జాతీయ స్థాయిలో విజయాలు సాధించగలరని నిరూపించారని అన్నారు. భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి జిల్లా, రాష్ట్ర ఖ్యాతిని మరింత పెంచాలని, అలాగే మంచి ఉద్యోగ అవకాశాలను పొందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ శ్రీమతి సిరిపురపు లలిత కుమారి మాట్లాడుతూ, పతకాలు సాధించిన క్రీడాకారులను మెడల్స్ బహూకరించి అభినందిస్తూ, ఈ గ్రౌండ్లో అథ్లెటిక్స్ ఎక్కువమంది బాలికల శిక్షణ పొందటం హర్షణీయమని అలాగే ఈ గ్రౌండ్ కి కావలసిన అన్ని అవసరమైన సౌకర్యాలను కల్పించేందుకు తన వంతు సహకారం అందిస్తామని తెలిపారు. జిల్లా మైనారిటీ వెల్ఫేర్ ఆఫీసర్ సంజీవ్ రావు మాట్లాడుతూ, ఈ స్పోర్ట్స్ అథారిటీ గ్రౌండ్లో నిరంతరం అథ్లెటిక్స్ శిక్షణ కొనసాగుతుందని, ముఖ్యంగా తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజ్ విద్యార్థులు ఎక్కువ పతకాలు సాధించడం ప్రశంసనీయం అని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కనగల అనంత రాములు , ఈవెంట్ మేనేజర్ రమేష్ అథ్లెటిక్స్ కోచ్ పి. నాగేంద్ర ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెటిక్ అసోసియేషన్ సెక్రటరీ కె. మహిధర్ , డిగ్రీ కాలేజ్ పీడీ శ్వేత మరియు చావా రవి పాల్గొన్నారు.

# అసంపూర్తిగా ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం

- సాంఘిక శక్తులకు అడ్డాగా మారిన ఎస్సీ కమ్యూనిటీ హాల్
- నిధులు అయిపోయాయని చేతులెత్తేసిన సదరు కాంట్రాక్టర్
- స్థానిక ఎమ్మెల్యే నిధులు మంజూరు చేయాలి
- ఎస్సీ కమ్యూనిటీ హాల్ యుద్ధ ప్రాతిపరిచిన పనులు చేపట్టాలి
- ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణంపై దళిత సంఘాల ఆగ్రహం
- నిర్మాణం చేపట్టకపోతే దశల వారి పోరాటానికి సిద్ధం
- . ప్రకటన విడుదల చేసిన అల్లాడి పౌల్రాజ్, అలవాల రాజా, గడ్డం సుధాకర్ రావు



**భద్రాచలం, విశాలభారతి:**

భద్రాచలం పట్టణం భగవందాస్ కాలనీలో ఆనాటి ఎమ్మెల్యే సున్నం రాజయ్య నిధుల ద్వారా మంజూరైన ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం అసంపూర్తిగా ఉండటం వలన దళితుల కు తీరని అన్యాయం జరుగుతుందని షెడ్యూల్ క్యాస్ట్ జేఏసీ నాయకులు అల్లాడి పౌల్రాజ్ ,అలవాల రాజా, గడ్డం సుధాకర్ రావు ఆవేదన వ్యక్తపరిచారు. ఈ సందర్భంగా వారు ఎస్సీ కమిటీ హాల్ ని సందర్శించి వారు మాట్లాడుతూ ఎస్సీ కమిటీ హాల్ మొత్తం కూడా చెట్లతో నిండి ఆసాంఘిక శక్తులకు అడ్డాగా మారటం అత్యంత దారుణమైన అంశంగా తీసుకోవాలని వారు తెలిపారు. ఏండ్లు గడుస్తున్న ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం అసంపూర్ణంగా ఉండటం సరైనది కాదని ఎస్సీ లో ఉన్న 59 కులాల వారు పెండ్లి, శుభకార్యాలు, అశుభ కార్యాలు ఇతరత్రా కార్యాలు చేసుకునేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఇతర ఫంక్షన్ హాల్ లో డబ్బులు చెల్లించలేక సతమతం అవుతున్నారని దాని దృష్టిలో పెట్టుకొని గతంలో ఎమ్మెల్యే సున్నం రాజయ్య టిఆర్ఎస్ గవర్నమెంట్లో నిధులు రాబట్టి ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టేందుకు పూనుకున్నారని కానీ నేటి కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, ఉప ముఖ్యమంత్రి, వంటి ప్రజా ప్రతినిధులు ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణంపై నిర్లక్ష్య వైఖరి కనిపిస్తుందని తక్షణమే దళితులపైన ప్రేమ ఉంటే యుద్ధ ప్రాతిపదికన ఎస్సీ కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టాలని వారు పేర్కొన్నారు. లేనిపక్షంలో 59 ఉపకులాల వారిని ఐక్యపరిచి ఐక్య కార్యచరణ ద్వారా దశల వారి ఉద్యమాలకు నాంది పలుకుతామని వారు ఈ సందర్భంగా తెలియజేశారు.



# తమిళంలో బంపరాఫర్

**'కాంతార-2' చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపును దక్కించుకుంది కన్నడ భామ రుక్మిణి వసంత్. ప్రస్తుతం ఈ సొగసరి భారీ ఆఫర్లతో బిజీగా ఉంది. ఇప్పటికే తెలుగులో ఎన్టీఆర్ 'డ్రాగన్', కన్నడంలో యశ్ 'టాక్సిక్'లో కథానాయికగా నటిస్తున్న ఆమె తాజాగా తమిళంలో అగ్ర హీరో ధనుష్ సరసన నటించే అవకాశాన్ని దక్కించుకుంది. ధనుష్ తన 57వ చిత్రాన్ని తమిళరసన పద్యముత్తు దర్శకత్వంలో చేయబోతున్నారు. ఇందులో కథానాయికగా రుక్మిణి వసంత్‌ను ఖరారు చేశారు. తమిళంలో ఏస్, మదరాసి చిత్రాలు ఆమెను నిరాశపరిచాయి. ఈ నేపథ్యంలో కోలీవుడ్‌లో మంచి బ్రేక్‌నిచ్చే సినిమా కోసం ఎదురుచూస్తున్నదీ భామ. తాజా ఆఫర్‌తో తమిళంలో రుక్మిణి కెరీర్ మలుపు తిరగడం ఖాయమంటున్నారు.**

Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.